RNI No.TELTEL/2005/16755

# ప్రజాబలం

PRAJABALAM Telugu Daily తెలుగు దినపత్రిక

Website: prajabalam.in




హైదరాబాద్ | 24 జనవరి 2026 శనివారం | పేజీలు:12 | వెల రూ.2.00 | సంపుటి:21 | సంచిక:197

## ఆధారాలు, రికార్డులు ముందుంచి కేటీఆర్‌ను విచారణ జరిపాం

### తప్పుడు కథనాలతో సంబంధం లేదు సిట్ చీఫ్ సజ్జనార్





మాజీ మంత్రి కేటీఆర్ ఫోన్ ట్యాపింగ్ కేసులో సిట్ విచారణకు శుక్రవారం హాజరైన విషయం తెలిసిందే. ఈ విచారణ అనంతరం సిట్ చీఫ్ సజ్జనార్ స్పందించారు. ఆధారాలు, రికార్డులు ముందుంచి కేటీఆర్‌ను విచారణ జరిపామని స్పష్టం చేశారు.

హైదరాబాద్, జనవరి23 మాజీ మంత్రి కేటీఆర్ (KTR) ఫోన్ ట్యాపింగ్ కేసులో సిట్ విచారణకు శుక్రవారం హాజరైన విషయం తెలిసిందే. ఈ విచారణ అనంతరం సిట్ చీఫ్ సజ్జనార్ స్పందించారు. ఆధారాలు, రికార్డులు ముందుంచి కేటీఆర్‌ను విచారణ జరిపామని స్పష్టం చేశారు. సాక్ష్యులను ప్రభావితం చేయొద్దని చెప్పామని తెలిపారు. అవసరమైతే మళ్లీ విచారణకు పిలుస్తామని చెప్పామని ప్రస్తావించారు. కేటీఆర్‌ను ఒంటరిగానే విచారించామని సజ్జనార్ పేర్కొన్నారు.

తప్పుడు కథనాలతో సంబంధం లేదు..

ఫోన్ ట్యాపింగ్ కేవలం భద్రతా కారణాల దృష్ట్యా మాత్రమే జరిగిందని వివరించారు. ఇందులో ఎలాంటి చట్టవ్యతిరేకత లేదని కొన్ని మీడియా వర్గాలు, వ్యక్తులు నిరాధారమైన, తప్పుదోవ పట్టించే సమాచారాన్ని ప్రచారం చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని వెల్లడించారు. దర్యాప్తు సంస్థకు ఇలాంటి తప్పుడు కథనాలతో సంబంధం లేదని స్పష్టం చేశారు. ఈ దర్యాప్తు పూర్తిగా చట్టప్రకారం, నిష్పక్షపాతంగా, వృత్తిపరమైన ప్రమాణాలతో జరుగుతోందనిపేర్కొన్నారు. రాజకీయ నాయకులు, వ్యాపారవేత్తలు, జర్నలిస్టులు, న్యాయమూర్తులు, ప్రముఖులతో సహా వేలాది మంది పౌరుల ఫోన్లను అనధికారికంగా, చట్టవిరుద్ధంగా ఇంటర్‌సెప్షన్ (ట్యాపింగ్), నిఘా పెట్టారనే ఆరోపణలపై తాము విచారణ చేస్తున్నామని సజ్జనార్ స్పష్టం చేశారు.

## మేడారం జాతరలో తాగునీటి సరఫరాకు 5500 నల్లాల ఏర్పాటు

ప్రజాబలం ప్రత్యేక కథనం 4 లో

## ఫోన్ ట్యాపింగ్ పై కేటీఆర్ ఆత్మపరిశీలన చేసుకోవాలి:

### టిపిసిసి చీఫ్ మహేష్ కుమార్ గౌడ్



**హైదరాబాద్ ప్రజాబలం ప్రతినిధి** హైదరాబాద్ జనవరి 23 : ఫోన్ ట్యాపింగ్ పై బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ ఆత్మపరిశీలన చేసుకోవాలని, వ్యక్తిగత హననం చేస్తున్నారని కెటిఆర్ అనడం హాస్యాస్పదం టిపిసిసి చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. రాజకీయ కక్ష ఉంటే అధికారంలోకి రాగానే చర్యలుండేవని, ఫోన్ ట్యాపింగ్.. వ్యక్తిగత స్వేచ్ఛకు భంగం కలిగించినట్లేనని చెప్పారు. ఆరోపణలు చేసి పారిపోతామంటే కుదరదని సూచించారు. అలీబాబా 420 దొంగల మాదిరి మాజీ సిఎం కెసిఆర్ కుటుంబం దోపిడి చేశారని మండిపడ్డారు. తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవితను చెల్లెలుగా ఎప్పుడూ గౌరవిస్తానని, వాటాల పంపకాల్లో తేడా వల్లే కెసిఆర్ కుటుంబంలో గొడవలు అని తెలియజేశారు. ఇప్పటికైనా కవిత నిజాలు మాట్లాడటాన్ని స్వాగతిస్తున్నానని, ఎఐసిసి ఇన్ చార్జ్ మార్పు ఉండదని మహేష్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు



ప్రజాబలం

24 జనవరి 2026 శనివారం

## మాయమై పోతున్నడమ్మా మనిషన్నవాడు

మాయమై పోతున్నడమ్మా మనిషన్నవాడు అనే పాటను అందెశ్రీ ఏ టైంలో పాడాడో కానీ. ఆర్థిక సంబంధాలతో ముడిపడి ఉన్న సమాజంలో మానవత్వం మంట కలుస్తోంది. ఆస్తి కోసమో, పడక సుఖం కోసమో క్షణికావేశంలో చంపేస్తున్నారు.. తెల్లారిలేస్తే భర్తను చంపిన భార్య, భార్యను చంపిన భర్త, ఆస్తి కోసం తండ్రి అంత్యక్రియలను నిలిపివేశాడు కుమారుడు ఇవే కనిపిస్తున్నాయి. తన వివాహేతర సంబంధానికి అడ్డుగా ఉన్నాడని భావించి ప్రియుడితో కలిసి భర్తను చంపిన భార్య.. ప్రియురాలితో కలిసి జీవించేందుకు భార్య ప్రాణాలు తీసిన భర్త! ఇటీవలికాలంలో తరచుగా కనిపిస్తున్న వార్తలివి!! భర్త ఎల్లప్పుడూ తిడతాడనో.. భార్య సాధిస్తోందనో.. కారణాలేవైనాగానీ ఇతరుల పట్ల ఆకర్షితులవుతున్నవారి సంఖ్య పెరుగుతోంది. వివాహేతర బంధాలు కాపురాల్లో చిచ్చు పెడుతున్నాయి! నిండు సంసారాల్లో నిప్పులు పోస్తున్నాయి!! బంధుమిత్రుల ఆశీస్సులతో అల్లుకున్న పవిత్ర బంధం క్షణిక సుఖాల ప్రకంపనలతో కుప్పకూలుతోంది. వలచినవారి కోసం కట్టుకున్నవారే కాలయములుగా మారడం.. జీవిత భాగస్వామిని అత్యంత క్రూరంగా చంపి.. శవాన్ని ముక్కలు చేయడం, తగలబెట్టేయడం, రాళ్లు కట్టి జలసమాధి చేయడం ఆందోళన కలిగిస్తోంది. కడకంటా ఒకరికొకరు తోడుండాల్సిన దంపతులు.. తాత్కాలిక ఆకర్షణలకు లోనై ప్రాణాలు తీసే స్థాయికి దిగజారడం సామాజిక విలువల పతనానికి అద్దం పడుతోంది. వివాహేతర సంబంధాల కారణంగా ఒళ్లు గగుర్పొడిచే ఇలాంటి అత్యంత క్రూరమైన హత్యలు గత ఏడాది కాలంలో రెండు తెలుగు రాష్ట్రాల్లో 705 నమోదయ్యాయంటే పరిస్థితి తీవ్రతను అర్థం చేసుకోవచ్చు. తెలుగు గడ్డపై రోజుకో చోట నమోదవుతున్న ఈ తరహా దారుణహత్యలు, అక్రమ సంబంధాల నేపథ్యంలో జరుగుతున్న ఘోరాలు సమాజానికి ఒక హెచ్చరికను పంపిస్తున్నాయి. గతంలో భార్యాభర్తల మధ్య గొడవలు వస్తే.. పెద్దలు కూర్చుని పరిష్కరించేవారు. దంపతులు కూడా పెద్దలు చెప్తే విని.. ఓర్పు, సహనంతో వ్యవహరించేవారు. కానీ, ఇటీవలికాలంలో ఓర్పు, సహనం తగ్గి 'ఈగో' మరింత పెరగడం.. భాగస్వామితో గొడవైనప్పుడు సోషల్ మీడియా ద్వారానో, ఇంటి చుట్టుపక్కలో పరిచయమైన పరాయి వ్యక్తుల సాన్నిహిత్యానికి ఆకర్షితులు కావడం పెరుగుతోంది. ఆ తాత్కాలిక వ్యామోహాలు చివరకు హత్యలకు సైతం దారితీస్తున్నాయి. గడిచిన ఐదేళ్ల కాలంలో (2021 నుంచి 2025 నడుమ) ఈ తరహాలో 2,725 హత్యలు జరిగాయని గణాంకాలు చెబుతున్నాయి. తెలుగు రాష్ట్రాల్లో నమోదైన మొత్తం హత్య కేసుల్లో 20 నుంచి 25? మేర ఈ తరహావే ఉంటున్నాయి.టీవీలు, ఓటీటీలు, సోషల్ మీడియా.. ఇవేవీ లేని కాలంలో భార్యాభర్తల మధ్యే కాదు, కుటుంబంలో అందరి మధ్య అనుబంధాలు, ఆత్మీయతలు ఉండేవి! ఇంటి హాల్లోకి టీవీలు, వాటికి కేబుల్ కనెక్షన్లు వచ్చాక.. ఒకరితో మరొకరు మాట్లాడుకోవడం తగ్గింది. ఆ టీవీలతోపాటు ఫోన్లు సైతం బెడ్‌రూమ్‌లోకీ చొచ్చుకొచ్చాక.. జీవితాల్లోకి సోషల్ మీడియా భూతం ప్రవేశించాక.. ఎవరి లోకం వారిదే అన్నట్టుగా తయారైంది. భార్యాభర్తలు ఒకే మంచం మీద ఉన్నా.. ఇద్దరూ తమ ఫోన్లలో మునిగిపోతున్నారు. మనసు విప్పి మాట్లాడుకునే సమయం లేకపోవడం వల్ల బయటి వ్యక్తుల 'హాయ్'లు, 'గుడ్ మార్నింగ్'లు ఆకర్షణీయంగా కనిపిస్తున్నాయి. సోషల్ మీడియాలో వచ్చే లైక్‌లు, కామెంట్‌లు నిజమైన ప్రేమ అని భ్రమపడుతున్నారు. ఆ మాయలో పడి నూరేళ్ల బంధాన్ని కాలరాస్తున్నారు. 60 శాతం వివాహేతర సంబంధాలకు కారణం స్మార్ట్‌ఫోన్లు, సోషల్ మీడియానే అని తేలుతోంది!సినిమాలు, వెబ్ సిరీ?సలలో విచ్చలవిడి లైంగిక సంబంధాలను ఒక గొప్ప జీవనశైలిగా చూపడం, నేరం చేసి ఎలా తప్పించుకోవాలో విశదీకరించడం బలహీన మనస్తత్వం గలవారిని ప్రభావితం చేస్తోంది. హత్యలను గ్లామరైజ్ చేయడం వల్ల.. తప్పు చేసినా దొరకకుండా ఉండొచ్చనే భ్రమలో చాలా మంది నేరాలకు పాల్పడుతున్నారు. జీవిత భాగస్వామి నచ్చకపోతే.. వేరొకరితో బంధమే కావాలని బలంగా అనిపిస్తే.. విడాకులు తీసుకోవచ్చు. ఒకప్పుడు విడాకులు తీసుకున్నవారిని చిన్నచూపు చూసేవారుగానీ.. ఇటీవలికాలంలో అది అసలు పెద్ద విషయమే కాదన్నట్టుగా పరిస్థితి మారింది. అయినా, ఆ ప్రత్యామ్నాయాన్ని చాలా మంది ఎంచుకోవట్లేదు. వెబ్‌సిరీ?సల్లోనో, సినిమాల్లోనో, యూట్యూబ్‌లోనో చూసి హత్యలకు పాల్పడుతున్నారు. అద్భుతమైన టెక్నాలజీ అందుబాటులో ఉన్న ఈ రోజుల్లో హత్య చేసి తప్పించుకోవడం దాదాపు అసాధ్యమనే విషయం కూడా వారికి అర్థం కానంత మత్తులో కూరుకుపోవడమే ఈ హత్యలకు కారణం. గతంలో ఈ తరహా హత్యలు క్షణికావేశంలో జరిగేవి. కానీ, ఇప్పుడు రోజుల తరబడి ప్రణాళికలు రచించి.. సుపారీ సైతం ఇచ్చి కిరాయి హంతకులతో చంపిస్తున్న ఘటనలు 40? పెరిగాయి! గ్రామీణ ప్రాంతాలతో పోలిస్తే.. పట్టణ ప్రాంతాల్లో ఈ తరహా నేరాలు ఎక్కువగా నమోదవుతున్నాయి. హత్యలే కాదు.. తమ వివాహేతర సంబంధం గురించి జీవితభాగస్వామికి/ఇతరులకు తెలిసిపోయిందన్న అనుమానంతో/అవమానంతో, భాగస్వామి చేతిలో మోసపోయామన్న బాధతో ఆత్మహత్య చేసుకుంటున్నవారూ ఉన్నారు. గతంతో పోలిస్తే ఈ తరహా ఆత్మహత్యలు 18? దాకా పెరిగాయని గణాంకాలు చెబుతున్నాయి.భార్యాభర్తల్లో ఎవరో ఒకరు వేసే తప్పటడుగు.. వారి పిల్లల పాలిట శాపంగా మారుతోంది. వివాహేతర సంబందాల వల్ల ఎక్కువగా నష్టపోతోంది అమాయకమైన పిల్లలే. గత ఐదేళ్లలో ఈ తరహా హత్యల వల్ల దాదాపు 2500 మందికి పిల్లలు అనాథలయ్యారని గణాంకాలు చెబుతున్నాయి. 'తల్లిని చంపి తండ్రి (లేదా) తండ్రిని చంపి తల్లి జైలుకు వెళ్తే.. ఆ పిల్లల పరిస్థితి ఏమిటి? ఏం పాపం చేశారని వారికి శిక్ష అనే ఆలోచనే మనసులను కలచివేస్తుంది. అమ్మానాన్నల్లో ఒకరు కాటికి.. మరొకరు జైలుకు వెళ్తే.. ఆ పిల్లల గోడు ఎవరికి వినబడుతుంది? తల్లిదండ్రుల మధ్య గొడవలు, ఒకరిని ఒకరు చంపుకోవడం చూసిన ఆ పసి మనసులు ఎంతగాయపడతాయో కదా! రేపటి పౌరులుగా ఎదగాల్సిన పిల్లలు.. అనాథలుగా మారి నేరగాళ్ల నీడలో పెరిగితే? పెరిగి పెద్దయ్యాక నేరగాళ్లుగా మారితే.. ఆ తప్పెవరిది?వివాహేతర సంబంధాల నేపథ్యంలో జరుగుతున్న హత్యల ఉపద్రవం నుంచి బయటపడాలంటే.. మన ఆలోచన తీరు మారాలి. భాగస్వామిపై అనుమానం కలిగితే నిఘా పెట్టడం మానేసి నేరుగా మాట్లాడాలి. మనస్పర్థలు వస్తే.. మూడో వ్యక్తితో కాకుండా భాగస్వామితో చర్చించాలి. సమస్య తీవ్రమైతే కౌన్సెలింగ్‌ను ఆశ్రయించాలి. ఫోన్లను పక్కన పెట్టి.. భాగస్వామితో, పిల్లలతో ఎక్కువ సమయం గడపాలి. చిన్నతనం నుంచే కుటుంబ వ్యవస్థ పట్ల పిల్లల్లో గౌరవాన్ని పెంచాలి. భాగస్వామి తప్పు చేశారని తెలిసినప్పుడు (లేదా) వారికి బదులుగా వేరొకరు నచ్చినప్పుడు.. చట్టబద్ధంగా విడాకులు తీసుకుని విడిపోయే అవకాశం కూడా ఉంటుంది. హత్య చేసి జీవితాన్ని నాశనం చేసుకోవడం పరిష్కారం కాదు. ఆవేశంలో చేసే హత్యలు జీవితాన్ని జైలు గోడల మధ్య బంధిస్తాయి.. పిల్లల భవిష్యత్తును అంధకారం చేస్తాయి.

## రాష్ట్రంలో పాలన పిచ్చోడి చేతిలో రాయిలా మారింది: కెటిఆర్



**హైదరాబాద్ ప్రజాబలం ప్రతినిధి**హైదరాబాద్ జనవరి 23 ఎన్ని కేసులు పెట్టినా.. భయపడకుండా రాష్ట్రం కోసం పోరాడిన నాయకత్వం తమ పార్టీది అని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ కొనియాడారు. అనుక్షణం ప్రజలు, రాష్ట్రం కోసమే పనిచేశామని అన్నారు. ఫోన్ ట్యాపింగ్ పేరుతో జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్‌లో సిట్ విచారణకు వెళ్తున్న నేపథ్యంలో తెలంగాణ భవన్ లో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. పదేళ్లు రాష్ట్రం కోసమే పనిచేశామని, తాము ఎప్పుడూ తప్పుడు పనులు చేయలేదని తెలియజేశారు. రెండేళు టైమ్ పాస్ చేసుకుంటూ వచ్చారని, తాము ఎప్పుడూ టైమ్ పాస్ కార్యక్రమాలు చేయలేదని అన్నారు. ప్రతిపలను ఎప్పుడూ వేధించలేదని, ఎంక్వైరీలకు భయపడేది లేదని కెటిఆర్ పేర్కొన్నారు. రాష్ట్రంలో పాలన పిచ్చోడి చేతిలో రాయిలా మారిందని విమర్శించారు. అప్పుడు దొరికిన ఆ దొంగ.. ఇప్పుడు ముఖ్యమంత్రి అయ్యాడని ఎద్దేవా చేశారు. రోజుకో అంశంలో డ్రామా చేస్తున్నారని, పుట్టిన భూమి సాక్షిగా తాను ఎప్పుడూ అక్రమ, అనైతిక పనులు చేయలేదని అన్నారు. తాను డ్రగ్స్ తీసుకుంటానని, హీరోయిన్లతో సంబంధాలు ఉన్నాయని వ్యక్తిత్వహననం చేశారని మండిపడ్డారు. ఫోన్ ట్యాపింగ్ పేరుతో డైలీ సీరియల్ లా లీకులు ఇచ్చి తమ వ్యక్తిత్వహననం చేస్తున్నారని.. తన పరువు, ప్రతిష్టకు కలిగిన నష్టానికి ఎవరు బాధ్యులు అని కెటిఆర్ ప్రశ్నించారు.

## కెసిఆర్ కుటుంబం తెలంగాణ అస్థిత్వాన్ని దెబ్బతీస్తోంది: అద్దంకి

**హైదరాబాద్ ప్రజాబలం ప్రతినిధి** హైదరాబాద్ జనవరి 23 తెలంగాణను దోచుకున్న దొంగలు.. బిఆర్ఎస్ నేతలు అని కాంగ్రెస్ ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై బిఆర్ఎస్ నేతలు దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. అధికారంలో ఉన్నప్పుడు మాజీ సిఎం కెసిఆర్, బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్, మాజీ మంత్రి హరీష్ రావు, తెలంగాణ జాగృతి అధ్యక్షురాలే కవిత దోచుకున్నారని, ఇప్పుడు కెసిఆర్, కెటిఆర్, హరీష్ లు చెలరేగిపోతున్నారని ధ్వజమెత్తారు. మీ మీద వస్తున్న ఆరోపణలు నాటి ం మంత్రిపై ఎందుకు రావడం లేదు? అని ప్రశ్నించారు. ఆనాడు మంత్రివర్గాన్ని ఒక డమ్మీ కేబినెట్ గా నడిపించారని, సిఎం రేవంత్ రెడ్డి కేబినెట్ పై అవాకులు.. చెవాకులు మాట్లాడితే ఊరుకోమని అద్దంకి హెచ్చరించారు. తాము రాజ్యాంగానికి కట్టుబడి ఉంటామని అన్నారు. కెసిఆర్ కుటుంబం తెలంగాణ అస్థిత్వాన్ని దెబ్బతీస్తోందని మండిపడ్డారు. కక్ష సాధించాలంటే ప్రభుత్వానికి రెండేళ్లు ఆగాల్సిన పనిలేదని అద్దంకి దయాకర్ పేర్కొన్నారు.



## బిఆర్ఎస్ నేతలను ఇబ్బంది పెట్టాలని చూస్తోన్న రేవంత్ ప్రభుత్వం

## ఫోన్ ట్యాపింగ్ అనేది రాజకీయ ప్రేరేపిత కేసు: హరీష్ రావు



హైదరాబాద్ జనవరి 23 : రేవంత్ రెడ్డి ప్రభుత్వం బిఆర్ఎస్ నేతలను ఇబ్బంది పెట్టాలని చూస్తోందని బిఆర్ఎస్ ఎంఎల్ఎ హరీష్ రావు మండిపడ్డారు. ఫోన్ ట్యాపింగ్ అనేది రాజకీయ ప్రేరేపిత కేసు అని విమర్శించారు. మమ్మల్ని వేధించిన అధికారులు రిటైర్ అయినా వదలబోమన్నారు. మళ్లీ వచ్చేది బిఆర్ఎస్ ప్రభుత్వమేనని, అధికారులు న్యాయబద్ధంగా వ్యవహరించాలని సూచించారు. మమ్మల్ని ఇబ్బందులు పెట్టిన అధికారులను వదిలేదే లేదని, సప్తసముద్రాల అవతల దాక్కున్నా పట్టుకుని వస్తామని, అధికారులు రేవంత్‌రెడ్డి డైరెక్షన్‌లో కాకుండా చట్టబద్ధంగా వ్యవహరించాలన్నారు. రెండు రోజుల క్రితం ఫోన్ ట్యాపింగ్ కేసులో హరీష్ రావును సిట్ అధికారులు ప్రశ్నించిన విషయం తెలిసిందే.

## కెటిఆర్‌ను ఫోన్ ట్యాప్ చేసినందుకు పిలిచారా? లేక కెటిఆర్ ఫోన్ ట్యాప్ అయినందుకు పిలిచారా?

### ప్రభుత్వాన్ని ప్రశ్నించిన కేంద్రమంత్రి బండి సంజయ్

కరీంనగర్ జనవరి 23 బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్‌ను ఫోన్ ట్యాప్ చేసినందుకు పిలిచారా? లేక కెటిఆర్ ఫోన్ ట్యాప్ అయినందుకు పిలిచారా? అని ప్రభుత్వాన్ని కేంద్రమంత్రి బండి సంజయ్ ప్రశ్నించారు. కరీంనగర్ లో ఆయన మీడియాతో మాట్లాడారు. ఫోన్ ట్యాపింగ్ కేసు సిరిసిల్ల కేంద్రంగా సాగిందని, ఫోన్ ట్యాపింగ్ ద్వారా వేల కోట్ల రూపాయల దందా సాగిందని ఆరోపణలు చేశారు. సినిమా హీరోయిన్ల ఫోన్లు ట్యాప్ చేసి ఎలా లబ్ధిపొందారా తనకు తెలుసునన్నారు. అన్ని కేసుల్లో సిట్ విచారణలకు ముగింపు ఉంటుందని, ఫోన్ ట్యాపింగ్‌లో మాత్ర సీరియల్‌లా ముగింపు లేదని ఎద్దేవా చేశారు. సిట్ విచారణలో అధికారులకు ఎంత స్వేచ్ఛ ఇచ్చారనేది అనుమానంగా ఉందని, రాష్ట్ర ప్రభుత్వ తీరుతో సిట్ అధికారులు బాధపడుతున్నారని, అసలు కెటిఆర్ ఎందుకు పిలిచారు? అని బండి ప్రశ్నించారు. సిరిసిల్ల కేంద్రంగా ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం నడిచిందని, ఫోన్ ట్యాపింగ్ కీలక సూత్రధారి ప్రభాకర్‌రావుపై ఎప్పుడు చర్యలు తీసుకుంటున్నారని, విచారణలో సిట్ సాధించిందేంటి? అని అడిగారు. మాజీ సిఎం కెసిఆర్ కూతురే తన ఫోన్ ట్యాప్ అయిందని చెప్పారని, ట్యాపింగ్‌కి భయపడి ఓ ఏడాది పాటు హరీష్ ఫోన్ ఉపయోగించలేదన్నారు. కెసిఆర్ హయాంలో బిచ్చగాళ్లు కూడా వాట్సాప్ కాల్ మాట్లాడాల్సిన పరిస్థితి ఉండేదని, తనని కూడా విచారించి వాంగ్మూలం తీసుకున్నారని, కానీ ఇప్పటివరకు చర్యలు తీసుకోలేదని విమర్శించారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్‌లో విచారణకు హాజరవుతున్నారు. రెండో రోజుల క్రితం హరీష్ రావును సిట్ అధికారులు విచారించిన విషయం విధితమే.



## ఫోన్ ట్యాపింగ్ నేరం కాదు.. ఇది చట్టబద్ధమే:

## ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్



**హైదరాబాద్ ప్రజాబలం ప్రతినిధి**హైదరాబాద్ జనవరి 23 : తెలంగాణను దేశంలో నెంబర్ వన్ గా తీర్చిదిద్దాలని మాజీ సిఎం కెసిఆర్ కృషి చేశారని బిఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ తెలిపారు. అలవికాని హామీలు ఇచ్చి సిఎం రేవంత్ రెడ్డి ప్రజలను మోసం చేశారని అన్నారు. ఫోన్ ట్యాపింగ్ కేసు విషయంలో తెలంగాణ భవన్ లో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. మాజీ మంత్రి హరీష్ రావు, బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్, ఎమ్మెల్సీలపై అక్రమ కేసులు పెడుతున్నారని విమర్శించారు. కేసులు పెడుతున్నా.. తెలంగాణ ప్రజల కోసమే బిఆర్ఎస్ నేతలు పోరాటం చేస్తున్నారని తెలియజేశారు. రెండేళ్లుగా ఫోన్ ట్యాపింగ్ పేరుతో కేసులు పెడుతున్నారని, రేవంత్ రెడ్డి అటెన్షన్ డైవర్షన్ చేస్తున్నారని మండిపడ్డారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో కెటిఆర్ కు సంబంధం లేదని, ఈ కేసుతో సంబంధం లేదని తమ పార్టీ నేతలను పిలిచి విచారణ చేయడాన్ని బిఆర్ఎస్ ఖండిస్తోందని అన్నారు. ఫోన్ ట్యాపింగ్ నేరం కాదు.. ఇది చట్టబద్ధమేనని ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ పేర్కొన్నారు. దేశ భద్రత కోసం, ప్రజల రక్షణ కోసం ఫోన్ ట్యాపింగ్ చేస్తారని, స్వాతంత్రం రాకముందు నుంచి ఫోన్ ట్యాపింగ్ చట్టబద్ధంగా ఉందని అన్నారు. మాజీ అధికారిగా చెప్తున్నా.. ట్యాపింగ్ నేరం కాదని పార్లమెంట్ సాక్షిగా దివంగత ప్రధాని మంత్రి మన్మోహన్ సింగ్ చెప్పారని, ఫోన్ ట్యాపింగ్ అనేది దేశరక్షణ కోసం పోలీసులు గోప్యంగా చేసే కారక్రమం అని.. అన్నారు. స్వాతంత్రం రాకముందే నుంచి ట్యాపింగ్ చట్టబద్దంగా ఉందని.. చట్టబద్దంగా జరుగుతున్న ట్యాపింగ్ వ్యవహారాన్ని రేవంత్ రెడ్డి బజారున పడేశారని ధ్వజమెత్తారు. ఎలా సమాచారం సేకరించారో అధికారులు ప్రధానికి, సిఎంకు, నేతలకు చెప్పరని, ట్యాపింగ్ అనేది పోలీసుల అంతర్గత వ్యవహారమని అన్నారు. అందులో భాగంగానే మొన్న హరీష్ రావును, ఇవాళ కెటిఆర్ ను వేధిస్తున్నారని, ట్యాపింగ్ తప్పు కాదని ఎన్నో సందర్భాల్లో రేవంత్ రెడ్డే చెప్పారని అన్నారు. సిఎం రేవంత్ రెడ్డి ఏం చేయమంటే అది అధికారులు చేస్తున్నారని, రాజకీయ వికృత క్రీడకు, ప్రతిపలపై ప్రతీకారం తీర్చుకునేందుకు ట్యాపింగ్ వ్యవహారాన్ని వాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ వ్యక్తిత్వాన్ని హననం చేసినా.. రేవంత్ సర్కార్ దోపిడీని బయటపెడుతునే ఉంటామని సూచించారు. దేశ రక్షణ గురించి రేవంత్ రెడ్డికి ఏమైనా బాధ్యత ఉందా? అని ప్రశ్నించారు. రేవంత్ రెడ్డి రాజకీయ క్రీడల్లో భాగస్వాములైన అధికారులను మాత్రం వదిలేది లేదని హెచ్చరించారు. పోలీసులతో సంబంధం లేని శాఖలకు మంత్రులుగా పనిచేసిన కెటిఆర్, హరీష్ రావుకు ట్యాపింగ్ తో సంబంధం ఏంటీ అని ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ప్రశ్నించారు.

# 25 న మల్కాజిగిరి లో స్టార్ మా సీరియల్స్ తారల సందడి!




**హైదరాబాద్ ప్రజాబలం ప్రతినిధి**హైదరాబాద్ జనవరి 23 ();స్టార్ మా 'పొదరిల్లు' జంట గ్రాండ్ వెడ్డింగ్ రిసెప్షన్ - హైదరాబాద్లో కనీవిని ఎరుగని టెలివిజన్ మ త్సవం జనవరి 25 ఆదివారం సాయంత్రం 6 గంటల నుండి హైదరాబాద్ లో మల్కాజిగిరిలో శ్రీ లక్ష్మీ సాయి గార్డెన్స్ ఫంక్షన్ హాల్, అనుటెక్స్ చౌరస్తా లో జరగనుంది.ఈ సందర్భంగా ఒకే వేదికపై తొలిసారి స్టార్ మా సీరియల్స్ తారల సందడి చేయనున్నారు.స్టార్ మా ఛానల్లో ప్రేక్షకుల మనసులు గెలుచుకున్న ప్రముఖ సీరియల్ 'పొదరిల్లు' హీరో-హీరోయిన్ వివాహ సందర్భంగా నిర్వహిస్తున్న గ్రాండ్ వెడ్డింగ్ రిసెప్షన్కు హైదరాబాద్ నగర ప్రజలను ఆహ్వానిస్తున్నారు.ఈ శుభసందర్భాన్ని మరింత ప్రత్యేకంగా మార్చేందుకు, స్టార్ మా లో ప్రసారమవుతున్న అన్ని ప్రముఖ సీరియల్స్కు చెందిన నటీనటులు ఒకే వేదికపై తొలిసారి సందడి చేయనున్నారు. తమ అభిమాన హీరో-హీరోయిన్ను ఆశీర్వదించడానికి, శుభాకాంక్షలు తెలపడానికి స్టార్ మా కుటుంబం మొత్తం ఈ వేడుకకు హాజరుకానుంది.ఇది కేవలం ఒక వివాహ వేడుక మాత్రమే కాదు..స్టార్ మా ప్రేక్షకులకు ఒక అరుదైన పండు!ఒకే చోట, ఒకే వేదికపై మీకు ఇష్టమైన అన్ని సీరియల్స్ తారలను ప్రత్యక్షంగా చూసే అవకాశం ఇదే తొలిసారి.ఈ గ్రాండ్ వెడ్డింగ్ రిసెప్షన్లో అభిమానులతో కలిసి సెలబ్రేట్ చేసుకోవాలని 'పొదరిల్లు' జంట ప్రత్యేకంగా హైదరాబాద్ ప్రజలను ఆహ్వానిస్తోంది.స్టార్ మా కుటుంబం మొత్తం ఒక్కటయ్యే ఈ మహా సంబరాన్ని మిస్ కాకండి!..మీ అభిమాన తారలతో కలిసి ఈ ఆనంద క్షణాలకు మీరు కూడా సాక్షులవ్వండి!

# ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డికి ఎన్ఫోర్స్మెంట్స్, ఎక్సైజ్ శాఖ అధికారులు దిమ్మతిరిగే షాక్

## మూసివేసిన వైన్ షాపులను దగ్గరుండి తెరిపించిన అధికారులు



**హైదరాబాద్ ప్రజాబలం ప్రతినిధి**హైదరాబాద్ జనవరి 23 యాదాద్రి భువనగిరి జిల్లా మునుగోడు నియోజకవర్గంలో ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డికి ఎన్ఫోర్స్మెంట్స్, ఎక్సైజ్ శాఖ అధికారులు దిమ్మతిరిగే షాక్ ఇచ్చారు. సంస్థాన్ నారాయణపూర్లో రాజగోపాల్ రెడ్డి అనుచరులు మూసివేసిన వైన్ షాపులను అధికారులు దగ్గరుండి తెరిపించారు. ఎక్సైజ్ శాఖ అధికారుల పహారాలో ఉదయం నుండి మద్యం అమ్మకాలు కొనసాగుతున్నాయి.కాగా, మా సార్ చెప్పిన టైంకే వైన్ షాపులు తెరవాలి. లేదంటే షాపులు మొత్తానికి మూసేస్తాం అని మునుగోడు నియోజకవర్గంలో వైన్ షాపుల ముందు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి అనుచరులు వీరంగం సృష్టించిన విషయం తెలిసిందే. నియోజకవర్గంలో వైన్ షాపులు మధ్యాహ్నం 1 గంటకు.. పర్మిట్ రూమ్ సాయంత్రం 6 గంటలకు తెరవాలని రాజగోపాల్ రెడ్డి హుకుం జారీ చేసినట్లు సమాచారం. దీంతో సంస్థాన్ నారాయణపూర్లో తెరిచి ఉన్న వైన్ షాపు నిర్వాహకులపై దాడికి తెగబడి, షాపును ఎమ్మెల్యే కోమటిరెడ్డి అనుచరులు మూసివేయించారు.దీంతో వైన్ షాపు నిర్వాహకులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో రంగంలోకి దిగిన అధికారులు ఉదయం నుంచే మందు బాబుల కోసం దగ్గరుండి షాపులు తెరిపించి ఎమ్మెల్యేకు షాక్ ఇచ్చారు. ఇప్పుడు మునుగోడులో ఇదే హాట్ టాఫిక్గా మారింది.

# ఆధార్ కార్డు ఉంటేనే ప్రసూతి చేస్తాంఆధార్ లేదు.. అమ్మను కాలేనా..?.. అంటూ.. మనోవేధనకు గురవుతున్న గర్భిణిపొట్టకూటి కోసం ఇతర రాష్ట్రాలు తిరిగే కుటుంబాల పరిస్థితి అగమ్య గోచరం



కరీంనగర్, జనవరి 23: పొట్టకూటి కోసం ఇతర రాష్ట్రాలు తిరిగే కుటుంబాలు తిమ్మాపూర్ మండలంలోని రామకృష్ణ కాలనీ గ్రామంలో ఎన్నో ఉన్నాయి. వారు వారి కుటుంబాలతో ఇతర రాష్ట్రాలకు వెళ్లిన సమయంలో పిల్లలు పుడితే, వారి పేరు నమోదు జాప్యం కావడంతో ఆధార్ లేక పిల్లలు పెద్దయ్యాక సతమతమవుతున్నారు. ప్రస్తుతం బేడ బుడగ జంగం సామాజిక వర్గానికి చెందిన 23 ఏండ్ల ఊబిది రేఖ గర్భవతి. వారి కుటుంబం ఆమె చిన్ననాటి నుంచే ఇతర రాష్ట్రాలలో చిన్న చిన్న పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నది.ఈ క్రమంలో ఆమె పుట్టిన సమయంలో అధికారికంగా పేరు ఎక్కడా నమోదు కాలేదు. దీంతో ఆమె ఆధార్ కార్డు తీసుకోవడంలో జాప్యం జరిగింది. అయితే ఆమె గర్భం ధరించిన నుండి ఆసుపత్రిలో చికిత్స కోసం వెళితే ఆధార్ కార్డు లేక ఇబ్బందులు పడుతోంది. ప్రస్తుతం నిండు గర్భిణీ కావడంతో కరీంనగర్ మాతా శిశు ఆసుపత్రిలో ఆధార్ కార్డు ఉంటేనే ప్రసూతి చేస్తామని డాక్టర్లు చెబుతున్నారని, తనకు ఆధార్ కార్డు లేదని ఆమె వాపోతోంది. ప్రైవేట్ దవాఖానకు వెళ్లి డెలివరీ చేయించుకునే ఆర్థిక స్థోమత తమకు లేదని, అధికారులు తనపై కనికరం చూపించి ఆధార్ కార్డు ఇప్పించి, తనకు గుర్తింపునివ్వాలని కోరుతోంది. తనకు ఆధార్ కార్డు లేకపోతే అమ్మను కాలేనా..? అని వాపోతోంది.

# చిల్కా నగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో వసంత పంచమి, నేతాజీ జయంతి వేడుకలు





**హైదరాబాద్ ప్రజాబలం ప్రతినిధి** హైదరాబాద్ జనవరి 23 )ఉప్పల్ మునిసిపాలిటి పరిధిలోని చిల్కా నగర్లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శుక్రవారం వసంత పంచమి సందర్భంగా చదువుల తల్లి సరస్వతి మాత జయంతితో పాటు నేతాజీ సుభాష్ చంద్ర బోస్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఉప్పల్ నియోజకవర్గ బీజేపీ కన్వీనర్ దేవసాని బాలచందర్ హాజరై విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు, నోటు పుస్తకాలు, పెన్నులు, మిఠాయిలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులందరినీ ఆయన అభినందించారు. వవ సందర్భంగా బాలచందర్ మాట్లాడుతూ, తాను కూడా తన బాల్యంలో ప్రభుత్వ పాఠశాలలోనే విద్యాభ్యాసం చేసినట్లు, ఉప్పల్ ఉన్నత పాఠశాలలో గడిపిన తన పాఠశాల జీవితాన్ని స్మరించుకుంటూ, ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు చదువుల్లో మరింత రాణించాలని ఆకాంక్షించారు.గురువుల పట్ల విధేయత, చదువుల పట్ల శ్రద్ధతో ముందుకెళ్లి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు.పదవ తరగతి పరీక్షల ప్రాధాన్యతను వివరిస్తూ, ప్రణాళికాబద్ధమైన చదువు, సమయాన్ని సక్రమంగా వినియోగించుకోవడం ద్వారా అన్ని సబ్జెక్టుల్లో ఉత్తమ ప్రతిభ కనబరచాలని సూచించారు. అలాగే 9వ తరగతి విద్యార్థులు కూడా ఇప్పటినుంచే సరైన ప్రణాళికతో చదివి 9-10 తరగతులకు అవసరమైన సామర్థ్యాలను పెంపొందించుకోవాలని హితవు పలికారు.ఈ సందర్భంగా ఆయన కీలక ప్రకటన చేస్తూ, పదవ తరగతిలో అత్యధిక మార్కుతో ఉత్తీర్ణులైన విద్యార్థికి రూ.5,000 నగదు బహుమతి, ద్వితీయ స్థానంలో ఉత్తీర్ణులైన విద్యార్థికి రూ.2,500 నగదు బహుమతి స్వయంగా అందజేస్తానని ప్రకటించారు.కార్యక్రమంలో విద్యార్థులు సరస్వతి మాత యొక్క గొప్పతనాన్ని, నేతాజీ సుభాష్ చంద్ర బోస్ జీవితం నుండి నేర్చుకోవలసిన విలువలను వివరించిన తీరు అందరినీ ఆకట్టుకుంది.ఈ కార్యక్రమంలో తిరుపతి సత్యనారాయణ, సంగి స్వామి యాదవ్, శామీర్పేట చంద్రయ్య, ఓర్స్ శేఖర్, బోద విద్యాసాగర్, ఐలేశ్వరి, ఆలే నరేంద్ర, జెర్రిపోతుల కిషన్, ప్రకాష్, కృష్ణారెడ్డి వివేక్, శివ, సందీప్, వెంకటాచారి, గౌతం, శ్రీకృష్ణ, తో పాటు పాఠశాల ఉపాధ్యాయుల బృందం తదితరులు పాల్గొన్నారు.

# టి-20 ప్రపంచకప్.. ఈడెన్ గార్డెన్స్కు ఐసిసి రేటింగ్..



కోల్కతా జనవరి 23;: టి-20 ప్రపంచకప్-2026 మరికొన్ని రోజుల్లో ప్రారంభం కానుంది. ఈ సారి భారత్, శ్రీలంక వేదికగా ఈ మెగా టోర్నీ జరుగనుంది. ఇప్పటికే టోర్నమెంట్ కోసం అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. అయితే గురువారం ఐసిసి, బిసిసిఐకి చెందిన ఉమ్మడి తనిఖీ బృందం కోల్కతాలోని ఈడెన్ గార్డెన్స్ స్టేడియంను సందర్శించాయి. స్టేడియంలోని సౌకర్యాలు, పిచ్ను పరిశీలించి సంతృప్తికరం అనే రేటింగ్ను ఇచ్చాయి. ఈ విషయాన్ని క్రికెట్ అసోసియేషన్ ఆఫ్ బెంగాల్(క్యాబ్) వెల్లడించింది. మాజీ క్రికెటర్ కార్పొరేట్ బాక్స్లను పరిశీలించి సౌకర్యాలపై ఆనందం వ్యక్తం చేసింద. మెగా టోర్నీని విజయవంతంగా నిర్వహించేందుకు ఐసిసి ఆసక్తిగా ఎదురుచూస్తోంది" అని క్యాబ్ పేర్కొంది. టి-20 ప్రపంచకప్-2026లో భాగంగా ఈడెన్ గార్డెన్స్ వేదికగా గ్రూప్ స్టేజీలో మొత్తం ఐదు మ్యాచ్లు జరుగుతాయి. మూడు ప్రారంభ మ్యాచుల్లో.. ఒక టి-20 ఈ మైదానం వేదిగానే జరగనుంది. పాకిస్థాన్ మ్యాచులు శ్రీలంకలో జరగనున్న విషయం తెలిసిందే. ఆ జట్టు ఫలితాల ఆధారంగా.. సూపర్ 8, సెమీఫైనల్ మ్యాచులు సైతం ఈ మైదానంలోనే నిర్వహించే అవకాశం ఉంది.

# పేద మహిళ అంత్యక్రియలకు వెస్సో సహాయం




**హైదరాబాద్ ప్రజాబలం ప్రతినిధి** హైదరాబాద్ జనవరి 23 ;రామోజు సత్యవతి(51), గృహిణి, రాజీవ్ శర్మ నగర్, విజయవాడ నివాసి, జనవరి 15న మృతి చెందారు. తల్లి అంత్యక్రియల ఖర్చులు భరించే స్థితిలో లేక వెస్సో ను సహాయం కోసం ఆశ్రయించాడు. వెస్సో ట్రస్టీలు స్పందించి, తల్లి అంత్యక్రియలు నిర్వహించేందుకు సతీష్ కు పదివేల రూపాయల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. సత్యవతి తీవ్రమైన మధుమేహంతో పాటు గ్యాంగ్రిన్ వ్యాధితో బాధపడుతూ ఉండగా, ఇటీవలే ఆమె రెండు కాళ్లు తొలగించాల్సి వచ్చింది. ఆమెకు మరింత చికిత్స కోసం సహాయం పొందేందుకు వడ్రంగి వృత్తిలో ఉన్న ఆమె అవివాహిత కుమారుడు సతీష్ (28) వెస్సో ట్రస్ట్ ను సంప్రదించి దరఖాస్తు సమర్పించే ప్రక్రియలో ఉండగానే ఆమె మరణించారు.సతీష్ తండ్రి తాతారావు (55 పైబడి), వృత్తిరీత్యా కార్పెంటర్, రెండు సంవత్సరాల క్రితమే మృతి చెందారు. ఉపాధి నిమిత్తం ఆయన చాలా సంవత్సరాల క్రితమే తుని నుంచి విజయవాడకు వలస వచ్చారు. సతీష్కు లావణ్య(22) అనే ఓ అవివాహిత సోదరి కూడా ఉంది, ఆమె హైస్కూల్ చదువు మధ్యలోనే మానివేసింది.తల్లి చికిత్స కోసం తన పొదుపు మొత్తాన్ని ఖర్చు చేసిన సతీష్, గత కొంతకాలంగా అనారోగ్యంతో ఉన్న తల్లిని చూసుకునేందుకు పనికి కూడా వెళ్లలేకపోవడంతో, ఈ సందర్భంగా వెస్సో ట్రస్ట్ అధ్యక్షులు బంగారు తాతారావు మాట్లాడుతూ అంత్యక్రియలు వంటి పుణ్యకార్యానికి మద్దతునిస్తున్న గౌరవదాతలు అందరకూ పేరుపేరునా ధన్యవాదములు తెలిపారు.

# రాబోయే తరానికి ఒక విజన్ ఉన్న నాయకుడు లోకేష్


## ఉరుకుంద ట్రస్ట్ బోర్డు మాజీ చైర్మన్ చెన్న బసప్ప

కౌతాళం రాష్ట్రానికి రాబోయే తరానికి ఒక విజన్ ఉన్న నాయకుడు నారా లోకేష్ అని ఉరుకుంద ట్రస్ట్ బోర్డు మాజీ చైర్మన్ చెన్న బసప్ప పేర్కొన్నారు. వారు మాట్లాడుతూ రాష్ట్రానికి పెట్టుబడులే లక్ష్యంగా, ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మారుస్తూ, పేద విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి వసతులు కల్పిస్తున్న ప్రభుత్వ బడుల్లో నాణ్యమైన విద్య, మెరుగైన సౌకర్యాల కోసం మీరు చూపిస్తున్న చొరవ భావి తరాల భవిష్యత్తుకు బంగారు బాటలు వేస్తోంది. కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటూ, రాష్ట్ర పునర్నిర్మాణంలో మీరు సాగిస్తున్న ప్రయాణం అద్భుతం. ఐటీ మరియు ఎలక్ట్రానిక్స్ రంగాల్లో ఆంధ్రప్రదేశ్ను అగ్రపథాన నిలిపేందుకు అహర్నిశలు శ్రమిస్తున్న తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధానకార్యదర్శి, ఐటీడవిద్యాశాఖ మంత్రి నారా లోకేష్ అని అన్నారు. జన్మదిన సందర్భంగా స్థానిక నివాసములు కార్యకర్తల మధ్య కేకును కట్ చేసి శుభాకాంక్షలు తెలియజేశారు.అనంతరం కస్తూరిబా గాంధీ బాలికల పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న విద్యార్థిని లకు జామెంట్రీ బాక్స్ మరియు పరీక్ష ప్యాడ్ బహుమతులు అంద జేశారు. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు సుబ్రహ్మణ్యం రాజు, కురుగోడ్,కాశీ విశ్వనాథ్,శేఖర్, రంగస్వామి, మంజు,రహిమాన్, రాజబాబు,సిద్దు, కోడిగుడ్ల రామాంజి, డెంగీ రఘురాం,చిరంజీవి,బుగ్గి నాగప్ప, పింజారి నబి బీజేపీ రామచంద్ర, ఉమేష్ గౌడ్, జనసేన నాయకులు భాషా,సులేకేరి, హనుమంత రెడ్డి,శివరామరెడ్డి,మరియు తెలుగుదేశం పార్టీ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# మేడారం జాతరలో తాగునీటి సరఫరాకు 5500 నల్లాల ఏర్పాటు

## పారిశుధ్య కార్యక్రమాలకు ప్రాధాన్యత. 5700 టాయిలెట్లు నిర్మాణం, 5000 శానిటేషన్ సిబ్బంది

ప్రజాబలం ప్రత్యేక కథనం





హైదరాబాద్: దేశంలోనే అతిపెద్ద గిరిజన జాతరగా పేరుగాంచిన మేడారం సమ్మక్క జాతరకు హాజరయ్యే కోట్లాది మంది భక్తులకు సురక్షిత తాగునీటి సౌకర్యం కల్పించడంతో పాటు మేడారం జాతర ప్రాంతం మొత్తంలో పారిశుధ్య కార్యక్రమాల నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత నిస్తోంది. ప్రధానంగా ఈ జాతరకు హాజరయ్యే భక్తులకు తాగునీటి సౌకర్యం, అన్ని టాయిలెట్ బ్లాక్స్ వద్ద నిరంతర నీటి సదుపాయం, అన్ని ప్రభుత్వ శాఖల వద్ద తాగునీటి సౌకర్యం, పెద్ద సంఖ్యలో టాయిలెట్ బ్లాకుల నిర్మాణం చేపట్టారు.

గ్రామీణ నీటి సరఫరా విభాగం-మిషన్ భగీరథ ఆధ్వర్యంలో దాదాపు 5500 తాత్కాలిక నల్లాలు ఏర్పాటు చేశారు. వీటిలో, 517 బ్యాటరీ ఆఫ్ టాప్స్, 47 సిస్టెర్న్లు, 312 సిస్టర్న్ టాప్స్ , 10 చలివేంద్రాలున్నాయి. 2024 జాతరలో 5222 నల్లాలు మాత్రమే ఏర్పాటు చేయగా ఈసారి జాతరకు 5500 నల్లాలు ఏర్పాటుచేయడం జరిగింది. ఈజాతరకు గాను రూ. 13.70 కోట్ల వ్యయంతో గ్రామీణ నీటి సరఫరా విభాగం- మిషన్ భగీరథ శాఖ ద్వారా 57 పనులను చేపట్టడం జరిగింది. గతంలో ఉన్న సదుపాయాలకు అదనంగా, ఒక అధికుల సామర్థ్యం కలిగిన బోర్ వెల్, రెండు బోరెవెల్-పంప్స్, ఐదు కొత్త సిస్టర్స్, ఒక కొత్త ఓ.ఎచ్.ఎస్.ఆర్, 26 టాయిలెట్ బ్లాక్స్, ఒక క్యూ-లైన్ నిర్మాణం, మరో 9 ఇతర పనులను చేపట్టి పూర్తి చేశారు. మేడారం ప్రధాన ఆలయం పరిసరాలు, జాతీయ రహదారి, పార్కింగ్ ప్రాంతాలు, వివిధ గ్రామాల నుండి వచ్చే దారులు, చెరువుల సమీపంలో ఈ తాగునీటి సౌకర్యంతోపాటు టాయిలెట్ లను ఏర్పాటు చేసారు.

### 5700 టాయిలెట్ల ఏర్పాటు

మేడారానికి వచ్చే లక్షలాది భక్తుల సౌకర్యార్థం మేడారం తోపాటు చుట్టూ పక్కల ప్రాంతాల్లో దాదాపు 5700 టాయిలెట్లను తాత్కాలికంగా నిర్మించారు. మొత్తం 285 టాయిలెట్ బ్లాకులుగా ఏర్పాటు చేసి వీటిని పరిశుభ్ర4రంగా నిర్వహించేందుకు 255 సిబ్బందిని ప్రత్యేకంగా నియమించారు.

### మేడారంలో పారిశుధ్య కార్యక్రమాల నిర్వహణకు 5000 శానిటేషన్ సిబ్బంది

ఈనెల 28 నుండి 31 తేదీ వరకు జరిగే మేడారం జాతరకు దాదాపు కోటిన్నర మంది భక్తులు హాజరవుతారని అంచనా వేస్తున్నారు. ఇంతటి భక్త జన సమూహానికి ఏవిధమైన ఇబ్బందులు కలుగ కుండా ఉండేందుకు ప్రభుత్వం గతంలో ఎన్నడూ లేని విధంగా ఈసారి అధిక సంఖ్యలో 5000 మంది పారిశుధ్య సిబ్బందిని ప్రత్యేకంగా నియమించింది. రోజుకు మూడు షిఫ్టులుగా పనిచేసి ఈ పారిశుధ్య సిబ్బంది, జాతర మొత్తం ప్రాంతాల్లో ఎప్పటికప్పుడు వ్యర్థాలు, చెత్తను ఏరివేస్తారు. పంచాయితీ రాజ్ శాఖ ఆధ్వర్యంలో చేపడుతున్న ఈ పారిశుధ్య కార్యక్రమాల నిర్వహణకు, జాతర మొత్తాన్ని 25 సెక్టారులుగా విభజించి 526 పర్యవేక్షక అధికారులను నియమించారు. సేకరించిన వ్యర్థాలు, చెత్తను ఎప్పటికప్పుడు తొలగించడానికి, 100 టాక్టర్లను ఏర్పాటు చేశారు. అదేవిధంగా, దుమ్ము, ధూళి లేవకుండా రహదారులపై నీటిని స్ప్రే చేయడానికి 150 వాటర్ ట్యాంకర్లను కూడా ఉపయోగిస్తున్నారు.

వీటితోపాటు పారిశుధ్య కార్యక్రమాల నిర్వహణలో, వరంగల్ నగర పాలక సంస్థ, ఇతర మున్సిపాలిటీలనుండి 40 స్వచ్ఛ ఆటోలను, 16 డోజర్లు, 13 మొబైల్ టాయిలెట్స్, 18 స్వీపెంగ్ యంత్రాలు, 12 జె.సి.బి లను కూడా ప్రత్యేకంగా ఉపయోగిస్తున్నారు.

# కోటి రూపాయల వ్యయంతో నిర్మించే డార్మెటరీ బిల్డింగులకు శంకుస్థాపన చేసిన రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ





వ్యవసాయం ఒక విజ్ఞానమని ఇప్పటివరకు ఉన్న జై జవాన్, జై కిసాన్, జై విజ్ఞాన్ నినాదం ప్రస్తుతం జై జవాన్, జై కిసాన్, జై విజ్ఞాన్ ,జై అనుసంధాన్ గా మారిందని రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అన్నారు.

శుక్రవారం ఆయన సూర్యాపేట జిల్లా, మఠంపల్లి మండలం, మట్టపల్లి లోని శ్రీ లక్ష్మీనరసింహస్వామిని సతీ సమేతంగా దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఆలయ అర్చకులు, వేద పండితులు,అధికారులు గవర్నర్ కు పూర్ణకుంభంతో స్వాగతం పలికి వేదాశీర్వచనం ఇచ్చి ప్రసాదం అందజేశారు.దేవాలయ ఆవరణలో వివిధ శాఖలు ఏర్పాటు చేసిన స్టాల్స్ ని సందర్శించి లబ్దిదారులు, విద్యార్థులతో ముఖాముఖి మాట్లాడారు. ఆ తర్వాత వేదిక వద్ద హుజూర్నగర్ సమీపంలోని ముగ్దుమ్ నగర్ వద్ద 100 ఎకరాలలో 150 కోట్ల రూపాయల వ్యయంతో నిర్మించనున్న వ్యవసాయ కళాశాలకు శంకుస్థాపన చేశారు .అంతేగాక కోదాడ సమీపంలో 50 కోట్ల రూపాయల వ్యయంతో నిర్మిస్తున్న జవహర్ నవోదయ విద్యాలయానికి శంకుస్థాపన చేయడమే కాక, మట్టపల్లి లక్ష్మీ నరసింహ స్వామి దేవాలయంలో కోటి రూపాయల వ్యయంతో నిర్మించనున్న యాత్రికా సదన్, నూతన కిచెన్ షెడ్ కు, మరో కోటి రూపాయల వ్యయంతో నిర్మించే డార్మెటరీ బిల్డింగులకు శంకుస్థాపన చేశారు.

ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో రాష్ట్ర గవర్నర్ మాట్లాడుతూ వసంత పంచమి రోజున పవిత్ర కృష్ణానది తీరాన ఉన్న మట్టపల్లి శ్రీ లక్ష్మీనరసింహ స్వామిని దర్శించుకోవడం సంతోషమని అన్నారు. అలాగే రైతులకు ఉపయోగపడే వ్యవసాయ కళాశాలకు, విద్యార్థులకు ఉపయోగపడే నవోదయ పాఠశాల నిర్మాణానికి శంకుస్థాపన చేయడం ఎంతో సంతోషంగా ఉందని తెలిపారు. ః:వ్యవసాయం ఒక విజ్ఞానమనిః:, ఇంతకు పూర్వం దేశంలో జై జవాన్, జై కిసాన్, నినాదం ఉండేదని, ఆ తర్వాత జై జవాన్, జై కిసాన్, జై విజ్ఞాన్ నినాదం వచ్చిందని,ప్రస్తుతం ఇది జై జవాన్ ,జై కిసాన్, జై విజ్ఞాన్, జై అనుసంధాన్ గా మారిందని తెలిపారు. గంగ ,యమునా, సరస్వతి లాగే కృష్ణ, గోదావరి, కావేరి నదులు ఉండడం, మట్టపల్లిలో స్వయంభు లక్ష్మీనరసింహస్వామి దేవాలయం ఉండడం ఇక్కడి ప్రజల అదృష్టమని అన్నారు. జిల్లాలో పెద్ద ఎత్తున వ్యవసాయం సాగు చేయడం, ప్రత్యేకించి పామాయిల్ పెంపకం చేపట్టడం అభినందనీయం అన్నారు.

ఈ సందర్భంగా రాష్ట్ర గవర్నర్ రైతులకు రెండు కోట్ల 47 లక్షల రూపాయల విలువ చేసే వ్యవసాయ యంత్ర పరికరాల ప్రొసీడింగ్స్ ను అందజేశారు. అంతేకాక స్వయం సహాయక మహిళా సంఘాలకు బ్యాంకు లింకేజీ కింద 504 కోట్లు, ఆదాయ వనరుల ను పెంపొందించేందుకు మరో 89 కోట్ల రూపాయల చెక్కులను అందజేశారు.

రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి నల్లమాద ఉత్తంకుమార్ రెడ్డి మాట్లాడుతూ స్వతంత్ర భారతదేశంలో ఏ రాష్ట్రంలో పండించని విధంగా తెలంగాణ రాష్ట్రంలో అత్యధికంగా వరి ధాన్యాన్ని పండిస్తున్నామని, దేశంలో ఎక్కడా లేనివిధంగా 85 మందికి ఉచితంగా సన్న బియ్యం ఇస్తున్నామని తెలిపారు. మట్టపల్లి అభివృద్ధికి తన వంతు శాయ శక్తుల ఇదివరకే కృషి చేశానని, భవిష్యత్తులో మరింత అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటానన్నారు. హుజూర్నగర్ నుండి మట్టపల్లి వరకు 80 కోట్ల రూపాయలతో డబుల్ రోడ్డు మంజూరు చేశామని, గతంలో 50 కోట్ల రూపాయలతో బ్రిడ్జి నిర్మించామని చెప్పారు. కృష్ణ ,గోదావరి జిల్లాలో ఒక చుక్క నీటిని కూడా వదులుకోమని, కృష్ణ,గోదావరి జలాల హక్కులు కాపాడుకునేందుకు ఏ పోరాటైనకైనా సిద్ధంగా ఉన్నట్లు ఆయన వెల్లడించారు. హుజూర్నగర్, కోదాడ ప్రజల జీవితాల్లో వెలుగు నింపడమే తన లక్ష్యమన్నారు. రాష్ట్ర గవర్నర్ చేతుల మీదుగా 150 కోట్ల రూపాయలతో వ్యవసాయ కళాశాల, 50 కోట్ల రూపాయలతో కోదాడ సమీపంలో జవహర్ నవోదయ విద్యాలయ నిర్మాణానికి శంకుస్థాపన చేయడం సంతోషమని అన్నారు.

రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర మాట్లాడుతూ రానున్న రోజుల్లో ఐటీ ,ఏఐ కన్నా వ్యవసాయ రంగమే ముందుంటుందని, సాఫ్ట్ వెర్, ఐటి సెక్టార్ ల నుండి వచ్చి వ్యవసాయ రంగంలో పనిచేసే రోజులు వస్తాయని అన్నారు. తెలంగాణ దేశానికే వరి అందించే ఏకైక రాష్ట్రం గా మారిందని, వ్యవసాయ రంగానికి ఇస్తున్న ప్రాధాన్యతలో భాగంగా వ్యవసాయ కళాశాలలు లేని ఉమ్మడి జిల్లాలలో వ్యవసాయ కళాశాలల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని, ఇందులో భాగంగానే నిజామాబాద్, రంగారెడ్డి జిల్లాలలో వ్యవసాయ కళాశాలలు మంజూరు చేయడం జరిగిందని తెలిపారు. రెండు కోట్ల 50 లక్షల మెట్రిక్ టన్నుల వరి ధాన్యాన్ని పండించి తెలంగాణ రైతులు దేశంలోనే ముందున్నారని, అలాగే ఇతర పంటల విషయంలో సైతం రాష్ట్ర రైతులు ముందు నిలుస్తున్నారని, ప్రత్యేకించి ఆయిల్ పామ్ సాగులో తెలంగాణ ముందు ఉందని, రాబోయే రోజుల్లో తెలంగాణ రాష్ట్రం పామాయిల్ పంటలో దేశంలో ప్రథమ స్థానంలో నిలుస్తుందని, ప్రస్తుతం 10 లక్షల ఎకరాలలో పామాయిల్ తోటలు పండిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో అత్యధికంగా సన్నబియ్యాన్ని సాగు చేయడంతో పాటు, పేద ప్రజలకు ఉచితంగా సన్న బియ్యం ఇస్తున్న ఘనత తమదేనన్నారు.

జిల్లా ఇంచార్జ్ మంత్రి ,రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, వ్యవసాయ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ అల్తాఫ్ జానయ్య, జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ మాట్లాడారు.

ఎమ్మెల్సీ శంకర్ నాయక్ వందన సమర్పణ చేయగా, పార్లమెంట్ సభ్యులు కుందూర్ రఘువీర్ రెడ్డి, శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి, కుందూర్ జయవీర్ రెడ్డి, కోదాడ శాసన సభ్యురాలు పద్మావతి, వ్యవసాయ శాఖ కార్యదర్శి సురేంద్రమోహన్, జిల్లా ఎస్పీ కే. నరసింహ, జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు. ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# అమరావతికి చట్టబద్ధత దిశగా అడుగులు..

విజయవాడ, జనవరి 23, ఇకపై ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి అని గర్వంగా చెప్పుకునే రోజులు దగ్గర్లోనే ఉన్నాయన్న భావన రాజకీయ వర్గాల్లో బలంగా వినిపిస్తోంది. అధికారికంగా రాజధానికి చట్టబద్ధత కల్పించే ప్రక్రియ తుదిదశకు చేరుతోందని సమాచారం. ఈ నెల 28 నుంచి ప్రారంభం కానున్న పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల్లోనే దీనికి సంబంధించిన బిల్లును ప్రవేశపెట్టే అవకాశం ఉందని చెబుతున్నారు. దీంతో అమరావతి రాజధాని అంశంపై కౌంట్‌డౌన్ మొదలైనట్టే అన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. అమరావతి కి చట్టబద్ధత కల్పించే ప్రక్రియ ప్రస్తుత పార్లమెంటు సమావేశాల్లోనే పూర్తి చేయాలని కేంద్ర ప్రభుత్వం భావిస్తోంది. సంబంధిత బిల్లు పార్లమెంటు బడ్జెట్ సమావేశాల్లో ప్రవేశపెట్టేందుకు కేంద్ర మంత్రిత్వశాఖ కసరత్తు చేస్తోంది. ముసాయిదా క్యాబినెట్ నోట్ను కేంద్ర గృహ నిర్మాణ పట్టణాభివృద్ధి, న్యాయ వ్యయ శాఖలతో పాటు, నీతి ఆయోగ్లకు పంపి, అభిప్రాయం కోరింది. న్యాయ శాఖ ఇప్పటికే అభిప్రాయం తెలియజేసిందని సమాచారం. ముసాయిదా నోట్పై త్వరగా అభిప్రాయం తెలియజేయాలని మిగతా శాఖలకూ మంత్రిత్వశాఖ సూచించినట్లు తెలిసింది. కేంద్రమంత్రి వర్గం ఆమోదం తర్వాత, న్యాయశాఖ బిల్లు సిద్ధం చేస్తుంది. మళ్లీ దాన్ని క్యాబినెట్ ఆమోదించాక, పార్లమెంటులో ప్రవేశపెడతారుఆంధ్రప్రదేశ్‌కు శాశ్వత రాజధానిగా అమరావతికి చట్టబద్ధత రావాలంటే ఏపీ పునర్వ్యవస్థీకరణ చట్టం లో సవరణలు చేయాల్సి ఉంటుంది. 2014 జూన్ 2 నుంచి పదేళ్ల పాటు హైదరాబాద్ ను తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు ఉమ్మడి రాజధానిగా పేర్కొన్నారు. ఆ గడువు 2024 జూన్ 2తో ముగిసినా, ఇప్పటివరకు ఏపీకి రాజధానిని అధికారికంగా ప్రకటించలేదు. దీంతో ఇప్పుడు కేంద్రం ముందుకు స్పష్టమైన ప్రతిపాదన వెళ్లింది.రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే అమరావతిని రాజధానిగా గుర్తించాలంటూ కేంద్రానికి ప్రతిపాదనలు పంపించింది. రాజధాని ఎంపికకు అనుసరించిన విధాన ప్రక్రియతో పాటు, అక్కడ జరుగుతున్న నిర్మాణాలు, భవిష్యత్ అభివృద్ధి ప్రణాళికలను కూడా ఒక సమగ్ర నివేదిక రూపంలో వివరించింది. అమరావతిని అధికారిక రాజధానిగా ఖరారు చేయాలని కేంద్రాన్ని స్పష్టంగా కోరింది. దీనిపై కేంద్ర హోంశాఖ పూర్తి స్థాయిలో కసరత్తు ప్రారంభించిందని తెలుస్తోంది.ఈ అంశంపై కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ, న్యాయ శాఖ, వ్యవసాయ శాఖతో పాటు నీతి ఆయోగ్ అభిప్రాయాలను కూడా హోంశాఖ సేకరిస్తోందని సమాచారం. అన్ని శాఖల అభిప్రాయాలు వచ్చిన తర్వాత కేంద్ర హోంశాఖ తన తుది ప్రతిపాదనలను కేంద్ర కేబినెట్ ముందు ఉంచనుంది. అక్కడ ఆమోదం లభిస్తే పార్లమెంట్‌లో బిల్లును ప్రవేశపెట్టే ప్రక్రియ మొదలవుతుంది.ముందుగా లోక్ సభ లో ఏపీ పునర్వ్యవస్థీకరణ చట్ట సవరణ బిల్లు ప్రవేశపెడతారు. అక్కడ ఆమోదం పొందిన తర్వాత రాజ్యసభ కు పంపిస్తారు. రెండు సభల్లో ఆమోదం లభించిన అనంతరం రాష్ట్రపతి సంతకం చేస్తే చట్టబద్ధత పూర్తవుతుంది. ఆ తర్వాత గెజిట్ నోటిఫికేషన్ విడుదల అవుతుంది. ఆ క్షణం నుంచే అమరావతి ఆంధ్రప్రదేశ్‌కు శాశ్వత రాజధానిగా అధికారిక హోదా పొందుతుంది.రాజధాని ఎప్పటి నుంచి వర్తింపచేయాలి అన్న అంశంపైనా గతంలో భిన్నాభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. అయితే రాష్ట్ర ప్రభుత్వం మాత్రం 2024 జూన్ 2 నుంచే అమరావతిని ఏపీ రాజధానిగా పరిగణించాలని స్పష్టంగా సూచించినట్లు తెలుస్తోంది. ఈ మొత్తం ప్రక్రియ బడ్జెట్ సమావేశాల్లోనే పూర్తయ్యే అవకాశాలు కనిపిస్తుండటంతో, అమరావతి దశ తిరిగినట్టే అన్న భావన ప్రజల్లో పెరుగుతోంది. ఇప్పుడు అధికారిక ముద్ర పడితే, అమరావతి పేరు దేశవ్యాప్తంగా మరోసారి బలంగా వినిపించనుంది.

# ట్రంప్ ఎందుకిలా...



న్యూఢిల్లీ, జనవరి 23, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అహంకారంతో విర్రవీగుతున్నాడు. వెనుజువెలా అధ్యక్షుడిని సైలెంట్ ఆపరేషన్‌తో అదుపులోకి తీసుకున్న తర్వాత ట్రంప్ అహంకారం తలకెక్కింది. ఈ క్రమంలో గ్రీన్‌లాండ్‌ను స్వాధీనం చేసుకుంటామని విర్రవీగుతున్నాడు. ఫ్రాన్స్ నేత ఇమాన్యుయల్ మాక్రో గ్రీన్‌ల్యాండ్ ఆక్రమణను విభేదించారు. ఇద్దరూ లేఖల ద్వారా గొడవ పడుతున్నారు, వైట్ హౌస్ వాటిని బహిర్గతం చేస్తోంది. దీని ఫలితంగా ట్రంప్ ఫ్రెంచ్ షాంపేన్, వైన్ దిగుమతులపై 200% సుంకాలు ప్రకటించారు, ఇది ద్వైపాక్షిక ఒత్తిడిని పెంచిందిఇక ట్రంప్ నేతృత్వంలో 'గ్లోబల్ పీస్ కమిటీ' ఏర్పాటవుతోంది. చేరాలంటే ప్రతీ దేశం 10 కోట్ల డాలర్లు చెల్లించాలి. చిన్న దేశాలు ఆసక్తి చూపుతున్నాయి. భారత్, పాకిస్తాన్‌తో పాటు అనేక దేశాలకు ఆహ్వానాలు పంపారు. ఉగ్రవాద సమస్యలతో పోరాడే పాకిస్తాన్‌ను చేర్చడం అంతర్జాతీయంగా చర్చనీయం. మాక్రో దీన్ని వ్యతిరేకిస్తూ ట్రంప్ లక్ష్యంగా మారారు. ఇక వరల్డ్ పీస్ బోర్డుతో గాజాను పునర్నిర్మించాలని ట్రంప్ భావిస్తున్నారు.యూఏఈ అధినేత షేక్ మహ్మద్ బిన్ సయ్యద్ భారత్‌కు రెండు గంటల సందర్శన చేశారు. ప్రధాని మోదీ విమానాశ్రయంలో స్వయంగా స్వాగతం పలికి, ఒకే వాహనంలో ప్రయాణించారు. రక్షణ ఒప్పందాలు, 0.5 బిలియన్ టన్నుల ఎల్పీజీ సరఫరా, చిన్న మాడ్యులర్ రియాక్టర్లు, ఏఐ సమ్మిట్‌లో సహకారం చర్చనీయాంశాలు. భారత ఆయుధాలను కలిసి విక్రయించే అవకాశాలు కూడా ఉన్నాయి. యూఏఈ ఆఖఐఇ లో చేరి, పాకిస్తాన్ వీసాలపై ఆంక్షలు విధించడంతో భారత విదేశాంగ విధానాన్ని అనుసరిస్తోంది.విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్ పోలెండ్ డెప్యూటీ ప్రధానితో ఉక్రెయిన్ విధానం, రష్యన్ ఇంధనాలపై తీవ్రంగా వాదించారు. వెమా ట్రయాంగిల్ (ఫ్రాన్స్, జర్మనీ, పోలెండ్) సందర్భంగా భారత్‌పై ఆరోపణలు చేశారు. పోలెండ్?పాకిస్తాన్ సంబంధాలు, ఉక్రెయిన్ సరిహద్దు ఒత్తిడి మధ్య భారత్ స్వార్థాలను కాపాడుకోవాలి. ఉ?ఖతో ఫ్రీ ట్రేడ్ ఒప్పందం రానుంది, పోలెండ్‌కు భారత అవసరం ఎక్కువ. ట్రంప్ గాజా పునర్నిర్మాణానికి ప్రపంచ శాంతి బోర్డ్‌ను ప్రతిపాదిస్తున్నారు.అమెరికా వ్యతిరేక వ్యాఖ్యలకు భారత్ దృఢంగా స్పందిస్తోంది. యూఏఈతో పరస్పర అవసరాలు, పోలెండ్‌తో వాణిజ్య అవకాశాలు లెక్కించి ముందుకు సాగుతోంది. ట్రంప్ పీస్ కమిటీలో భారత పాత్ర కీలకం కావచ్చు. జాతీయ లాభాలకు ప్రాధాన్యత ఇచ్చిన ఈ వ్యూహం ప్రపంచ రంగంలో భారత్ బలాన్ని పెంచుతోంది.

# పాదయాత్ర 2.0 పైనే ఆశలు

కడప, గుంటూరు, జనవరి 23, ఏపీలో ఎన్నికలకు ఇంకా మూడున్నరేళ్ల టైమ్ ఉంది. కానీ రాబోయే ఎన్నికలపై ఇప్పటి నుంచే చర్చ జరుగుతోంది. కూటమి లాంగ్ లీవ్ అని చంద్రబాబు, పవన్ అంటున్నారు. ఆ ముగ్గరిది ఫెవికోల్ బంధమని వైసీపీ కూడా చెప్తోంది. ఫ్యాన్ పార్టీ మాత్రం అధినేత మీదే భరోసా పెట్టి ముందుకెళ్తోంది. జగన్ పాదయాత్ర చేస్తారు..తిరిగి అధికారంలోకి వస్తామంటూ ధీమాగా ఉన్నారు వైసీపీ లీడర్లు. ఈ సారి జగన్ చేయబోయే పాదయాత్ర నెక్స్ట్ లెవల్‌లో ఉంటుందని అంటున్నారు. ఏపీ మొత్తాన్ని కవర్ చేసేలా..2019కి ముందు చేపట్టిన పాదయాత్రకు మించి రూట్ మ్యాప్ రెడీ చేస్తున్నామని చెప్పుకొస్తున్నారు. జగన్ కూడా ఎన్నికలకు ఏడాదిన్నర ముందు పాదయాత్ర చేస్తానని..ఎన్నికల వరకు జనంలోని ఉంటానని ప్రకటించేశారు.ఎలక్షన్స్‌కు ముందు చేయబోయే పాదయాత్రపై జగన్ ఇప్పుడెందుకు ప్రకటన చేసినట్లు అన్న చర్చ జరుగుతోంది. మళ్లీ వైసీపీనే పవర్‌లోకి వస్తుందని..క్యాడర్, లీడర్లకు ధైర్యం నూరిపోస్తున్న అధినేత..కావాలనే పాదయాత్రపై హింట్ ఇచ్చినట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి. సేమ్‌టైమ్ అటు క్రెడిట్ వార్‌లోనూ ఓ అడుగు ముందుండే ప్రయత్నం చేస్తున్నారు జగన్. విశాఖ గూగుల్ డేటా సెంటర్ నుంచి లేటెస్ట్‌గా భూసర్వే దాకా అంతా తానే చేశానని..కానీ సీఎం చంద్రబాబు క్రెడిట్ చోరీ చేస్తున్నారంటూ చెప్పుకుంటూ వస్తున్నారు.పాదయాత్రలకు తెలుగు స్టేట్స్ పెట్టింది పేరు. పాదయాత్రలు చేసి ఎంతో మంది అధికారంలోకి వచ్చారు. 2003లో అప్పటి ఉమ్మడి ఏపీ పీసీసీ ప్రెసిడెంట్ హోదాలో వైఎస్సార్ భారీ పాదయాత్ర చేసి..2004లో ఉమ్మడి ఏపీలో కాంగ్రెస్‌ను అధికారంలోకి తీసుకొచ్చారు. ఇదిలా ఉంటే పాదయాత్ర సెంటిమెంట్ తెలుగు నాట పవర్ ఫుల్ అని.. ఆ తర్వాత పాదయాత్ర చేసిన నాయకులు నిరూపించారు. 2013 అక్టోబర్‌లో టీడీపీ అధినేత చంద్రబాబు పాదయాత్ర చేసి..2014లో ఏపీలో సీఎం అయ్యారు. ఇక 2017లో నాటి ఏపీ విపక్ష నేత వైఎస్ జగన్ ఏకంగా 3500 కిలోమీటర్లపైన పాదయాత్ర చేపట్టి 2019 ఎన్నికల్లో బంపర్ విక్టరీ కొట్టీ సీఎం అయ్యారు.2023 జనవరిలో యువ నేత లోకేష్ పాదయాత్ర చేపట్టి..కూటమి బంపర్ విక్టరీకి తనవంతు తోడ్పాటు అందించారు. ఇలా రెండు దశాబ్దాలకు పైగా ఏపీ పాలిటిక్స్‌లో పాపులర్ అయిన పాదయాత్రలతో నేతలు కాళ్లు అరిగేలా పవర్‌లోకి వచ్చారు. ఇప్పుడు మళ్ళీ జగన్ వంతు వచ్చింది. లేటెస్ట్‌గా నేతల సమావేశంలో మాట్లాడుతూ మరో ఏడాదిన్నరలో పాదయాత్ర చేపడతానని ప్రకటించారు.పాదయాత్ర 2.ూ జగన్‌ను తిరిగి పవర్‌లోకి తెస్తుందా లేదా అన్నదే అతిపెద్ద చర్చ. తెలుగు రాజకీయాల్లో ఒకసారి పాదయాత్ర చేసిన వారు మరోసారి పాదయాత్ర చేపట్టలేదు. రెండోసారి పాదయాత్ర అనేది జగన్‌తోనే మొదలయ్యే అవకాశం ఉంది. వైఎస్సార్ కానీ చంద్రబాబు కానీ ఒకేసారి పాదయాత్ర చేశారు. లోకేష్ కూడా ఆ లోటు తీర్చుకున్నారు. అయితే మొదటిసారి పాదయాత్ర చేస్తే ఆ క్రేజ్, హైప్ ఒక లెవెల్‌లో ఉంటుంది. రాజకీయాల్లోకి కొత్తగా వచ్చిన వారు..అప్పటివరకు అధికారం చేపట్టకుండా ప్రతిపక్షంలో ఉన్నవారు పాదయాత్ర చేస్తే ఆ మ్యాజిక్కే వేరేగా ఉంటుంది.జగన్ విషయానికి వస్తే ఐదేళ్లు పాటు సీఎంగా పనిచేశారు. ఆయన పాలన ఏమిటో ప్రజలు చూశారు. వైసీపీ హయాంలో తీసుకున్న పలు నిర్ణయాలే 2024లో జగన్ ఓటమికి కారణమయ్యాయన్న టాక్ ఉంది. మరి ఈసారి ప్రజల్లోకి వెళ్లి జనాలకు జగన్ ఏం చెప్తారు? జనాలను ఎలా అట్రాక్ట్ చేయబోతున్నారు? వైసీపీ హయాంలో తీసుకున్న నిర్ణయాలపై ప్రజలు ప్రశ్నిస్తే జగన్ ఎలా రియాక్ట్ అవుతారు? అనేది ఇంట్రెస్టింగ్‌గా మారింది. గతానికి మించి కొత్త హామీలు ఇవ్వాలి. స్పీచ్ దగ్గర నుంచి బాడీ లాంగ్వేజ్ దాకా అన్నీ మార్చేయాలి. తీరా ఎన్ని చేసినా ప్రజల్లో కూటమి ప్రభుత్వంపై అనుకున్న స్థాయిలో వ్యతిరేకత రాకపోతే మాత్రం జగన్ అంచనాలు తలకిందులు అయ్యే ప్రమాదం ఉంది. ఇలాంటి సవాళ్ల నేపథ్యంలో జగన్ పాదయాత్ర విజయతీరాలకు చేరుస్తుందా అనేది ఆసక్తికరంగా మారింది.ఒకవేళ జగన్ పాదయాత్ర చేస్తే పొలిటికల్ సినారియో ఎలా ఉంటుందనేది బిగ్ డిబేట్‌గా ఉంది. 2019 ఎన్నికలే ఎజెండాగా ఆయన చేసిన పాదయాత్రకు అప్పట్లో ప్రజల మద్దతు బానే లభించింది. ఇప్పుడు కూడా అలాగే ప్రజల్లోకి వెళ్లి పబ్లిక్ పల్స్ తెలుసుకోవాలనే ఉద్దేశంతో జగన్ ఉండొచ్చు. కానీ జగన్ 2019 ఎన్నికలకు ముందు జగన్ పాదయాత్ర చేసినప్పుడు ఉన్న పరిస్థితులు వేరు. ఇప్పుడున్న పొలిటికల్ సిచ్యువేషన్స్ ఇంకా వేరు. 2014లో జగన్ ఓడిపోయారనే సింపతీ 2019 ఎన్నికల్లో ఆయనకు కలిసి వచ్చింది.పవర్‌లోకి వస్తే నవరత్నాలు ఇస్తామని చెప్పి..రాజన్న రాజ్యం తీసుకొస్తామన్న నమ్మకం కలిగించడంలో అప్పుడు సక్సెస్ అయ్యారు. పైగా ఆ నాటి ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ సెపరేట్‌గా పోటీ చేశాయి. ఓట్లు చీలిపోయి జగన్‌కు కలిసి వచ్చింది. 2024లో కూడా జగన్ ఆ మూడు పార్టీలు కలవకూడదని కోరుకున్నారు.

కానీ ఏదైతే జరగొద్దని జగన్ అనుకున్నారో అదే జరిగింది. కూటమిగా ఏర్పడి పోటీ చేసి పవర్‌లోకి వచ్చాయి ఆ మూడు పార్టీలు.రాబోయే ఎన్నికల్లో కూడా ఆ ముగ్గురు కలిసే పోటీ చేస్తామంటున్నారు. ఆ మూడు పార్టీల మాటలు, చేతలు కూడా అదే డైరెక్షన్‌లోనే ఉన్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో..2018లో జగన్ చేసిన పాదయాత్రతో పోలిస్తే.. రాబోయే రోజుల్లో చేయబోయే పాదయాత్ర ఎంతవరకు సక్సెస్ అవుతుందనేదే డిస్కషన్ పాయింట్. జగన్ పాదయాత్ర చేస్తే చంద్రబాబు సర్కార్‌పై దుమ్మెత్తిపోయడం తప్ప కొత్తగా చెప్పేదేం లేదంటున్నారు టీడీపీ నేతలు. ఇప్పటికే ప్రజలు వైసీపీ పాలనను చూశారని..జగన్ కొత్తగా చెప్పేదేమి లేదని..ప్రజలు ఆయనను నమ్మే పరిస్థితి కూడా లేదంటున్నారు. ఏది ఏమైనా ఫస్ట్ టైమ్ జగన్ వేసిన బాణం గురి తగిలింది. రెండోసారి కూడా తగిలితే రికార్డు బ్రేక్ అవుతుంది. మరి జగన్ పాదయాత్ర 2.ూ ఎంత వరకు సక్సెస్ అవుతుందో చూడాలంటే వేచి చూడాల్సిందే.

# ఎత్తులకు పై ఎత్తులు వేస్తున్న భారత్

న్యూఢిల్లీ, జనవరి 23, (న్యూస్ పల్స్) డొనాల్డ్ ట్రంప్ అధికారంలోకి వచ్చి ఏడాదైంది. మొదటిసారి అధ్యక్షుడు అయ్యాక భారత్‌కు మంచి మిత్రుడిగా ఉన్నాడు. మోదీకి అత్యంత సన్నిహితంగా మెదిలాడు. 2.0 పాలన తుగ్లక్ పాలనను తలపిస్తోంది. అమెరికా ప్రయోజనాలకన్నా వ్యక్తిగత ప్రయోజనాలకే ట్రంప్ అధిక ప్రాధాన్యం ఇస్తున్నారు. ప్రపంచ దేశాలపై రివర్స్ టారిఫ్‌లు విధించారు. ఇప్పటికీ తన మాట వినని దేశాలపై కక్ష్య సాధింపునకు దిగుతున్నాడు. ట్రంప్ భారత ఉత్పత్తులపై భారీ సుంకాలు విధించి వాణిజ్య ఒత్తిడి తీర్చుకుంటుంటే, మోదీ సైలెంట్‌గా ట్రంప్ కీలెరిగి వాత పెడుతున్నారు. అమెరికా నుంచి దిగుమతి అయ్యే తృణధాన్యాలు, ముఖ్యంగా పప్పు దినుసులపై 30 శాతం సుంకం వేసి రాయితీలు రద్దు చేసింది. ఈ వ్యూహాత్మక చర్య అమెరికా రైతులను వణికిస్తుంది.ట్రంప్ గతంలో రష్యన్ చమురు దిగుమతులు, గ్రీన్ ఎనర్జీ విషయాలతో భారత వస్తువులపై 50 శాతం వరకు సుంకాలు పెంచాడు. భారతదేశం దీనికి ప్రకటనలు చేయకుండా, అక్టోబర్‌లో ఈ నిర్ణయం తీసుకుని నవంబర్ నుంచి అమలు ప్రారంభించింది. ప్రచారం లేకుండా జరిగిన ఈ చర్య అమెరికా పప్పు ఎగుమతులను గణనీయంగా ప్రభావితం చేసింది.అమెరికాలోని నార్త్ డకోటా, మోంటానా రాష్ట్రాల్లో పప్పు దినుసుల సాగు ప్రధానం. ఈ సుంకాల వల్ల భారత మార్కెట్‌లో వాటా తగ్గడంతో స్థానిక రైతులు కష్టాలు అనుభవిస్తున్నారు. సెనేటర్లు కెవిన్ క్రామర్, స్టీవ్ డెయిన్స్ ట్రంప్‌కు లేఖ రాసి, భారతీయులు పప్పులు ఎక్కువగా తినే దేశమని, ఈ సుంకాలు తొలగించాలని మొరపెట్టారు. మూడున్నర నెలల తర్వాత ఈ లేఖతో మాత్రమే విషయం వెలుగులోకి వచ్చింది2019లో కూడా ట్రంప్ సుంకాలకు భారత్ ఇలాంటి సమాధానం ఇచ్చి, అతన్ని మోదీకి లేఖ రాయించింది. ఇప్పుడు అదే భావన పునరావృతం అవుతోంది. ట్రంప్ అరవటలతో ముందుకు వెళ్తుంటే, భారత్ అమలును ఆయుధంగా చేసుకుంది. దేశీయ రైతుల రక్షణకు 'నో కాంప్రమైజ్' విధానం పాటిస్తూ, వాణిజ్య యుద్ధంలో బలమైన స్థానం సంపాదించింది.మోదీ, జైశంకర్, పీయూష్ గోయల్, దోవల్‌లాంటి నాయకులు కలిసి ఈ వ్యూహాన్ని రూపొందించారు. ఒకరు విదేశీ వ్యూహాలు రూపొందించగా, మరొకరు పరిణామాలను అంచనా వేసి అమలు చేశారు. ఈ చర్య అమెరికా మార్కెట్‌పై ఆధారపడకుండా భారత బలాన్ని చూపించింది. నెటిజన్లు ఈ సైలెంట్ రెస్పాన్స్‌ను సంబరాలతో అభినందిస్తున్నారు.

# ఇక పెళ్లిళ్లే.. పెళ్లిళ్లు..

హైదరాబాద్, జనవరి 23, తెలుగు రాష్ట్రాల్లో జరగాల్సిన అనేక వివాహ వేడుకలు, శుభకార్యాలు, ఫంక్షన్‌లకు మూఢం కారణంగా బ్రేక్ పడింది. అయితే, ఇప్పుడు మళ్లీ శుభగడియలు తరుముకొస్తున్నాయి. దాదాపు మూడు నెలల విరామం తరువాత తెలుగు రాష్ట్రాల్లో మళ్లీ పెండ్లిళ్ల బాజాలు మోగబోతున్నాయి.నవంబర్ నెల నుంచి మూఢాల కారణంగా శుభ ముహూర్తాలు లేకుండా పోయాయి. శుక్ర మౌఢ్యమి ఈనెల 17న ముగియడంతో తెలుగు రాష్ట్రాల్లో మూడు నెలల తరువాత పెళ్లిళ్లు, రిసెప్షన్లతో కల్యాణ మండపాలు మళ్లీ కళకళలాడనున్నాయి.మన పంచాగాల ప్రకారం.. ఫిబ్రవరి 19వ తేదీ నుంచి శుభముహూర్తాలు ప్రారంభం అవుతున్నాయి. 19, 20, 21, 24, 25, 26తేదీలు వివాహాలకు అనుకూలంగా ఉన్నాయి. 19, 20, 21 తేదీల్లో గృహ ప్రవేశాలు కూడా ఎక్కువగానే ఉన్నాయి.ఫిబ్రవరి 21వ తేదీన ఎక్కువ పెళ్లిళ్లు జరగనున్నాయి. ఆ రోజు పంచమి మరీ మంచి ముహూర్తం కావడం, అలాగే వీకెండ్ కావడం కారణంగా భారీ సంఖ్యలో వివాహాలకు ముహూర్తాలను నిర్ణయించుకున్నట్లు పండితులు చెబుతున్నారు. ఫిబ్రవరి నెల తరువాత మార్చి, ఏప్రిల్, మే, జూన్, జులై వరకు అన్నీ మంచి రోజులే ఉన్నాయని పురోహితులు చెబుతున్నారు.మార్చి నెలలో 4, 5, 6, 7, 8, 11, 12, 13, 14, 20, 21, 25, 29 తేదీల్లో మంచి ముహూర్తాలు ఉన్నాయి. అదేవిధంగా ఏప్రిల్ నెలలో 1 నుంచి 8వ తేదీ వరకు.. ఆ తరువాత 10, 11, 12, 21, 25, 26, 28, 29, 30 తేదీల్లో మంచి ముహూర్తాలు ఉన్నాయి. మే నెలలో 1, 3, 5, 6, 7, 8, 9, 10, 12, 13 తేదీల్లో.. జూన్ నెలలో 19, 20, 21, 24, 25, 26, 27, 28 తేదీల్లో, జులై నెలలో 1, 2, 3, 5, 8, 9 తేదీల్లో మంచి ముహూర్తాలు ఉన్నట్లు చెబుతున్నారు.ఫిబ్రవరి నెల నుంచి మార్చి, ఏప్రిల్, మే, జూన్ , జులై నెలల్లో కూడా వరుసగా శుభ ఘడియలు ఉండటంతో పురోహితులు, వెడ్డింగ్ ప్లానర్లు, క్యాటరర్ల డైరీలు పూర్తిగా నిండిపోయాయి. తెలుగు రాష్ట్రాల్లో చాలా చోట్ల ఇప్పటికే అడ్వాన్స్ బుకింగ్ చేసుకున్న పరిస్థితి నెలకొంది.

ఫంక్షన్ హాళ్లు, పురోహితులు, క్యాటరింగ్ సర్వీసుల రేట్లు ఆకాశాన్నంటడంతో వధూవరుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. గత ఏడాదికి ప్రస్తుత ఏడాదికి ధరలు విపరీతంగా పెరిగాయి. పురోహితుల దగ్గర నుంచి క్యాటరింగ్ వాళ్లు, డెకరేషన్స్, పెండ్లి సామాగ్రి, కూరగాయలు, మాంసం ధరలు భారీగా పెరిగాయి.ఇక ప్రధానమైన మ్యారేజ్ ఫంక్షన్ హాల్స్ ధరలు భగ్గుమంటున్నాయి. చిన్నచిన్న ఫంక్షన్ హాళ్లు సైతం లక్షల్లో చెల్లించాల్సిందే.. ఇక పెద్ద ఫంక్షన్ హాల్స్ అయితే.. రూ. 10లక్షల నుంచి రూ. 13లక్షలకు తక్కువకు రానిపరిస్థితి.పెళ్లిళ్లు, గృహప్రవేశాలతో పాటు ఇతర శుభకార్యాలకు ముహూర్తాలు వచ్చేస్తున్నాయి. ఈ క్రమంలో శుభకార్యాలకు సిద్ధమయ్యే పేద, మధ్యతరగతి కుటుంబాలు పెరిగిన ధరలతో ఆందోళన చెందుతున్నారు.

# విజయ్ కు మరో షాక్..



చెన్నై, జనవరి 23, (న్యూస్ పల్స్) జన నాయగన్ (తెలుగులో జన నాయకుడు) ఇబ్బందులు ఇప్పట్లో తీరేలా లేవు. ఈ సినిమా సంక్రాంతి కానుకగా జనవరి 9న విడుదల కావాల్సి ఉంది. అయితే, సెన్సార్ సమస్య ల కారణంగా ఈ మూవీ అనూహ్యంగా వాయిదా పడింది. ఇప్పటికీ ఈ మూవీ నిర్మాతలు కోర్టు చుట్టూనే తిరుగుతున్నారు. దీంతో జన నాయగన్ సినిమా విడుదలయితే చాలు అనే స్థితిలో అభిమానులు ఉన్నారు. ఇప్పుడు ూు ప్లాట్‌ఫామ్ నుంచి ఈ సినిమా ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం ఉందని చెబుతున్నారు. దీంతో చిత్ర బృందం ఆందోళనలు మరింత పెరిగాయి. 'జన నాయగన్' దళపతి విజయ్ కెరీర్‌లో చివరి సినిమా. దీని తర్వాత ఆయన పూర్తిగా రాజకీయాలకే పరిమిత కానున్నారు. ఇందుకోసం ఇప్పటికే రాజకీయ పార్టీ ప్రారంభించి ఎన్నికల ర్యాలీలు నిర్వహిస్తున్నారు విజయ్.ప్రముఖ ఓటీటీ సంస్థ అమెజాన్ ప్రైమ్ వీడియో 'జన నాయగన్' సినిమా డిజిటల్ స్ట్రీమింగ్ హక్కులను రూ.120 కోట్లకు సొంతం చేసుకుంది. ఈ సినిమా అసలు విడుదల తేదీ జనవరి 9. దీని ప్రకారం, అమెజాన్ ూు విడుదల తేదీని నిర్ణయించింది. అయితే, ఈ సినిమా ఇంకా థియేటర్లలో విడుదల కాలేదు. దీని కారణంగా, ూు కంపెనీ నుంచి నిర్మాతలపై ఒత్తిడి పెరుగుతుందని సమాచారం. ఒప్పంద నిబంధనల ఉల్లంఘన కింద నిర్మాతల పై చట్టపరమైన చర్యలు తీసుకోవడమా?, లేదా అగ్రిమెంట్ మొత్తాన్ని తగ్గించుకోవడమా ?అన్న ప్లాన్ లో అమెజాన్ ప్రైమ్ ఓటీటీ సంస్థ ఉన్నట్లు సమాచారం.జన నాయగన్ చిత్రానికి సెన్సార్ సర్టిఫికెట్ మంజూరు చేయకపోవడంపై ఆ బృందం కోర్టును ఆశ్రయించింది. అక్కడ కూడా ఆ బృందం ఎదురుదెబ్బలు ఎదుర్కొంటోంది. మరోవైపు తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల తేదీలు త్వరలో ఖరారుకానున్నాయి. దీంతో ఈ చిత్రం విడుదలకు మరిన్ని ఆటంకాలు ఎదురవుతాయి. దీంతో నిర్మాతలను మరింత ఆందోళనకు గురవుతున్నారు

# బాధితుల వద్దకే పోలీసులు – స్పాట్‌లోనే ఎఫ్ఐఆర్

హైదరాబాద్, జనవరి 23, మేడ్చల్ జిల్లాలోని దుండిగల్ పోలీసులు సరికొత్త సంప్రదాయానికి శ్రీకారం చుట్టారు. సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలోనే మొట్టమొదటిసారిగా బాధితుల ఇంటి వద్దకే వెళ్లి ఫిర్యాదు స్వీకరించి, అక్కడికక్కడే ఎఫ్ఐఆర్ నమోదు చేసి రికార్డు సృష్టించారు. సాధారణంగా ఏదైనా నేరం జరిగితే బాధితులే పోలీస్ స్టేషన్‌కు వెళ్లి గంటల తరబడి వేచి చూడాల్సి వచ్చేది, కానీ దుండిగల్ పోలీసులు ఈ విధానానికి స్వస్తి పలికి బాధితుల ముంగిటకే సేవలను తీసుకొచ్చారు.దుండిగల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని గాగిళ్ళపూర్, గ్రీన్ వుడ్స్ విల్లాలో నివాసముండే తుమ్మలపల్లి నాగేందర్ కృష్ణ చైతన్య తన కుటుంబంతో కలిసి సంక్రాంతి పండుగ కోసం విజయవాడ వెళ్లారు. జనవరి 20న తిరిగి వచ్చి చూడగా, ఇంటి వెనుక తలుపులు పగులగొట్టి ఉన్నాయి. లోపలికి వెళ్లి పరిశీలించగా బీరువా లాకర్ తెరిచి ఉంది. అందులోని రెండు కేజీల వెండి, 10 గ్రాముల బంగారం, రూ. 5 వేల నగదు చోరీకి గురైనట్లు గుర్తించిన బాధితులు వెంటనే డయల్ 100 కు సమాచారం అందించారు.సమాచారం అందుకున్న వెంటనే దుండిగల్ డీఐ ఎం. బాల్ రెడ్డి తన సిబ్బందితో కలిసి ఘటనా స్థలానికి చేరుకున్నారు. బాధితుడు పోలీస్ స్టేషన్‌కు వచ్చే అవసరం లేకుండా, వారి ఇంటి వద్దే ఫిర్యాదును స్వీకరించారు. అనంతరం అక్కడికక్కడే ఆన్‌లైన్ ద్వారా కేసు నమోదు చేసి, ఎఫ్ఐఆర్ కాపీని బాధితులకు అందజేశారు. పోలీసుల ఈ వేగవంతమైన స్పందన చూసి బాధితులతో పాటు స్థానికులు కూడా ఆశ్చర్యపోయారు.తమ విలువైన సొత్తు పోయిందన్న బాధలో ఉన్నప్పటికీ, పోలీసులు సమయస్ఫూర్తితో వ్యవహరించి ఇంటి వద్దకే వచ్చి ఎఫ్ఐఆర్ నమోదు చేయడం పట్ల బాధితుడు నాగేందర్ హర్షం వ్యక్తం చేశారు. ప్రజలకు పోలీసు సేవలను మరింత చేరువ చేసే క్రమంలో సైబరాబాద్ కమిషనరేట్ చేపట్టిన ఈ సరికొత్త విధానంపై సర్వత్రా ప్రశంసలు వ్యక్తమవుతున్నాయి. ఈ చర్య వల్ల బాధితులకు పోలీసులపై నమ్మకం పెరగడమే కాకుండా, దర్యాప్తు ప్రక్రియ కూడా వేగవంతం అవుతుందని అధికారులు భావిస్తున్నారు.

# మంత్రులకు మున్సిపల్ టెన్షన్ ఇంచార్జ్ మంత్రులకు సెగ

కరీంనగర్, జనవరి 23, మున్సిపల్ ఎన్నికలపై సీరియస్ ఫోకస్ పెట్టింది అధికార హస్తం పార్టీ. మెజార్టీ స్థానాలు కైవసం చేసుకోవడమే టార్గెట్‌గా పావులు కదుపుతోంది. పార్లమెంట్ నియోజకవర్గాల వారీగా ఎన్నికల బాధ్యులను ప్రకటించింది పార్టీ. మున్సిపల్ ఎన్నికలు జరగనున్న 15 పార్లమెంట్ నియోజకవర్గాలకు 15 మంది మంత్రులను ఇంచార్జ్‌లను నియమించారు సీఎం రేవంత్. నియోజకవర్గాల వారీగా మంత్రులు సన్నాహక సమావేశాలు పెట్టాలని సూచించారు ముఖ్యమంత్రి.అయితే ఇంచార్జ్ మంత్రులకు అప్పుడే సెగ మొదలైంది. అధికార పార్టీ తరఫున పోటీ కోసం తీవ్రస్థాయిలో పోటీ ఉందని మంత్రుల దృష్టికి వచ్చింది. కొత్త, పాత కాంగ్రెస్ నేతలు టిక్కెట్ల కోసం వర్గాలుగా విడిపోయి పోటీ పడుతున్నారు.

ఈ క్రమంలోనే గాంధీభవన్‌లో జరిగిన నిజామాబాద్ పార్లమెంట్ సన్నాహక సమావేశం రసాభాసాగా మారింది. ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ వర్సెస్ మాజీ మంత్రి జీవన్‌రెడ్డి మధ్య ఇప్పటికే ఉప్పు-నిప్పులా ఉన్న వ్యవహారం కాస్త..సన్నాహక సమావేశం సాక్షిగా మరోసారి దుమారం రేగింది.ఏకంగా సంజయ్ ఉన్న మీటింగ్‌కు తాను హాజరుకాబోనని సమావేశం నుంచి బయటికి వచ్చి రచ్చ చేశారు మాజీమంత్రి జీవన్‌రెడ్డి. ఈ పరిస్థితుల్లో అభ్యర్థుల ఎంపిక మంత్రులకు పెద్ద సవాల్‌గా మారింది. పోటీ చేయనున్న ప్రతి స్థానానికి ఆరుగురు పేర్లతో లిస్ట్ రెడీ చేయాలని మంత్రులను పీసీసీ చీఫ్, సీఎం ఆదేశించారు. అయితే ఒక్కో స్థానం నుంచి ఇరవై మందికిపైగా ఆశావహులు ఉండటంతో తలలు పట్టుకుంటున్నారు నేతలు.మున్సిపల్ ఎన్నికల్లో ఎమ్మెల్యే వర్గం, ఎంపీ వర్గం, డీసీసీ అధ్యక్షుడి వర్గం, పీసీసీ వర్గం, ఇంచార్జ్ మంత్రి వర్గం, మున్సిపల్ ఎన్నికల ఇంచార్జ్ మంత్రి వర్గం అంటూ డజన్ల మంది ఆశావహులు టికెట్ రేసులో ఉన్నారు. ఇక ఫిరాయింపు ఎమ్మెల్యేలు ఉన్న నియోజకవర్గాల్లో ఈ సమస్య మరింత ఇబ్బందికరంగా ఉంది. జగిత్యాల, పటాన్ చెరు, గద్వాల్, బాన్సువాడ వంటి చోట్ల ఎవరికి టికెట్ రాకపోయినా మిగతా వర్గాల వాళ్లతో కలిసి..పార్టీ టికెట్ ఇచ్చిన వారికి వ్యతిరేకంగా పనిచేసేలా క్లాషెస్ ఉన్నాయట. దీంతో మంత్రులకు కొత్త భయం పట్టుకుందట.పంచాయతీ ఎన్నికల్లో తక్కువ స్థానాలు వచ్చిన చోట పార్టీ నేతల తప్పిదాలపై సీఎం రేవంత్ బాధ్యులపై సీరియస్ అయినట్లు సమాచారం. దీంతో మున్సిపల్ ఎన్నికల్లో ఎలాంటి మిస్టేక్ జరిగినా తమపై ఎఫెక్ట్ పడుతుందని మంత్రులు ఆందోళన చెందుతున్నారట. గతంలో రాజశేఖర్ రెడ్డి సీఎంగా ఉన్నప్పుడు..లోకల్ పోరులో పార్టీ ఓటమికి నైతిక బాధ్యత వహిస్తూ ఇద్దరు మంత్రులు మారెప్ప, మాగంటి బాబులు రాజీనామా చేశారు. దీంతో ఇప్పుడు పార్లమెంట్ నియోజకవర్గ ఎన్నికల ఇంచార్జ్ బాధ్యతలు తీసుకున్న మంత్రులకు ఈ ఎన్నికలు డూ ఆర్ డై అన్నట్లుగా మారాయట.పార్టీ ఇచ్చిన టార్గెట్ రీచ్ అయ్యేందుకు కష్టపడి పని చేయడానికి తాము సిద్ధంగా ఉన్నప్పటికీ, టికెట్ కోరుతున్న ఆశావహుల సంఖ్యను చూసి నేతలందరూ తలలు పట్టుకుంటున్నారట. ఒక్కో స్థానానికి డజను మంది నేతలు టికెట్ కోసం ట్రై చేస్తుండటం..మరోవైపు గ్రూప్ వార్ నేపథ్యంలో అభ్యర్థుల ఎంపిక అతిపెద్ద సమస్యగా మారిందట. ఇక టికెట్ ఎంపిక కోసం కమిటీ వేస్తున్నామని, అభ్యర్థుల ఎంపిక బాధ్యత పూర్తిగా కమిటీ చూసుకుంటుందని పీసీసీ చీఫ్ ప్రకటించారు. అయితే కొత్తగా ప్రకటించిన ఇంచార్జ్ మంత్రులు మాత్రం అభ్యర్థుల ఎంపిక తమతో కాదని చేతులెత్తేస్తున్నట్లు టాక్.మున్సిపల్ ఎన్నికల్లో సత్తా చాటాలని హస్తం నేతలు భావిస్తున్నప్పటికీ ఆశావహుల పోటీ, గ్రూప్ తగాదాలు పార్టీకి నష్టంగా మారే ప్రమాదముందట. పంచాయతీ ఎన్నికల్లో రెబల్స్ వల్లే హస్తం పార్టీ అనుకున్న టార్గెట్ ను రీచ్ కాలేదంటున్నారు. ఇక మున్సిపల్ ఎన్నికల్లో వర్గపోరుకు చెక్ పెట్టి టికెట్ కేటాయింపులు ఎలా చేస్తుందో చూడాలి మరి

### సంజయ్ కే ప్రియారిటీ

గత అసెంబ్లీ ఎన్నికల్లో జగిత్యాల నుంచి డాక్టర్ సంజయ్ ఎమ్మెల్యేగా గెలిచారు. బీఆర్ఎస్ పార్టీ నుంచి ఎమ్మెల్యేగా విజయం సాధించిన ఆయన.. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంతో పార్టీ మారారు. సీఎం రేవంత్ రెడ్డి సమక్షంలో అధికార పార్టీలో చేరిపోయారు. అప్పట్లో డాక్టర్ సంజయ్ చేరికను జీవన్ రెడ్డి తీవ్రంగా వ్యతిరేకించారు. తన ఇలాఖాలో ఎమ్మెల్యే సంజయ్‌ను ఎలా చేర్చుకుంటారంటూ పార్టీ పెద్దలను నిలదీశారు. ఒకనొక దశలో పార్టీనుంచి బయటకు వెళ్లిపోతానంటూ హైకమాండ్ పెద్దలకు వార్నింగ్ ఇచ్చారు. చివరకు పార్టీ నేతలు రంగంలోకి దిగి.. సర్దిచెప్పడంతో వెనక్కి తగ్గారు. కానీ కొద్దిరోజులుగా మాత్రం ఇద్దరి మధ్య ఆధిపత్య పోరు కొనసాగుతూనే ఉంది. అందుకే మరోసారి డాక్టర్ సంజయ్‌ను జీవన్ రెడ్డి టార్గెట్ చేసినట్టు ప్రచారం సాగుతోంది..

ఇప్పుడు మున్సిపల్ ఎన్నికల ఫైట్ ఇద్దరి మధ్య మంటలు రాజేస్తోంది. బీఆర్ఎస్ ఎమ్మెల్యేనంటూ ప్రకటించుకున్న డాక్టర్ సంజయ్ కుమార్.. కాంగ్రెస్ పార్టీ బీ ఫామ్ ఎలా ఇస్తారంటూ జీవన్ రెడ్డి ప్రశ్నిస్తున్నారు. అసలు కాంగ్రెస్ పార్టీతో ఎమ్మెల్యే సంజయ్ కి సంబంధమే లేదని ఆయనే అంటున్నారు. కేవలం జగిత్యాల నియోజకవర్గం అభివృద్ధి కోసమే తాను ముఖ్యమంత్రితో కలిసి పనిచేస్తున్నాను అని ఎమ్మెల్యే చెబుతున్నారు. అలాగే తాను ఇంకా బీఆర్ఎస్ పార్టీలోనే కొనసాగుతున్నట్టు అఫిడవిట్ కూడా సమర్పించారు. అలాంటప్పుడు ఆయన కాంగ్రెస్ ఎమ్మెల్యే ఎలా అవుతారంటూ ప్రశ్నిస్తున్నారు. అంతేకాకుండా కాంగ్రెస్ పార్టీ అంతర్గత వ్యవహారాలల్లో జోక్యాన్ని సహించేది లేదని స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చారు. ముఖ్యంగా మున్సిపల్ ఎన్నికలలో అభ్యర్థులకు బీఫామ్ ఇవ్వడానికి సంజయ్ ఎవరంటూ ప్రశ్నించడం హాట్ టాపిక్ అవుతోంది. ఇక్కడితోనే ఈ వ్యవహారాన్ని జీవన్ రెడ్డి వదిలిపెట్టలేదు. అసలు జగిత్యాల మున్సిపల్ లో ఏం జరుగుతుందని ప్రశ్నిస్తున్నారు. తాజాగా జగిత్యాలలోని బీట్ బజార్ లో ఉన్న వ్యవసాయ సమీకృత వెజ్- నాన్ వెజ్ మార్కెట్లో ఒక ప్రైవేట్ కాంట్రాక్టర్ నిల్వ ఉంచిన సిమెంట్, ఇసుకలను ఎలా నిల్వ చేస్తారంటూ ప్రశ్నిస్తున్నారు. ఇది సమీకృత మార్కెటా లేక ఒక కాంట్రాక్టర్ గోదామా అని మండిపడ్డారు. గతంలో కేటీఆర్ చేతులమీదుగా మార్కెట్ ను ప్రారంభించారు. అప్పటినుంచి ఇప్పటివరకు ఎమ్మెల్యే రాజ్యమే నడుస్తోంది. అప్పుడు ఆయన ఎమ్మెల్యే ఇప్పుడు కూడా ఆయనే ఎమ్మెల్యే.. అభివృద్ధి ప్రదాత చేస్తున్న అభివృద్ధి ఇది.. ఇదే నా అభివృద్ధి అని ప్రశ్నిస్తున్నారు.. అయితే జీవన్ రెడ్డి వ్యవహారం ఇప్పుడు కాంగ్రెస్ పార్టీకే ఇబ్బందిగా మారుతోంది. ఆయన తీరు సీఎం రేవంత్ రెడ్డితో పాటు.. సిట్టింగ్ ఎమ్మెల్యేను ఇబ్బంది పెట్టేలా కనిపిస్తోంది. దాంతో జీవన్ రెడ్డికి చెక్ పెట్టాలని ఎమ్మెల్యే సంజయ్ వర్గం కోరుతున్నట్టు తెలుస్తోంది. కానీ జీవన్ రెడ్డి మాత్రం.. తన తీరు మార్చుకోవడం లేదు. గతంలోనే మంత్రిగా, ఎంపీ, ఎమ్మెల్యేగా, ఎమ్మెల్సీగా అనేకమార్లు అవకాశం ఇచ్చారు. గత అసెంబ్లీ ఎన్నికల సమయంలోనూ జగిత్యాలలో ఎమ్మెల్యేగా అవకాశం ఇచ్చారు. అయినప్పటికీ ఆయన ఓడారు. ఆ తర్వాత పార్లమెంటు ఎన్నికలు జరిగితే.. నిజామాబాద్ ఎంపీగా అవకాశం కల్పించారు. అక్కడ ఓడిపోయారు. ఇప్పటికి దజన్‌కు పైగా ఎన్నికల్లో పోటీ చేసే అవకాశాలు దక్కాయి. ఇన్ని అవకాశాలు ఎవరికి దక్కలేదు. అయినప్పటికీ.. కన్నతల్లి లాంటి సొంత పార్టీపై విషం చిమ్మితే ఎలా అని పార్టీ హైకమాండ్ సీరియస్ అయినట్టు తెలుస్తోంది. ముఖ్యంగా సీఎం రేవంత్ రెడ్డి.. జగిత్యాల లీడర్ పై తీవ్ర అసంతృప్తితో ఉన్నారని తెలుస్తోంది. 75 ఏళ్ల వయసులో ఇంత చాదస్థం ఇంత చాదస్థం అవసరమా అని ప్రశ్నించినట్టు టాక్ వినిపిస్తోంది. మొత్తంమీద మాజీ ఎమ్మెల్సీ జీవన్ రెడ్డిని లైట్ తీసుకోమంటూ పార్టీ నుంచి ఆదేశాలు వచ్చాయని తెలుస్తోంది.

ఇకమీదట జీవన్ రెడ్డిని పూర్తిగా పక్కన పెట్టాలంటూ జగిత్యాల నేతలకు కూడా సూచించారని ప్రచారం జరుగుతోంది. ఇప్పటికే పలుమార్లు అవకాశాలు దక్కాయి.. భవిష్యత్తులో చాన్స్ ఇద్దామని పార్టీ పెద్దలు భావించారు. కానీ ఆ మాత్రం ఓపిక లేకపోతే ఎట్టా అని పార్టీ హైకమాండ్ ప్రశ్నించిందట. ఇయితే ఇన్నాళ్లు ఎమ్మెల్యే సంజయ్ ను విమర్శించొద్దని హెచ్చరించినా ఆయన మాత్రం తగ్గడం లేదు. దాంతో ఆయనకు చెక్ పెడితేనే జగిత్యాలలో కాంగ్రెస్ కు భవిష్యత్తు అని టీపీసీసీ వర్గాలు సైతం అభిప్రాయానికి వచ్చినట్టు ప్రచారం జరుగుతోంది. మొత్తానికి పెద్దాయన చాదస్థం వీడి.. పార్టీ లైన్‌లో పనిచేస్తారా.. లేక మారేది లేదు అన్నట్టుగా వ్యవహరిస్తారా అనేది తెలియాలంటే మాత్రం కొద్దిరోజులు ఆగాల్సిందే..

## మహాలక్ష్మి ఉచిత బస్సు ప్రయాణంపై మరో అప్డేట్.. రూల్స్‌లో మార్పులు చేసిన ప్రభుత్వం.. ఇకపై మహిళలు..

హైదరాబాద్, జనవరి 23, మహాలక్ష్మి పథకంలో భాగంగా అమలు చేస్తున్న మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంపై తెలంగాణ ప్రభుత్వం కీలక అప్డేట్ ఇచ్చింది. ఇక నుంచి మహిళలు జీరో టికెట్ పొందేందుకు ఆధార్ కార్డు లేదా ఓటర్ కార్డులు లాంటి ప్రభుత్వ గుర్తింపు ధృవీకరణ పత్రాలను చూపించాల్సిన అవసరం లేదు. ఇప్పటివరకు మహిళల ఆధార్ కార్డులను చెక్ చేసి కండక్టర్లు జీరో టికెట్ జారీ చేస్తున్నారు. అయితే ఆధార్ కార్డుల్లో పాత ఫొటోలు ఉండటంతో మహిళలను గుర్తించడం కండక్టర్లకు కష్టతరంగా మారింది. దీంతో కండక్టర్లు, మహిళల మధ్య వాగ్వాదాలు జరుగుతున్న సంఘటనలు రాష్ట్రవ్యాప్తంగా చోటుచేసుకుంటూనే ఉన్నాయి. దీనికి చెక్ పెట్టి మహిళలు సులభతరంగా బస్సుల్లో ప్రయాణించేందుకు కొత్త విధానాన్ని అమలు చేసేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. ఇందుకోసం మహిళలకు ప్రత్యేక ఐడీ కార్డులను ఇవ్వనుంది.త్వరలో రాష్ట్రంలోని మహిళలందరికీ మహాలక్ష్మి ఐడీ కార్డ్‌లను పంపిణీ చేయనుంది. మహిళలు బస్సుల్లో ఉచిత బస్సు ప్రయాణం పొందేందుకు ఇవి ఒక ఐడీ కార్డులా ఉపయోగపడతాయి. ఈ కార్డులపై మహిళ ఫొటోతో పాటు పేరు, గ్రామం, మండలం, జిల్లా వంటి అడ్రస్ వివరాలు పొందుపర్చి ఉంటాయి. అలాగే ఈ స్మార్ట్ కార్డులపై క్యూఆర్ కోడ్‌తో పాటు అత్యాధునిక చిప్ ఉంటుంది. కండక్టర్ల వద్ద ఉండే మెషిన్‌తో స్మార్ట్ కార్డులపై ఉండే చిప్‌ను స్కాన్ చేయగానే ప్రయాణ వివరాలు నమోదవుతాయి. దీని వల్ల మహిళలు ఆధార్ కార్డును చూపించాల్సిన అవసరం లేదు. తమ దగ్గర ఆధార్ కార్డును క్యారీ చేయాల్సిన పని ఉండదు. ఈ స్మార్ట్ కార్డుల ద్వారా సులువుగా మహిళలు ప్రయాణం చేయవచ్చు.ప్రతీ ఒక్క వ్యక్తికి ఆధార్ ప్రత్యేక నెంబర్ ఉన్నట్లుగానే.. ఈ స్మార్ట్ కార్డుల ద్వారా ప్రతీ మహిళకు ఒక 16 అంకెల విశిష్ట నెంబర్‌ను కేటాయిస్తారు. కార్డు ముందు భాగంలో మహిళ ఫొటో, అడ్రస్ వివరాలు ఉంటాయి. ఈ స్మార్ట్ కార్డుల తయారీ ఇప్పటికే ప్రారంభమవ్వగా.. త్వరలో ముద్రణ పూర్తి కానుంది. కార్డుల తయారీ కోసం రూ.75 కోట్ల నిధులను ఆర్టీసీకి ప్రభుత్వం కేటాయించింది. రాష్ట్రంలోని 1.5 కోట్ల మంది మహిళలకు కార్డులు అందించనున్నారు. తొలుత 5 లక్షల కార్డులను పైలట్ ప్రాజెక్ట్ కింద జారీ చేయనుండగా.. ఆ తర్వాత మిగతా లబ్దిదారులకు పంపిణీ చేయనున్నారు. ప్రభుత్వం సమగ్ర కుటుంబ సర్వే నిర్వహించి అందరీ వివరాలు గతంలో సేకరించింది. ఈ వివరాల ఆధారంగా సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్‌కు లబ్దిదారులను ఎంపిక చేసే బాధ్యతను ప్రభుత్వం అప్పగించింది

## పెట్టుబడుల వేటలో రేవంత్

హైదరాబాద్ , జనవరి 23, ఏ రాష్ట్రానికి అయినా సరే పెట్టుబడులు చాలా అవసరం. ఎందుకంటే పెట్టుబడుల ద్వారానే ఆదాయం సమకూరుతూ ఉంటుంది. ఉద్యోగాలను కల్పించే అవకాశం ఉంటుంది. ఆర్థికంగా రాష్ట్రాన్ని బలోపేతం చేసుకోవడానికి అవకాశం ఉంటుంది. ఈ పెట్టుబడుల కోసమే ప్రస్తుతం తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మంత్రులతో కలిసి దావోస్ వెళ్లిపోయారు?దావోస్ ప్రాంతంలో జరుగుతున్న ప్రపంచ ఆర్థిక వేదిక సదస్సులో ఆయన పాల్గొంటున్నారు. తెలంగాణలో అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లు, యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ, యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ ద్వారా రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. స్కిల్ డెవెలప్మెంట్, స్పోర్ట్స్ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యమిస్తుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. తెలంగాణ అభివృద్ధి లక్ష్యాలతో మూడు జోన్ల నమూనాలను దావోస్ వేదికపై ఐటీ, పరిశ్రమల మంత్రి శ్రీధర్ బాబు విశ్లేషించారు. క్యూర్, ప్యూర్, రేర్ ఆర్థిక అభివృద్ధి వ్యూహంతో పాటు భారత్ ఫ్యూచర్ సిటీ ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ సిటీ నెట్-జీరో గ్రీన్‌ఫీల్డ్ స్మార్ట్ సిటీ ప్రాజెక్టుగా, దేశంలో సుస్థిర అభివృద్ధికి రోల్ మోడల్ సిటీగా నిలుస్తుందని శ్రీధర్ బాబు అభిప్రాయం వ్యక్తంచేశారు.తెలంగాణ సమగ్రాభివృద్ధికి కార్యాచరణ ప్రణాళిక అద్భుత ఫలితాలను ఇస్తోందని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి తెలిపారు. ఏరోస్పేస్, డిఫెన్స్, బయో-డిజైన్, సాఫ్ట్‌వేర్, ఫార్మా రంగాల్లో హైదరాబాద్ పరిపూర్ణ అనుకూలతలున్నాయని వివరించారు. కాలుష్యాన్ని తగ్గించే విధంగా ఎలక్ట్రిక్ వాహనాలు, పునరుత్పాదక ఇంధనంపై తెలంగాణ ప్రభుత్వం దృష్టి పెట్టిందని పొంగులేటి శ్రీనివాసరెడ్డి దావోస్ వేదికపై పారిశ్రామిక వేత్తలకు తెలిపారు.తెలంగాణ రైజింగ్ పేరుతో ఆయన పెట్టుబడులను ఆకర్షించే ప్రయత్నం చేస్తున్నారు. ఈ క్రమంలోనే రాష్ట్రంలో 23 వేల కోట్ల పెట్టుబడిలను పెట్టేందుకు అనేక సంస్థలతో తెలంగాణ ప్రభుత్వం అవగాహన ఒప్పందాలను కుదుర్చుకుంది. డక్టైల్ ఐరన్ పైపుల తయారీలో ప్రపంచ వ్యాప్తంగా పేరున్న రష్మీ గ్రూపు తెలంగాణ రాష్ట్రంలో 12,500 కోట్ల పెట్టుబడితో స్టీలు ఉత్పత్తి యూనిట్ ఏర్పాటు చేయనుంది. స్లోవేకియ దేశానికి చెందిన న్యూక్లర్ ప్రొడక్ట్ సంస్థ 6000 కోట్ల పెట్టుబడి పెట్టనుంది. స్మాల్ మాడ్యూల్ రియాక్టర్ ఆధారిత విద్యుత్ ప్రాజెక్టు ను తెలంగాణలో ఏర్పాటు చేయబోతోంది.సౌందర్య ఉత్పత్తుల తయారీలో పేరు ఎన్నికల లోరియల్ అనే సంస్థ 3500 కోట్ల పెట్టుబడితో గ్లోబల్ టెక్ హబ్ ను తెలంగాణ రాష్ట్రంలో ఏర్పాటు చేయబోతోంది. అమెరికాలో విమానయాన రంగంలో పేరుపొందిన సర్గార్డ్ అనే సంస్థ.. దశలవారీగా 1 కోట్లు పెట్టుబడి పెట్టేందుకు ముందుకు వచ్చింది.. ఇందులో భాగంగా అనేక సంస్థలతో తెలంగాణ ప్రభుత్వం ఒప్పందాలు కుదుర్చుకోనుంది. రష్మీ గ్రూప్ ద్వారా తెలంగాణ రాష్ట్రంలో 12,000 మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉద్యోగాలు వస్తాయని తెలుస్తోంది.ప్రపంచవ్యాప్తంగా బీర్లను తయారు చేసే అతిపెద్ద కంపెనీగా పేరు తెచ్చుకున్న ఏబి ఇన్ బెవ్.. తెలంగాణ రాష్ట్రంలో ఉన్న తన తయారీ యూనిట్ ను మరింత విస్తరించబోతోంది. దీనికోసం భారీగా పెట్టుబడులు పెట్టబోతోంది. తద్వారా వేలాది మందికి ఉపాధి లభించబోతోంది. బ్లైజ్ అనే సంస్థ వ్యవస్థాపకుడు దినకర్ మునగాల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో ప్రత్యేకంగా భేటీ అయ్యారు. ఇప్పటికే తమ సంస్థ ఆధ్వర్యంలో రీసెర్చ్ డెవలప్మెంట్ సెంటర్ నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు.. త్వరలోనే హెల్త్ కేర్ డయాగ్నస్టిక్స్, మ్యానుఫ్యాక్చరింగ్, ఆటో మేషన్, ఎనర్జీ ఎఫిషియన్సీ వంటి రంగాలలో పెట్టుబడులు పెడతామని దినకర్ వెల్లడించారు. గత ఏడాది జరిగిన సదస్సులో రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలోని తెలంగాణ ప్రభుత్వం భారీగా పెట్టుబడులను ఆకర్షించింది. ఈసారి కూడా అదే స్థాయిలో పెట్టుబడులను ఆకర్షిస్తున్నది.

## 10 కి.మీ ప్రయాణానికి 45 నిమిషాలు.. ప్రపంచంలోనే అత్యధిక ట్రాఫిక్ కలిగిన రెండో నగరం ఇదే!

హైదరాబాద్, జనవరి 23, ఇప్పటికే ట్రాఫిక్‌కు అపఖ్యాతి పాలైన భారతదేశ టెక్ రాజధాని బెంగళూరు ఇప్పుడు ప్రపంచంలోనే అత్యంత రద్దీగా ఉండే నగరాల్లో ఒకటిగా అవతరించింది. తాజాగా నెదర్లాండ్‌కు చెందిన టామ్ టామ్ ట్రాఫిక్ ఇండెక్స్ విడుదల చేసిన రిపోర్ట్ ప్రకారం.. మెక్సికో సిటీ 75.9 శాతం ట్రాఫిక్ రద్దీతో ఈ జాబితాలో మొదటి స్థానంలో నిలవగా బెంగళూరు 74.4 శాతం ట్రాఫిక్ రద్దీతో ప్రపంచవ్యాప్తంగా అత్యంత ట్రాఫిక్ రద్దీ కలిగిన రెండవ నగరంగా నిలిచిందని పేర్కొంది. అయితే 2014తో పోలిస్తే 2025లో బెంగళూరు నగరంలో ట్రాఫిక్ రద్దీ 1.7 శాతం పెరిగినట్లు పేర్కొంది. దీన్ని బట్టి చూస్తే బెంగళూరులోని జనాలు ఎక్కువ సమయం రోడ్లపైనే గడుపుతున్నారని అర్థమవుతుంది.బెంగళూరు ప్రయాణికులకు, నివేదికలోని ముఖ్య గణాంకాలను బట్టి చూస్తే.. 2024లో నగరంలో ట్రాఫిక్ రద్దీ సమయంలో 10 కి.మీ దూరం ప్రయాణించడానికి అరగంట సమయం పడితే 2025కు వచ్చే సరికి 10 కి.మీ ప్రయాణించేందుకు సగటున 36 నిమిషాల 9 సెకన్లు పట్టింది. బెంగళూరులో ఉదయం వేళల్లో ట్రాఫిక్ రద్దీ శాతం 94 శాతంగా ఉంటే అప్పుడు 10 కి.మీ ప్రాణించేందుకు 41 నిమిషాల 6 సెకన్లు పడుతదుంది. అప్పుడు వాహనం సగటు వేగం గంటలకు కవలం 14.6 కి.మీ మాత్రమే ఉంది. ఇక సాయంత్రం సమయాల్లో 115.2 శాతం రద్దీ ఉంటే.. అప్పుడు 10 కి.మీ ప్రయాణిచేందుకు 45 నిమిషాల 27 సెకన్లు పడుతుంది. అప్పుడు వాహనం సగటు వేగం గంటలకు 13.2 కి.మీగా ఉంది. అంటే 15 నిమిషాల్లో కేవలం 4 కిలో మీటర్లు మాత్రమే ప్రయాణిస్తున్నారు.2025లో రద్దీ సమయాల్లో ట్రాఫిక్ కారణంగా బెంగళూరు డ్రైవర్లు 168 గంటలు కోల్పోతారని ఇండెక్స్ అంచనా వేసింది, ఇది 7 రోజుల 40 నిమిషాలకు సమానం అని తెలిపింది. 2024 తో పోల్చుకుంటే ఇది 12 గంటల 46 నిమిషాలు ఎక్కువ. బెంగళూరులో అత్యధికంగా ట్రాఫిక్ రద్దీ కలిగిన మే 17,2025ను అత్యంత చెత్తరోజుగా టామ్‌టామ్ పేర్కొంది.ఇక హైదరాబాద్ విషయానికి వస్తే నగరంలో సగటున 55.5 శాతం ట్రాఫిక్ రద్దీ ఉంటుంది. ఈ సమయంలో 18 కిలో మీటర్లు ప్రయాణించేందుకు గంట సమయం పడుతుంది. ఈ ట్రాఫిక్ రద్దీ కారణంగా సుమారు నగర వాసులకు 123 గంటల సమయం వృదా అవుతుంది.

అత్యంత ట్రాఫిక్ కలిగిన 35 నగరాల్లో 7 ఇండియావే

2 బెంగళూరు ? 74.4 శాతం రద్దీ

5 పూణే ? 71.1 శాతం

18 ముంబై ? 63.2 శాతం

23 న్యూఢిల్లీ ? 60.2 శాతం

29 కోల్‌కతా ? 58.9 శాతం

30 జైపూర్ ? 58.7 శాతం

32 చెన్నై ? 58.6 శాతం

## మేడారంలో తొలి ఘట్టం.. మండమెలిగే

వరంగల్ , జనవరి 23, మేడారం మహాజాతరకు సరిగ్గా వారం రోజుల ముందు నిర్వహించే తొలిఘట్టం మండమేలిగే పండుగ మహా వైభవంగా జరిగింది. ఆదివాసీ సాంప్రదాయాల ప్రకారం ఆ కార్యక్రమం నిర్వహించారు. దృష్టశక్తుల చూపు మేడారం వైపు పడకుండా దిగ్బంధం చేసి కోడిపిల్లను బలిచ్చి ఊరుకట్టు నిర్వహించారు. మాఘశుద్ధ పంచమి సందర్భంగా నిర్వహించిన ఈ వేడుకతో మేడారం జాతర ప్రారంభమైనట్టే భావిస్తారు. మండమెలిగే పండుగ నుంచి సరిగ్గా వారం రోజులకు అమ్మవార్లు వనం నుండి జనంలోకి వస్తారు.మేడారం సమ్మక్క సారలమ్మ మహాజాతర సమీపిస్తోంది. జనవరి 28 నుండి 31వ తేదీ వరకు మాఘశుద్ధ పున్నమి వెన్నెల్లో సమ్మక్క సారక్క దేవతల గద్దెలపై కొలువు దేరే గడియలు ఆసన్నం అవుతున్నాయి. మహా జాతరకు సరిగ్గా వారం రోజుల ముందు ఆదివాసీలు ఆచార సాంప్రదాయాల ప్రకారం నిర్వహించే మండమెలిగే పండుగ ముగిసింది. ఈ సందర్భంగా సమ్మక్క సారక్క పూజారులు ప్రత్యేక పూజలు చేశారు. మేడారంలో సమ్మక్క తల్లి, కన్నెపల్లిలో సారలమ్మ. పూనుగొండ్లలో పగిడిద్దరాజు, కొండాయిలో గోవిందరాజు ఆలయాల్లో ఆదివాసీలు పూజలు నిర్వహించారు. మండమెలిగే వేడుకలో ఆదివాసీ ఆచార సాంప్రదాయాల ప్రకారం మేడారం పొలిమేరల్లో పూజారులు దిష్టి తోరణాలు కట్టారు. కోడిపిల్లను బలిచ్చి ఊరు చుట్టూ తోరణాలు కట్టడం వల్ల ఎలాంటి దుష్టశక్తులు దరి చేరవని ఇక్కడి పూజారుల విశ్వాసం.మేడారం పొలిమేరల్లో మామిడి, తునికి ఆకులతో తోరణాలు కట్టారు. ఊరు చుట్టూ చలిగంజి, అంబలితో కట్టు పోస్తారు. ఆ తరువాత సమ్మక్క సారలమ్మకు సంబంధించిన పూజా సామగ్రిని మేడారం గద్దెలపైకితీసుకొచ్చి పూజలు నిర్వహిస్తారు. పసుపు, కుంకుమలతో పూజలు చలపయ్య మొక్కులు సమర్పిస్తారు. ఆ తరువాత పూజారులంతా. అమ్మవార్లకు నైవేద్యాలు సమర్పించి, పూజా కార్యక్రమాలు చేసి కొత్త వస్త్రాలతో గద్దెలను అలంకరిస్తారు. ఈ తంతు నిర్వహించడం ద్వారా జాతరకు అంకురార్పణ జరిగినట్లు బావిస్తారు. పూజలు పూర్తయిన తర్వాత జాగారాలు కూడా చేపడుతారు. ఈ సందర్భంగా ఇవ్వాల రాత్రి నుండి రేపు తెల్లవారుజాము వరకు అమ్మవారి గద్దెల వద్దకు భక్తులు వెళ్లకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటారు.మండెమెలిగే పండుగతో జాతర ప్రారంభమైనట్టేనని భావిస్తారు. పుట్టమట్టితో అలికి ముగ్గులు కూడా వేశారు. సమ్మక్క- సారలమ్మ ఆయుధాలు, గజ్జెలు, కత్తులు, కుంకుమ భరిణెలు, ఇతర పూజా సామగ్రిని శుద్ధి చేస్తారు. అనంతరం మేడారం లోని సమ్మక్క ప్రధాన పూజారి ఇంటి నుంచి డప్పుచప్పుళ్లు, డోలు వాయిద్యాల నడుమ పసుపు, కుంకుమలతో మేడారం చుట్టూ ఊరేగింపు నిర్వహించారు.. అక్కడి నుంచి సమ్మక్క గుడికి వెళ్లి గిరిజన ఆడపడుచులు పూజలు చేస్తారు. ఆ తరువాత గ్రామ బొడ్రాయికి శుద్ధ జలంతో అభిషేకాలు చేశారు.

# రాజకీయ రంగుపులుముకున్న నైనీ కోల్ మైన్స్

హైదరాబాద్ , జనవరి 23, నైనీ కోల్ మైన్స్ టెండర్ల విషయంలో సింగరేణి కీలక నిర్ణయం తీసుకుంది. ఇవాళ్టి నుంచి తీసుకోవాల్సిన బిడ్స్ ని రద్దు చేస్తునట్లు ప్రకటించింది. పాలనాపరమైన కారణాలతో టెండర్లు రద్దు చేసినట్లు చెప్పింది. నిబంధనలు, టెండర్లపై పాలక మండలిలో మరోసారి చర్చిస్తామని ఆ తర్వాతే తదుపరి నిర్ణయం తీసుకుంటామని సింగరేణి అధికారులు తెలియజేశారు.ఇటు నైనీ కోల్ బ్లాక్ టెండర్ల విషయంలో సింగరేణి పాలక మండలిని కేంద్ర బొగ్గు గనుల శాఖ ప్రశ్నించింది. సంస్థ విధించిన నిబంధనలపై పాలక మండలి ఎందుకు చర్చించలేదని అడిగింది. చర్చించి ఉంటే టెండర్ల విషయంలో అవినీతి ఆరోపణలు ఎందుకు వస్తున్నాయని, టెండర్ వేయాలనుకున్న కంపెనీలకు ఎందుకు సైట్ విజిట్ ధృవీకరణ పత్రాలు ఇవ్వడం లేదని కేంద్ర బొగ్గు గనుల శాఖ అడిగింది. నిబంధనలు, టెండర్లపై పాలక మండలిలో చర్చించి మరోసారి నిర్ణయం తీసుకుంటామని తెలిపారు సింగరేణి అధికారులు. కాగా.. బొగ్గు బ్లాక్ ల టెండర్ల వ్యవహారం వివాదాస్పదంగా మారింది. నైనీ కోల్ మైన్స్ టెండర్స్ విషయంలో బీఆర్ఎస్, బీజేపీ సంచలన ఆరోపణలు చేసిన సంగతి తెలిసిందే.తెలంగాణలో బొగ్గు గనుల టెండర్లపై రాజకీయ వివాదం చెలరేగింది. నైనీ బొగ్గు గని టెండర్ నోటిఫికేషన్ ప్రభుత్వం రద్దు చేయడంతో ఒక్కసారిగా కోల్ వార్ మొదలైంది. నోటిఫికేషన్ రద్దుపై సీబీఐ విచారణ జరిపించాలని బీఆర్ఎస్ డిమాండ్ చేస్తోంది. సీఎం రేవంత్ కి, బీజేపీకి చీకటి ఒప్పందం జరిగిందని.. అందుకే రద్దు చేశారని బీఆర్ఎస్ నేతలు ఆరోపించారు. సీఎం రేవంత్ బావమరిదికి లబ్ది చేకూర్చేందుకే సైట్ విజిట్ సర్టిఫికెట్ నిబంధన తెచ్చారని హరీశ్ రావు అంటున్నారు. బొగ్గు కుంభకోణాన్ని బయటపెట్టినందుకే హరీశ్ రావుకి నోటీసులు ఇచ్చారని కేటీఆర్ ఆరోపించారు.సింగరేణి చుట్టూ రాజకీయ వివాదం చెలరేగింది. బొగ్గు గనుల కేటాయింపులపై బీఆర్ఎస్ తీవ్ర ఆరోపణలు చేస్తోంది. ఒడిశాలోని నైనీ బొగ్గు గనుల టెండర్లతో వివాదం మొదలైంది. రేవంత్ రెడ్డి బావమరిదికి లబ్ది కలిగించేందుకే తెలంగాణ ప్రభుత్వం టెండర్ల నిబంధనల్లో మార్పులు చేసిందని బీఆర్ఎస్ ఆరోపించింది. సైట్ విజిట్ సర్టిఫికెట్ అనే కొత్త విధానం తెచ్చి గ్లోబల్ టెండర్లలో పాల్గొంటున్న వారి వివరాలు తెలుసుకుని వారు టెండర్లలో పాల్గొనకుండా చేసి రేవంత్ రెడ్డి బావమరిదికి టెండర్లు దక్కేలా తెలంగాణ ప్రభుత్వం ప్రయత్నిస్తోందని బీఆర్ఎస్ ఆరోపించింది. అందులో భాగంగానే నైనీ బొగ్గు గనుల కేటాయింపు టెండర్లను భట్టి విక్రమార్క రద్దు చేశారని బీఆర్ఎస్ నేతలు ఆరోపిస్తున్నారు.నైనీ బొగ్గు గనుల టెండర్ల రద్దుతో పాటు ఇతర బొగ్గు గనుల కేటాయింపులపై సీబీఐ విచారణకు బీఆర్ఎస్ నేతలు డిమాండ్ చేస్తున్నారు. ముఖ్యమంత్రి రేవంత్ బావమరిది టెండర్ల విషయాన్ని బయటపెట్టినందుకే ఫోన్ ట్యాపింగ్ కేసులో హరీశ్ రావుకి నోటీసులు ఇచ్చి విచారణకు పిలిచారని బీఆర్ఎస్ నేతలు అంటున్నారు.

# నూజివీడులో బ్యాంక్ ఉద్యోగుల ర్యాలీ

ఏలూరు యునైటెడ్ ఫారం ఆఫ్ బ్యాంక్ యూనియన్స్ ఆధ్వర్యంలో నూజివీడు బ్యాంకు ఉద్యోగులు నూజివీడు పట్టణంలోని హనుమాన్ జంక్షన్ రోడ్ లోని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నుండి చిన్న గాంధీ బొమ్మ సెంటర్ మీదగా పెద్ద గాంధీ బొమ్మ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు.2024లో సెటిల్మెంట్లో ఫైవ్ డే బ్యాంకింగ్ నిర్వహించేందుకు అంటే ప్రతి శనివారం కూడా హాలిడే ఇస్తామని సెటిల్మెంట్ చేసుకున్న ప్రభుత్వం అది అమలు చేయాలని ఎన్నోసార్లు శాంతియుతంగా ప్రభుత్వాన్ని అడుగుతూ వచ్చాం ఇప్పటివరకు దానిని ఆచరణలో పెట్టకపోవడంతో 2025 జనవరి నుండి వివిధ రకాలగా నిరసన తెలిపి మార్చిలో స్ట్రైక్ నోటీస్ ఇచ్చి ధర్నా చేయడం జరిగినది. ఆ సమయంలో సెంట్రల్ లేబర్ కమిషనర్ వచ్చి మాట్లాడే మీకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చి ఇప్పటివరకు మాకు న్యాయం జరగలేదు ఇప్పుడైనా ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం మాకు న్యాయం చేయాలంటూ ఆందోళన బాట పట్టామంటున్న బ్యాంకు ఉద్యోగులు.

# రాష్ట్ర భవిష్యత్ సుభిక్షంగా ఉండాలంటే.... లోకేష్ ప్రజలకు అండగా ఉండాలి: గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము

### గుడివాడలో ఘనంగా మంత్రి నారా లోకేష్ పుట్టినరోజు వేడుకలుపార్టీ శ్రేణులతో కలిసి లోకేష్ పుట్టినరోజు కేక్ కట్ చేసిన.... ఎమ్మెల్యే రాము

### విజనరీ లోకేష్ నేతృత్వంలో రాష్ట్రానికి లక్షల కోట్ల పెట్టుబడులు....లక్షలాదిమందికి ఉపాధి: ఎమ్మెల్యే రాము

జనవరి 23: రాష్ట్రం క్లిష్ట పరిస్థితులలో ఉన్నప్పుడు టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఐటీ, విద్యా శాఖ మం త్రి నారా లోకేష్ యువగళంతో ప్రజల్లో చైతన్యం నింపారని, రాష్ట్ర భవిష్యత్ సుభిక్షంగా ఉండాలంటే ప్రజలకు అండగా లోకేష్ ఉండాలని గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము ఆకాంక్షించారు. గుడివాడ తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో మంత్రి నారా లోకేష్ పుట్టినరోజు వేడుకలను ఎన్టీఆర్ స్టేడియం ప్రాంగణంలో శుక్రవారం ఉదయం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా టిడిపి శ్రేణులతో కలిసి గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము లోకేష్ పుట్టినరోజు కేక్ కట్ చేసి పార్టీ నాయకులకు తినిపించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాము మాట్లాడుతూ.... నేడు రాష్ట్రంలోని టిడిపి శ్రేణులకు పండగ రోజన్నారు.తండ్రికి తగ్గ తనయుడిగా, అద్భుతమైన విజన్ తో ప్రణాళిక బద్దంగా ముందుకు వెళుతున్న లోకేష్ కృషి ఫలితంగా రాష్ట్రంలో లక్షలాది మంది యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయన్నారు. రాష్ట్ర ప్రజలకు టెక్నాలజీ చేరువ చేయడమే కాకుండా, లక్షల కోట్ల పెట్టుబడులను రాష్ట్రానికి తీసుకురావడంలో లోకేష్ విజయవంతంగా ముందుకు సాగుతున్నారన్నారు.గత వైకాపా పాలనలో నిర్వహించిన గ్లోబల్ మీట్ లో భోజనాల కోసం కొట్టుకున్న సందర్భాలను చూశామని.... లోకేష్ నేతృత్వంలో కూటమి ప్రభుత్వంలో నిర్వహించిన గ్లోబల్ మీట్ లో ప్రపంచంలోనే దిగ్గజ కంపెనీల సీఈవోలు, ప్రతినిధులు పాల్గొన్నారన్నారు.విజనరీ లీడర్ లోకేష్ గొప్పతనంపై అనేక జాతీయ ప్రముఖ మ్యాగజైన్లు ముఖచిత్రంగా ప్రచురించాయన్నారు. నేడు లోకేష్ పుట్టినరోజు వేడుకల్లో అందరం కలిసి సంతోషంగా పాల్గొన్నామని ఎమ్మెల్యే రాము అన్నారు.ఈ కార్యక్రమంలో ఏపీ స్టేట్ వేర్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ రావి వెంకటేశ్వరరావు , ఎన్టీఆర్ స్టేడియం కమిటీ వైస్ చైర్మన్ యలవర్తి శ్రీనివాసరావు , గుడివాడ మండల, నందివాడ మండల టిడిపి అధ్యక్షులు వాసే మురళి, దానేటి సన్యాసిరావు, మార్కెట్ యార్డ్ చైర్మన్ చాట్రగడ్డ రవికుమార్,టిడిపి నాయకులు పంద్రాజు సాంబయ్య, పిన్నమనేని బాబ్జి, చేకూరు జగన్మోహన్రావు,యార్లగడ్డ సుధారాణి,గోకవరపు సునీల్ , మజ్జాడ నాగరాజు,వేశపోగు ఇమ్మానుయేలు ,కంచెర్ల సుధాకర్,సయ్యద్ జబీన్ ,సిరిపురపు తులసీరాణి, ముళ్ళపూడి రమేష్ చౌదరి, కిలారపు రంగప్రసాద్, షేక్ ఇబ్రహీం, మేరుగుమాల బ్రహ్మయ్య, డేవిడ్, వంగపండు ఆదినారాయణ, గొర్ల శ్రీలక్ష్మి, నిరంజన్, అడుసుమిల్లి శ్రీనివాస్, కోడూరి ప్రభు , తెలుగు, మహిళలు తెలుగు యువత, టిడిపి అనుబంధ విభాగాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# రవాణా శాఖ ఉద్యోగుల భద్రత కోసం కృషి

శ్రీకాకుళం ఆంధ్రప్రదేశ్ ప్రజా రవాణా విభాగం లో ఉద్యోగుల భద్రత కోసం అన్ని విధాల కృషి చేస్తున్నామని ఎండి ద్వారక తిరుమల రావు తెలిపా రు. శ్రీకాకుళం ఆర్టిసి కాంప్లెక్స్ లో జరిగిన ఉద్యోగుల అభినందన సభలో ఆయన మాట్లాడుతూ, ప్రావిడెంట్ ఫండ్ తదితర అంశా లపై ప్రత్యేక దృష్టి సారించి ఉద్యో గుల భద్రతకు చర్యలు తీసుకుం టున్నామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా పలువురు ఉద్యోగుల ను సత్కరించారు.శ్రీకాకుళం రెం డవ డిపో గ్యారేజీ ఆవరణలో ఏర్పాటు చేసిన ఆదర్శ ఉద్యోగుల అభినందన సభలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఉద్యోగులకు ప్రశంసా పత్రాలతో సత్కరించారు.

# రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ జన్మదినం సందర్భంగా రక్తదానం చేసిన మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి

### మెగా రక్తదాన శిబిరాన్ని ప్రారంభించిన మంత్రి

రక్తదానానికి తరలివచ్చిన యువత మరియు ప్రజలురాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి మరియు టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ జన్మదినం సందర్భంగా శుక్రవారం రాయచోటి పట్టణం, ఎస్ ఎన్ కాలనీలోని మండిపల్లి భవన్ నందు ఏర్పాటు చేసిన భారీ రక్తదాన శిబిరాన్ని రాష్ట్ర రవాణా, యువజన క్రీడ శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ప్రారంభించి.మొదటిగా మంత్రి రక్తదానం చేశారు.ఈ రక్తదాన కార్యక్రమానికి జిల్లాలోని యువత తరలివచ్చారు. రాయచోటి నియోజకవర్గంలోని టిడిపి నాయకులు,కార్యకర్తలు, టిడిపి కుటుంబ సభ్యులు భారీ సంఖ్యలో హాజరవుతున్నారు. నారా లోకేష్ గారి జన్మదినాన్ని పురస్కరించుకొని మంత్రి ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు ఏర్పాటు చేయడం జరిగింది. జిల్లా నలుమూలల నుంచి వచ్చే ప్రజలకు అన్ని వసతులతో పాటు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు..



**నాంపల్లి గాంధీభవన్ ప్రజాబలం ప్రతినిధి:** శుక్రవారంనాడు గాంధీభవన్‌లో నేతాజీ సుబాష్ చంద్రబోస్ జయంతి సందర్భంగా పూలమాళ వేసి నివాళులర్పించిన కాంగ్రెస్ నాయకులు నిర్మల్ కూమర్ యాదవ్,మొహమ్మద్ సబేర్,బాబురావ్ ,జావీద్ అలీ

# శనివారం వికారాబాద్లో బీసీ సర్పంచ్ల భారీ సన్మాన సభ

### హాజరుకానున్న ఎంపీ ఈటెల రాజేందర్, ఆర్. కృష్ణయ్య పలువురు ప్రముఖులు గౌలికర్ ఫంక్షన్ హాల్ లో ఏర్పాట్లు పూర్తి

వికారాబాద్ పట్టణంలోని గౌలికర్ ఫంక్షన్ హాల్ వేదికగా రేపు 24 శనివారం నూతనంగా ఎన్నికైన బీసీ సామాజికవర్గ సర్పంచ్ల అభినందన సన్మాన కార్యక్రమం ఘనంగా జరగనుంది. ఈ కార్యక్రమానికి రాష్ట్ర జాతీయ స్థాయి బీసీ నాయకులు ముఖ్య అతిథులుగా విచ్చేయనున్నారు. ఈ సదస్సుకు మల్కాజ్గిరి పార్లమెంట్ సభ్యులు ఈటెల రాజేందర్, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్. కృష్ణయ్య, మాజీ ఎంపీ వి. హనుమంతరావు, మాజీ స్పీకర్ మధుసూదనా చారి, బీసీ నేతలు బి. జ్ఞానేశ్వర్ ముదిరాజ్, స్వామి గౌడ్ తదితరులు హాజరై ప్రసంగించనున్నారు.

గ్రామ పంచాయతీ ఎన్నికల్లో విజయం సాధించిన బీసీ సర్పంచ్లను గౌరవించుకోవడంతో పాటు, స్థానిక సంస్థలలో బీసీల పాత్ర భవిష్యత్తు కార్యాచరణపై ఈ సమావేశంలో చర్చించనున్నారు. ఉమ్మడి రంగారెడ్డి జిల్లా నలుమూలల నుండి భారీ సంఖ్యలో ప్రతినిధులు, బీసీ సంఘాల నాయకులు తరలివచ్చి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నిర్వాహకులు కోరారు.

# స్టీల్ ప్లాంట్ ఫ్యూచర్ పై మేఘాలు

విశాఖపట్టణం, జనవరి 23,విశాఖపట్నంలో ఉన్న ఉక్కు కర్మాగారం భవిష్యత్తుపై మరోసారి అనిశ్చితి మేఘాలు కమ్ముకున్నాయి. కర్మాగారం ఇప్పటికే ఆర్థిక ఇబ్బందులతో ఇబ్బంది పడుతున్న సమయంలో యాజమాన్యం మూడోసారి స్వచ్ఛంద పదవీ విరమణ పథకాన్ని ప్రకటించడం కార్మికుల్లో భయాందోళనలను పెంచింది. గతంలో రెండు విడతలుగా అమలు చేసిన ఈ పథకం వల్ల అనుభవం ఉన్న అనేక మంది ఉద్యోగులు సంస్థను వీడాల్సి వచ్చింది. ఇప్పుడు మరో విడతలో వందల సంఖ్యలో ఉద్యోగులను తగ్గించాలన్న యోచనతో ముందుకు రావడం కార్మిక వర్గాల్లో ఆగ్రహానికి కారణమవుతోంది.ఈ ఉక్కు కర్మాగారాన్ని నిర్వహిస్తున్న రాష్ట్రీయ ఇస్పాత్ నిగమ్ లిమిటెడ్ శాశ్వత ఉద్యోగుల సంఖ్యను క్రమంగా తగ్గిస్తూ వ్యయాన్ని నియంత్రించాలనే దిశగా అడుగులు వేస్తున్నట్లు సమాచారం. అయితే ఇది కేవలం ఖర్చు తగ్గింపు చర్య కాదని, క్రమంగా ప్రైవేటీకరణకు దారితీసే వ్యూహమనే అనుమానాలు బలపడుతున్నాయి. ఉద్యోగ భద్రతపై నమ్మకం కోల్పోతున్న కార్మికులు తప్పనిసరి పరిస్థితుల్లో ఈ పథకాన్ని అంగీకరిస్తున్నారని కార్మిక సంఘాలు చెబుతున్నాయి.కేంద్ర ప్రభుత్వం ఉక్కు కర్మాగారాన్ని ఆదుకోవడానికి భారీ పునరుజ్జీవ ప్యాకేజీ ప్రకటించినప్పటికీ, క్షేత్రస్థాయిలో ఆ ప్రభావం పెద్దగా కనిపించడం లేదు. ముడి సరుకు కొరత, నిధుల లేమి కారణంగా ఉత్పత్తి స్థాయి తగ్గిపోయింది. దీనివల్ల ఉద్యోగులకు వేతనాలు సకాలంలో అందకపోవడం, పండుగల సమయంలో కూడా ప్రోత్సాహకాలు లేకపోవడం వంటి సమస్యలు ఎదురవుతున్నాయి. భవిష్యత్తుపై నమ్మకం లేక యువ అధికారులు కూడా సంస్థను విడిచిపెట్టాలని భావించడం పరిస్థితి తీవ్రతను తెలియజేస్తోంది.ఇటీవల కర్మాగారంలోని అనేక విభాగాలను ప్రైవేటు సంస్థలకు అప్పగించేందుకు టెండర్లు పిలిచినట్లు వార్తలు రావడం కలకలం రేపింది. కీలక విభాగాలు కూడా ఈ జాబితాలో ఉండటంతో భద్రత, నిర్వహణపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఒకవైపు ప్రైవేటీకరణ లేదని హామీలు ఇస్తూనే మరోవైపు ఇలాంటి చర్యలు తీసుకోవడం గందరగోళానికి దారి తీస్తోంది. కాంట్రాక్ట్ కార్మికుల తొలగింపుతో కొన్ని విభాగాల్లో ప్రమాదాలు పెరిగాయని విమర్శలు వినిపిస్తున్నాయి.తెలుగు ప్రజల ఆత్మగౌరవంతో ముడిపడి ఉన్న విశాఖ ఉక్కు ను కాపాడాలనే డిమాండ్ మరింత బలపడుతోంది. కొందరు నిపుణులు సెయిల్లో విలీనం చేయడం ద్వారా సంస్థను నిలబెట్టవచ్చని సూచిస్తున్నా, ఇప్పటివరకు స్పష్టమైన నిర్ణయం రాలేదు. అనుభవజ్ఞులైన ఉద్యోగులను వదులుకోవడం వల్ల దీర్ఘకాలంలో ఉత్పత్తి, నాణ్యతపై ప్రతికూల ప్రభావం పడుతుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకుని పూర్తి స్థాయిలో నిధులు విడుదల చేస్తేనే ఈ కర్మాగారం భవిష్యత్తు భద్రమవుతుందన్న అభిప్రాయం విస్తృతంగా వ్యక్తమవుతోంది.

# వైభవంగా నాగోబా ఆలయంలో పూజలు

ఆదిలాబాద్ ఇంద్రవెల్లి మండలం కేస్లాపూర్ లోని నాగోబా ఆలయంలో ఆ ఆదిశేషుడికి అంగరంగ వైభవంగా పూజలు కొనసాగుతున్నాయి. జాతర లో మూడో రోజున ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి భారి సంఖ్యలో భక్తులు పోటెత్తడంతో క్యూ లైన్ లన్ని కిక్కిరిసిపోయాయి. భక్తులకు ఎక్కడ ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు అన్ని ఏర్పాట్లను పూర్తి చేశారు. జాతరలో భాగంగా ఈ రోజు ప్రజా దర్బార్ ను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిదిగా హాజరైన దేవాదాయ శాఖ మంత్రి కొనడా సురేఖ కు పూర్ణ కుంబ స్వాగతం పలుకగా ,,, నాగోబా ఆలయంలో ప్రత్యేక పూజలను నిర్వహించరు మంత్రి. ఆనంతరం దర్బార్ లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ జాతర గిరిజన సంస్కృతి, సంప్రదాయాలు, ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలుస్తుందన్నారు. ఆదివాసీలు సమ్మక్క, సారలమ్మ జాతర శుభాకాంక్షలు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆదివాసుల అభ్యున్నతికి కట్టుబడి ఉందన్నారు. ఇఒప్పతికె నాగోబా ఆలయ అభివృద్ధికి నిర్మల్ సభలో 22 కోట్లను కేటాయిస్తామని సియం.రేవంత్ రెడ్డి ప్రకటించారని,, త్వరలోనే ఆలయ అభివృద్ధికి నిదులను కేటాయిస్తామని తెలిపారు. నాగోబా ఆలయం వద్ద భక్తులకు మెరుగైన సౌకర్యాలు, మౌలిక వసతుల కల్పనతో పాటు ఆలయ పరిసరాల అభివృద్ధికి ఈ నిధులు ఉపయోగించనున్నట్లు తెలిపారు. నాగోబా చరిత్ర తరతరాలకు ఆదర్శం అన్నారు. నాగోబా పూజారులకు ధూప, దీప, నైవేద్యం పథకం కింద నాగోబా ఆలయంలో పనిచేస్తున్న ఏడుగురు సిబ్బందికి ప్రభుత్వం తరఫున వేతనాలు చెల్లిస్తామని హామీ ఇచ్చారు. దేవాలయంలో సిబ్బంది నియామకానికి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. గిరిజన సంప్రదాయ దేవాలయాల పరిరక్షణకు ప్రభుత్వం పూర్తి మద్దతుగా నిలుస్తుందన్నారు. 1942 నుంచి కొనసాగుతున్న నాగోబా దర్బార్ ప్రధాన ఉద్దేశ్యం ఆదివాసీల అర్జీల పరిష్కారమేనని అన్నారు. ఆదివాసుల నుంచి వచ్చిన ప్రతి అర్జిలను ప్రభుత్వం పరిష్కరిస్తుందని తెలిపారు. అటవీ భూముల సమస్యలు, పోడు భూముల సమస్యలను ప్రాధాన్యత క్రమంలో పరిష్కరిస్తామని తెలిపారు. దర్బార్ కార్యక్రమంలో ఆదివాసీలు చేసిన సాంప్రదాయ నృత్యాలు అందరిని అలరించాయి...

# అరసవల్లిలో రథ సప్తమి వేడుకలు

### అన్ని శాఖలు సమన్వయంతో పని చేయాఇ మంత్రి అచ్చెన్నాయుడు

శ్రీకాకుళం జిల్లా అరసవల్లి సూర్య నారాయణ స్వామి క్షేత్రంలో ఈ నెల 25న జరిగే రథసప్తమి వేడుక లకు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌ కర్యం కలగకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఆదే శించారు. రథసప్తమిని ప్రభుత్వం రాష్ట్ర పండుగగా ప్రకటించిన నేప థ్యంలో, ఈ ఉత్సవాలను అత్యం త ప్రతిష్టాత్మకంగా నిర్వహించాలని ఆయన స్పష్టం చేశారు. అరసవల్లి దేవస్థానాన్ని సందర్శించి, జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, జిల్లా ఎస్పీ కేవీ మహేశ్వర్ రెడ్డి ఇతర శాఖల ఉన్నతాధికారులతో కలిసి ఏర్పాట్లను సమీక్షించారు. భక్తులకు సత్వర, సౌకర్యవంత మైన దర్శనం కల్పించడమే ప్రధాన లక్ష్యంగా అధికారులు పనిచేయాల ని మంత్రి సూచించారు.ముఖ్యంగా ట్రాఫిక్ నియంత్రణ, వాహనాల పార్కింగ్పై ప్రత్యేక దృష్టి సారించా లని ఆదేశించారు. దేవస్థానంలోని అన్ని సెక్టార్లను కలియ తిరిగిన మంత్రి, టికెట్ల విక్రయ కేంద్రాల గురించి భక్తులకు తెలిసేలా విస్తృత ప్రచారం కల్పించాలని చెప్పారు. కమాండ్ కంట్రోల్ రూమ్ నుంచి 250 కి పైగా కెమెరాలతో జరుగుతున్న భద్రత పర్యవేక్షణను స్వయంగా పరిశీలించారు.

# ఓటు రాజ్యాంగం కల్పించిన గొప్ప వరం - బాధ్యతగా వినియోగించుకోవాలి:

## జిల్లా కలెక్టర్ రాజర్షి షా



ప్రతి పౌరుడు తమ ఓటు హక్కును తప్పనిసరిగా వినియోగించుకోవాలని, అది భారత రాజ్యాంగం మనకు కల్పించిన గొప్ప హక్కని జిల్లా కలెక్టర్ రాజర్షి షా అన్నారు. శుక్రవారం స్థానిక తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాల నందు 16వ జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై జాతీయ ఓటర్ల దినోత్సవ ప్రత్యేక పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం విద్యార్థులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ.. ప్రజాస్వామ్యంలో ఓటు వజ్రాయుధం వంటిదని, అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు కావడంతో పాటు, ఎన్నికల సమయంలో తమ హక్కును వినియోగించుకోవాలని సూచించారు. ఃఃమై ఇండియా – మై ఓట్ఃః (My India - My Vote) అనే నినాదంతో ప్రతి ఒక్కరూ ముందుకు సాగాలని ఆయన పిలుపునిచ్చారు. ఓటు ప్రాముఖ్యతను ప్రతి ఒక్కరికీ తెలియజేయాలని, వంద శాతం పోలింగ్ జరిగేలా చూడటం మనందరి బాధ్యత అని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులు, ఉపాధ్యాయులు, సిబ్బంది చేత ఃఃప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకునేలా కృషి చేస్తాంఃః అని ప్రతిజ్ఞ చేయించారు.ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్, ఇన్‌చార్జి జిల్లా విద్యాశాఖ అధికారి రాజేశ్వర్, ప్రిన్సిపాల్ లలిత కుమారి, ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

# ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ పెండింగ్ కేసుల పరిష్కారానికి ప్రత్యేక దృష్టి సారించాలి:కలెక్టర్ రాజర్షి షా




**ప్రజాబలం ప్రతినిధి: జనవరి 23, 2026 ఆదిలాబాదు:** ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద నమోదైన కేసుల విచారణను వేగవంతం చేసి, బాధితులకు త్వరితగతిన న్యాయం, పరిహారం అందేలా చూడాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా అధికారులను ఆదేశించారు.శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో 'జిల్లా స్థాయి విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ' సమావేశాన్ని జిల్లా కలెక్టర్ అధ్యక్షత న నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో నమోదైన ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల పురోగతిని సమీక్షిస్తు, కేసులు నమోదైన వెంటనే దర్యాప్తు ప్రక్రియను వేగవంతం చేయాలని, సకాలంలో ఛార్జిషీట్లు దాఖలు చేయాలని పోలీసు అధికారులకు సూచించారు. అట్రాసిటీ కేసుల్లో బాధితులకు ప్రభుత్వం నుండి అందాల్సిన పరిహారాన్ని ఎటువంటి జాప్యం లేకుండా, వెంటనే వారి ఖాతాల్లో జమ అయ్యేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. బాధితులకు రక్షణ కల్పిస్తూ, వారికి భరోసా కల్పించడంలో అధికారులు బాధ్యతగా వ్యవహరించాలని పేర్కొన్నారు.జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ మాట్లాడుతూ.. పోలీసు శాఖ పరంగా అట్రాసిటీ కేసుల్లో తీసుకుంటున్న చర్యలను వివరించారు. కేసుల విచారణలో జాప్యం లేకుండా చూస్తున్నామని, బాధితులకు న్యాయం జరిగేలా కట్టుబడి ఉన్నామని తెలిపారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యులు నీలాదేవి, జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి సునీత కుమారి, ఈడి ఎస్సీ కార్పొరేషన్ మనోహర్, ఆర్డీఓ స్రవంతి, విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు, ఇతర శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# వేటుకు వేళాయెరా...

విజయవాడ, జనవరి 23, ఏపీ అసెంబ్లీలో ప్రతిపక్ష వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ హాజరుపై స్పీకర్, డిప్యూటీ స్పీకర్లు అనుసరిస్తున్న వ్యూహం రాష్ట్ర రాజకీయాల్లో కీలక మార్పులకు కారణం అయ్యే సూచనలు కనిపిస్తున్నాయి. సభకు హాజరుకాకుండా ప్రజాధనాన్ని జీతభత్యాల రూపంలో తీసుకోవడం నైతికంగా తప్పని ప్రభుత్వం భావిస్తోంది. ఈ క్రమంలోనే నో వర్క్ – నో పే అనే నినాదాన్ని స్పీకర్ గట్టిగా వినిపిస్తున్నారు. సభకు రాకుండానే హాజరు పట్టికలో సంతకాలు చేసినట్లు వస్తున్న ఆరోపణలపై ఎథిక్స్ కమిటీ విచారణ జరుపుతుండటం చూస్తుంటే, వైసీపీ ఎమ్మెల్యేలను ఇరుకున పెట్టడానికి ప్రభుత్వం పక్కా ప్రణాళికతో ఉన్నట్లు కనిపిస్తోంది.రాజ్యాంగ నిబంధనల ప్రకారం.. ఒక సభ్యుడు వరుసగా 60 పని దినాల పాటు సభాపతి అనుమతి లేకుండా సమావేశాలకు గైర్హాజరైతే, ఆ స్థానాన్ని ఖాళీగా ప్రకటించే అధికారం స్పీకర్‌కు ఉంటుంది. డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణరాజు పదేపదే ఈ '60 రోజుల నిబంధన'ను గుర్తు చేయడం వెనుక వ్యూహాత్మక ఆలోచన కనిపిస్తోంది. వచ్చే అసెంబ్లీ సమావేశాల నాటికి ఈ గడువు ముగిసే ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయడం ద్వారా, ప్రతిపక్షానికి కోలుకోలేని దెబ్బ తీయాలని కూటమి ప్రభుత్వం భావిస్తున్నట్లు రాజకీయ వర్గాల్లో చర్చ నడుస్తోంది.సాధారణంగా ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేస్తే ప్రజల్లో సానుభూతి వచ్చే అవకాశం ఉంటుంది. అయితే, ఇక్కడ ప్రభుత్వం ప్రజాధనం దుర్వినియోగం, రాజ్యాంగ ఉల్లంఘన అనే రెండు అంశాలను బలంగా ప్రజల్లోకి తీసుకెళ్తోంది. సభకు రాకుండా జీతాలు తీసుకోవడం ప్రజలను మోసం చేయడమేనని, ఓట్లేసిన ప్రజల సమస్యలను సభలో వినిపించకపోవడం రాజ్యాంగ ద్రోహమని ప్రచారం చేయడం ద్వారా ప్రజా వ్యతిరేకత రాకుండా జాగ్రత్త పడుతోంది. ప్రజల్లో ఈ అంశంపై చర్చ మొదలైతే, అనర్హత వేటును ప్రజలే సమర్థిస్తారనేది ప్రభుత్వ అంచనా. ఎథిక్స్ కమిటీ విచారణ ఈ ప్రక్రియలో అత్యంత కీలకంగా మారింది. కొందరు ఎమ్మెల్యేలు అసెంబ్లీకి రాకపోయినా, వారి పేరుతో సంతకాలు ఎలా జరిగాయనే అంశంపై ఫోరెన్సిక్ విచారణకు కూడా వెనుకాడబోమని ప్రభుత్వం సంకేతాలిస్తోంది. ఒకవేళ దొంగ సంతకాలు జరిగినట్లు నిరూపితమైతే, అది కేవలం అనర్హతకే పరిమితం కాకుండా క్రిమినల్ చర్యలకు కూడా దారి తీయవచ్చు. ఇది వైసీపీ ఎమ్మెల్యేలను నైతికంగా ఆత్మరక్షణలో పడేసే అవకాశం ఉంది.వైసీపీ కూడా ఈ పరిణామాలను గమనిస్తూనే ఉంది. ప్రభుత్వం వేటు వేసే వరకు వేచి చూడటం కంటే, వ్యూహాత్మకంగా రాజీనామాలు చేసి మళ్ళీ ప్రజా క్షేత్రంలోకి వెళ్లడం మేలని ఆ పార్టీలోని కొందరు నేతలు భావిస్తున్నారు. అయితే, అనర్హత వేటు పడితే దాన్ని కోర్టుల్లో సవాలు చేసే వెసులుబాటు ఉంటుంది కానీ, ప్రజల దృష్టిలో మాత్రం ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉంది. అందుకే ప్రభుత్వం చాలా తెలివిగా రాజ్యాంగబద్ధత అనే అస్త్రాన్ని ప్రయోగిస్తోంది. వచ్చే అసెంబ్లీ సమావేశాలు ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో ఒక కీలక మలుపు కానున్నాయి. స్పీకర్ కార్యాలయం నుండి వెలువడే నిర్ణయాలు రాష్ట్రంలో కొన్ని నియోజకవర్గాలకు ఉపఎన్నికలను అనివార్యం చేసేలా కనిపిస్తున్నాయి. ప్రజా సమస్యలపై పోరాడటానికి సభను వేదికగా చేసుకోని పక్షంలో, రాజ్యాంగం కల్పించిన అధికారాలను ఉపయోగించి గట్టి నిర్ణయాలు తీసుకోవడానికి ప్రభుత్వం

# మిర్చి మాములుగా వేడుగా ఎర్రబంగారమేనా...



గుంటూరు జనవరి 23, గుంటూరు మార్కెట్‌కు మొత్తం 61,000 బస్తాల కొత్త మిర్చి చేరింది. ఇందులో నాన్-ఏసీ 40,000 నుంచి 45,000 బస్తాలు, ఏసీ 15,000 నుంచి 16,000 బస్తాలు వచ్చినట్లు తెలుస్తోంది. మార్కెట్‌కు వచ్చిన సరుకులో, ముఖ్యంగా ఏసీ శాంపిల్స్‌లో తేజా రకాలు అధికంగా కనిపించాయి, ఇది ఆ రకాల ధరలపై ప్రభావం చూపింది.

రకాల వారీగా మిర్చి ధరల వివరాలు:

తేజా రకాలు: తేజా, షార్కు తేజా, రోమి 26 వంటి తేజా సెగ్మెంట్ రకాల ధరలలో గురువారం కాస్త స్లో అయినట్లు కనిపించింది. భారీగా సరుకు రావడం వల్ల ఈ రకాలపై ఒత్తిడి పడింది. కొత్త తేజా రకాలు గరిష్టంగా రూ. 19,000 పలికాయి. ఏసీ తేజా రకాలు రూ. 18,500 నుంచి రూ. 19,000 లోపు అమ్ముడయ్యాయి. షార్కు తేజా, రోమి రకాలు రూ.17,000 లోపే పలికాయి.

కర్నూల్ డీడీ, నాటు, సీడ్ రకాలు: తేజా రకాల మినహా, ఇతర రకాల మార్కెట్ స్థిరంగా, డిమాండ్‌తో కొనసాగింది. కర్నూల్ డీడీ 341 రకం గరిష్టంగా రూ. 25,000 పలికింది, కనిష్టంగా రూ16,000 క్వింటా అమ్ముడయ్యాయి. మధ్యస్థ రకాలకు రూ.16,000 నుండి రూ.20,000 వరకు ధరలు నమోదయ్యాయి. సీడ్ రకాలకు డిమాండ్ తగ్గకుండా, మార్కెట్ బాగానే ఉంది. నెంబర్ ఫైవ్ కొత్త మిర్చి రకాలు రూ.16,000 నుంచి రూ. 23,000 వరకు, నాణ్యతను బట్టి రూ.23,500 నుండి రూ.24,000 వరకు పలికాయి.

బ్యాడిగి రకాలు: 355 బ్యాడిగి కొత్త రకాలు రూ.16,000 నుంచి రూ.22,000 వరకు అమ్ముడయ్యాయి. సింజెంటా బ్యాడిగి కొత్త మిర్చి రకాలు రూ.15,000 నుంచి రూ.21,000 వరకు పలికాయి.

ఇతర ప్రధాన రకాలు: 2043 ఈ రకం మార్కెట్ బాగానే ఉంది. నాణ్యత ఉన్న మిర్చి లభ్యత తక్కువగా ఉండటంతో, మంచి నాణ్యతకు రూ.30,000 పైన, ఏసీ రకాలకు రూ.35,000 వరకు ధరలు నమోదయ్యాయి. సాధారణ క్వాలిటీ రూ.30,000 నుంచి రూ.32,000 వరకు పలికింది.

బంగారం: కొత్త మిర్చి రకాలు రూ.15,000 నుంచి రూ.20,000 వరకు అమ్ముడయ్యాయి. ఏసీ రకాలు రూ.19,500 నుంచి రూ20,000 వరకు పలికాయి.

బుల్లెట్: ఈ రకం కూడా బంగారం రకం వలె రూ.15,000 నుంచి రూ.20,000 వరకు పలికింది. ఏసీ రకాలు రూ.19,500 నుంచి రూ.20,000 వరకు అమ్ముడయ్యాయి.

273 కుబేరా: నాణ్యతను బట్టి రూ.20,000 నుంచి రూ.21,000 వరకు, ఒరిజినల్ నాణ్యత రూ.22,000 వరకు పలికింది. ఏసీ రకాలు రూ.20,000 నుంచి రూ.21,000 వరకు పలికాయి.

నాటు రకాలు: రూ.21,000 నుంచి రూ.22,000 వరకు అమ్ముడయ్యాయి. 334 రకం కూడా నాణ్యతను బట్టి రూ.22,000 వరకు పలికింది.

ఆర్మూర్: ఈ రకం రూ.17,000 నుండి రూ.17,500 వరకు అమ్ముడై, అమ్మకాలు బాగానే ఉన్నాయి. కొత్తవి రూ.17,500 వరకు పలికాయి, బుధవారం రూ.18,000 కూడా జరిగింది. ఏసీ రకాలు రూ.16,500 నుంచి రూ.17,500 వరకు పలికాయి.

క్లాసిక్: ఈ రకం రూ.17,000 పరిధిలో మార్కెట్ నడుస్తోంది.

108 వన్: కొత్తవి రూ.15,000 నుంచి రూ.16,000 నుంచి ప్రారంభమై, నాణ్యతను బట్టి రూ.23,000 వరకు, గరిష్టంగా రూ.23,500 వరకు పలికాయి.

నాందేడ్ సీడ్ రకాలు: రూ.15,000 నుంచి రూ.16,000 పరిధిలో ఉన్నాయి.

ఎల్లో మిర్చి:నాణ్యమైన డీలక్స్ రకాలు రూ.48,000 నుంచి రూ.49,000 వరకు అద్భుతంగా అమ్ముడయ్యాయి.

తాలు రకాలు: కొత్త తాలు, డీడీ తాలు, 341 తాలు, నెంబర్ ఫైవ్ తాలు వంటి రంగు తాలు రూ.15,000 వరకు పలికాయి. మెత్త తాలు రూ.10,000 నుంచి రూ.11,000 వరకు, మంచి రంగు తాలు రూ.13,000 నుండి రూ.15,000 వరకు పలికాయి. తేజా తాలు రంగు తాలు రూ.12,500 పరిధిలో అమ్ముడయ్యాయి. 334 తాలు రూ.10,000 పైన మంచి ధరలు పలికాయి. మొత్తం మీద, గుంటూరు మార్కెట్‌కు భారీగా సరుకు రావడంతో, ముఖ్యంగా తేజా రకాలపై కొంత ఒత్తిడి పెరిగి ధరలు మందగించాయి. అయితే, నాణ్యతను బట్టి ఇతర సీడ్, బ్యాడిగి, నాటు రకాలు స్థిరంగా మంచి ధరలు పలికాయి. మార్కెట్ నాణ్యతపై ఆధారపడి నడుస్తుందని అర్థమువుతుంది.అనేక మిర్చి వెరైటీలు ఇప్పటికే క్వింటాలుకు రూ.25,000 మార్కును దాటాయి. మిర్చి ధరల పెరుగుదలకు ప్రధాన కారణాలు సాగు విస్తీర్ణం గణనీయంగా పడిపోవడం. నల్లి, ఇతర తెగుళ్ల కారణంగా వేసిన పంట దిగుబడి కూడా ఆశాజనకంగా లేకపోవడమే. కొత్త పంట మార్కెట్‌లోకి వస్తున్నప్పటికీ, ధరలు నిరంతరం పెరుగుతున్నాయి, ఇది ప్రస్తుత ధోరణి కొనసాగుతుందని సూచిస్తుంది. చాలా వెరైటీలకు తదుపరి లక్ష్యం రూ.30,000 గా ఉంది. ఇప్పటికే పసుపు మిర్చి క్వింటాలుకు రూ.44,000 చేరుకుంది, ఇది రూ.70,000 కు వెళ్లినా ఆశ్చర్యపోనవసరం లేదని మార్కెట్ నిపుణులు చెబుతున్నారు. అయితే ఇది తక్కువ మంది రైతులు మాత్రమే సాగుచేస్తున్నారు. కోల్డ్ స్టోరేజీలలోని స్టాక్ సుమారు 20 రోజులలో ఖాళీ అయిపోయే అవకాశం ఉంది. వ్యాపారస్తులు సరుకు కోసం తీవ్రంగా పోటీపడుతున్నారు. రైతులు మంచి ధర వస్తుందని ఆశించి కోల్డ్ స్టోరేజీల నుంచి సరుకును బయటకు తీయడం లేదు. గత వారం రోజులుగా, అన్ని రకాల మిర్చి ధరలు ప్రతిరోజూ పెరుగుతూనే ఉన్నాయి. కోల్డ్ స్టోరేజీల నుంచి సరుకు బయటకు రావాలంటే ధరలు మరింత పెంచడం తప్ప వేరే మార్గం లేదు. మంచి క్వాలిటీ సరుకు అంతా కోల్డ్ స్టోరేజీలలోనే ఉంది. కొత్తగా వచ్చే పంట మొదటి కోతలు కాబట్టి, అంత నాణ్యత ఉండదు. రాబోయే రోజుల్లో చైనాకు ఎగుమతులు మరింత పెరిగే అవకాశం ఉంది, వ్యాపారస్తులు సుపీరియర్, డీలక్స్ క్వాలిటీల కోసం పోటీపడుతున్నారు. దీంతో ధర పెరిగే అవకాశాలే ఎక్కువ ఉన్నాయన్నది నిపుణులు అంచనా.

# పవన్ లో రెండో కోణం



విజయవాడ, జనవరి 23, తనను నమ్ముకున్న వారి కోసం పవన్ కళ్యాణ్ఎంత దాకైనా ముందుకు వెళ్తారు. అధికారంలో ఉన్నా.. లేకపోయినా.. ఆయన తీరు ఒకేలా ఉంటుంది. అయితే తాజాగా ఆయన పార్టీ కోసం పని చేసే వారిని గుర్తు పెట్టుకొని మరి కలుస్తున్నారు. డిప్యూటీ సీఎం గానే సాదాసీదాగా వెళ్తు కలుస్తున్నారు. మొన్నటికి మొన్న ఇప్పటం గ్రామంలో సరస్వతమ్మను కలిశారు. ఇప్పుడు తాజాగా కృష్ణాజిల్లాలోని కృత్తివెన్ను గ్రామానికి చెందిన పార్టీ కార్యకర్త చందు వీర వెంకట వసంత రాయులు కుటుంబాన్ని కలిశారు. వారి కష్టాలను తెలుసుకున్నారు. వారికి కొంత మొత్తంలో ఆర్థిక సాయం చేయడమే కాకుండా.. ప్రభుత్వం తరఫున కూడా భరోసా కల్పించారు. పవన్ చర్యలు ఇప్పుడు ఆకట్టుకుంటున్నాయి. సొంత పార్టీ శ్రేణులు గుర్తించుకుంటున్నాయి.జనసేన ప్రతిపక్షంలో ఉన్నప్పుడు పార్టీ ప్లీనరీ నిర్వహించుకునేందుకు వైయస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం అడ్డు తగిలింది. వారికి సరైన వేదిక కూడా దొరకనివ్వలేదు. ఈ క్రమంలో ఇప్పటం గ్రామస్తులు ముందుకు వచ్చి ప్లీనరీ నిర్వహణకు అవసరమైన భూమిని అందించారు. అక్కడ ప్లీనరీ సక్సెస్ అయ్యింది. దానిని మనసులో పెట్టుకొని రోడ్డు విస్తరణ పేరుతో ఇప్పటం గ్రామస్తులను అప్పటి వైసిపి ప్రభుత్వం ఇబ్బంది పెట్టింది. ఆ సమయంలో గ్రామస్తులను పరామర్శించారు పవన్. ఈ క్రమంలో గ్రామానికి చెందిన సరస్వతమ్మ అధికారంలోకి వస్తే పవన్ కళ్యాణ్ ను కలవాలని కోరింది. ఆమె కోరిక మేరకు ఇటీవల పవన్ కళ్యాణ్ ఆ గ్రామానికి వెళ్లారు. సరస్వతమ్మను కలిశారు.తాజాగా కృతివెన్ను గ్రామానికి వెళ్లారు పవన్ కళ్యాణ్. చందు వీర వెంకట వసంత రాజులు అనే వ్యక్తి జనసేన లో చాలా యాక్టివ్ గా ఉండేవారు. జనసేన అధికారంలోకి రావాలని పూజలు కూడా చేసేవారు. అప్పట్లో ఫేమస్ అయ్యారు కూడా. అయితే ఇటీవల ఆయన రోడ్డు ప్రమాదంలో చనిపోయారు. జనసేన సభ్యత్వం ఉండడంతో బీమాకు సంబంధించిన పరిహారం దక్కింది. అయితే ఆయనలో అభ్యుదయ భావాలు అధికం. ఆయన చనిపోయినప్పటికీ కుటుంబ సభ్యులు అవయవ దానానికి ముందుకు వచ్చారు. రాయులు ఆరుగురికి అవయవ దానం చేశారు. ఈ విషయం తెలుసుకున్న పవన్ కళ్యాణ్ తానే స్వయంగా ఆ కుటుంబాన్ని పరామర్శిస్తానని చెప్పారు. తన పర్యటనను గోప్యంగా ఉంచారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ప్రభుత్వం తరఫున సాయం కూడా చేశారు. ఇంట్లో ఒకరికి ఉద్యోగం ఇస్తానని కూడా హామీ ఇచ్చారు. అయితే గోప్యంగా ఉంచినా వేలాదిమంది అభిమానులు తరలివచ్చారు. అయితే పవన్ చర్యలు సామాన్యులను సైతం ఆకట్టుకుంటున్నాయి.

# రోడ్డు ప్రమాదాల నివారణపై ప్రత్యేక చర్యలు

## జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్




జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణపై ప్రత్యేక చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శుక్రవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో డి.సి.పి.ఎ.భాస్కర్,బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్ లతో కలిసి పోలీస్, రవాణా,జాతీయ రహదారులు, రోడ్లు భవనాలు,ఆర్.టి.సి., విద్యుత్, పంచాయతీ రాజ్ శాఖల అధికారులు,మున్సిపల్ కమిషనర్లు,సంబంధిత అధికారులతో రోడ్డు ప్రమాదాల నివారణపై రోడ్డు భద్రత కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ...జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణ చర్యలు పటిష్టంగా అమలు చేయాలని తెలిపారు.మున్సిపల్ పరిధిలోని రోడ్లపై చెత్త,ఆటంకాలను వెంటనే తొలగించాలని,ట్రాఫిక్ పోలీసు విభాగం రోడ్లపై అనధికార వాహన నిలుపుదల,నిబంధనల ఉల్లంఘన పట్ల కఠిన చర్యలు తీసుకోవాలని తెలిపారు. రోడ్లపై తక్కువ ఎత్తు గల బీమ్‌లు,తక్కువ విజిబిలిటీ ఉన్న చోట్ల లైటింగ్ ఏర్పాటు చేయాలని, జాతీయ రహదారులపై రంబుల్ స్ట్రిప్స్,లైటింగ్,జాగ్రత్త సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని తెలిపారు. రోడ్లపై అదుపు తప్పిన,ఓవర్ లోడెడ్ వాహనాలు,పరిమితికి మించి వేగంగా వెళ్లే వాహనాలపై చర్యలు తీసుకోవాలని,ట్రాఫిక్ పోలీసు అధికారులు ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ తప్పనిసరి చేయడంలో కఠిన చర్యలు తీసుకోవాలని తెలిపారు. మున్సిపల్ కమిషనర్లు తమ పరిధిలో రోడ్డు భద్రతకు అవసరమైన చర్యలు చేపట్టాలని,గ్రామీణ ప్రాంతాలలో అంతర్గత రహదారులలో తగిన జాగ్రత్తలు తీసుకోవడం జరుగుతుందని,రహదారులపై కేజ్ వీల్స్, ట్రాక్టర్ కేజ్ వీల్స్ వినియోగాన్ని నిలిపివేసేందుకు అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని, జిల్లా వ్యాప్తంగా వేగ పరిమితి బోర్డులు, హెచ్చరిక బోర్డులు, జాగ్రత్త సూచికలు ఏర్పాటు చేయాలని తెలిపారు. కూరగాయల వ్యాపారులు రహదారులపై విక్రయాలు చేయకుండా ప్రత్యేక మార్కెట్ స్థలాన్ని గుర్తించి తగు ఏర్పాట్లు చేయాలని మున్సిపల్ కమిషనర్లను ఆదేశించారు. రహదారులపై వాహనాల వేగాని నియంత్రించేందుకు ఏర్పాట్లు చేయాలని,ప్రతి మండల, గ్రామాల పరిధిలో రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు.డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులలో పట్టుబడిన వారి లైసెన్సులు రద్దు చేయాలని, వారి వివరాలు,పరిమితికి మించి లోడింగ్ చేసి తనిఖీలలో పట్టుబడిన వాహనాల వివరాలను మీడియా ద్వారా ప్రజలకు తెలియజేయాలని తెలిపారు. రహదారులపై సంచరించే పశువులను ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన గోశాలకు తరలించాలని తెలిపారు.అంతర్గత రహదారులలో కల్వర్టుల దగ్గర సూచికలు ఏర్పాటు చేయాలని, గ్రామపంచాయతీలు, మున్సిపాలిటీలలో కుక్కల బెడదను నివారించడానికి తగిన చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఓవర్ లోడింగ్, మితిమీరిన వేగం, డ్రంక్ అండ్ డ్రైవింగ్,రాంగ్ సైడ్ డ్రైవింగ్ లపై ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటుఎ నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని తెలిపారు.డి.సి.పి. మాట్లాడుతూ... నూతన సంవత్సరంలో రోడ్డు ప్రమాదాల నివారణను 20 శాతం మేర తగ్గించేలా లక్ష్యంగా నిర్దేశించడం జరిగిందని,జిల్లాలో 30 హాట్ స్పాట్ లను గుర్తించడం జరిగిందని,నగర పరిధిలో వాహనాల వేగ నియంత్రణ చర్యలు తీసుకోవలసిన అవసరం ఉందని తెలిపారు. రహదారి ప్రమాదాలు, మరణాలు తగ్గించేలా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# నర్సాపూర్ పెద్ద తాండ పావని కి నాగాలాండ్ లోనేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ లో సీటు




**వికారాబాద్ నియోజకవర్గ ప్రతినిధి జనవరి 23 (ప్రజాబలం) వికారాబాద్ జిల్లా:** మర్పల్లి మండలం నర్సాపూర్ పెదతాండ ఆంగోత్,పావని ,తండ్రి హరి చందర్ వాళ్ల అమ్మాయికి నాగాలాండ్ లో నేషనల్ ఆఫ్ టెక్నాలజీ ఇన్స్టిట్యూట్ లో స్వీట్ రావడం పట్ల తల్లిదండ్రులు గ్రామ ప్రజలు మండల అధికారులు పావని పై చదువుల పట్ల సంతోషం వ్యక్తపరిచారు పావని పై చదువులను ప్రశంసించి జనరల్ చీఫ్ సెక్రటరీ మరియు మేడం పావని కి లాప్టాప్ బహుమానంగా ఇచ్చి మంచి విద్యను అభ్యసించి పై చదువులకు వెళ్లాలని మా వంతు కృషి విద్యార్థుల పైన ఎల్లవేళలా ఉంటుందని ప్రొఫెసర్ హర్షం వ్యక్తం చేశారు మర్పల్లి మండల నాయకులు పెద్దలు పావని పై చదువులకు వెళ్లడం పట్ల సంతోషం వ్యక్తపరిచారు

# చైతన్యవంతమైన ప్రజాస్వామ్యం కోసం ఓటు హక్కు:జిల్లా కలెక్టర్ మను చౌదరి



**మేడ్చల్ - మల్కాజ్గిరి జిల్లా ప్రతినిధి ప్రజాబలం జనవరి -23:** ఓటర్లను ఎన్నికల ప్రక్రియలో పాల్గొనేలా ప్రోత్సహించేందుకు ప్రతి సంవత్సరం జనవరి 25న జరుపుకునే ఓటర్ దినోత్సవం సందర్భంగా మేడ్చల్ - మల్కాజ్గిరి జిల్లా కలెక్టరేట్ ప్రాంగణం లో జరిగిన కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ (లోకల్ బాడీస్) రాధిక గుప్తా, అడిషనల్ కలెక్టర్ విజయేందర్ రెడ్డి తో కలిసి జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఓటు హక్కు ప్రాధాన్యత గురించి కలెక్టర్ వివరించారు, సిబ్బందిచే ఓటర్ల ప్రతిజ్ఞ చేయించారు. 16వ జాతీయ ఓటర్ దినోత్సవం సందర్భంగా గురువారం రోజు జరిగిన ముగ్గుల పోటీ, క్యారమ్స్, చెస్, టగ్ అఫ్ వార్ ఈవెంట్స్ లో విజేతలుగా నిలిచిన సిబ్బందికి కలెక్టర్ బహుమతులు అందజేశారు. కార్యక్రమాశీనతరం జిల్లా అధికారులు, సిబ్బంది తదితరులు కలిసి My India-My Vote అంటూ ర్యాలీ నిర్వహించి ఓటు వినియోగం ప్రాధాన్యత పై ప్రజలో అవగాహన కల్పించడం జరిగింది.

# మద్యపానం నిషేధంపై గ్రామసభలో తీర్మానశీ

## గ్రామ సర్పంచి సునీత రెడ్డి




**ఆందోల్ నియోజకవర్గం ప్రతినిధి జనవరి 23 (ప్రజాబలం )సంగారెడ్డి జిల్లా :** చౌటకూర్ మండలం కోర్పోల్ గ్రామంలో, మద్యపానం నిషేధం పై గ్రామ సభలో రచ్చ, గ్రామ సర్పంచ్ సునీత రెడ్డి, మద్యపానం నిషేధం పై గ్రామ సభలో తీర్మానం, బెల్ట్ షాపులు అలా ఎలా బంద్ చేస్తారని, మద్యపాన తీర్మానానికి అడ్డు తగిలిన మందుబాబులు, గ్రామంలో మద్యం సేవించి, కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని, మద్యపానం నిషేధించాలని, సర్పంచ్ ను గ్రామసభలో కోరిన మహిళలు, గ్రామస్తుల వాగ్వాదంలోనే, బెల్ట్ షాపులు బంద్ చేయాలని తీర్మానం ఆమోదం చేసిన సర్పంచ్, పంచాయతీ తీర్మానంతో నేటి నుండి కోర్పోల్లో కొనసాగుతున్న మద్యపాన నిషేధం.....

# పిల్లల అక్రమ దత్తత కేసులో నిందితుల అరెస్ట్




**ప్రజాబలం మంచిర్యాల జిల్లా ప్రతినిధి జనవరి 23 :** మంచిర్యాల జిల్లాలోని లక్షెట్టిపేట మున్సిపల్ పరిధిలోని మొదేలలో ఒక చిన్నారిని అక్రమంగా దత్తత తీసుకున్నారనే సమాచారంపై చైల్డ్ హెల్ప్ లైన్ అధికారులు ఫిర్యాదు చేయగా,దాని ఆధారంగా జతీ.చీశీ. 317/2025, సెక్షన్ 80-జువెనైల్ జస్టిస్ (కేర్ అండ్ ప్రొటెక్షన్ ఆఫ్ చిల్డ్రన్) యాక్ట్ కింద కేసు నమోదు చేసి, మొదేల్ గ్రామానికి చెందిన దత్తత తీసుకున్న తల్లిదండ్రులు ఎలుగటి తిరుపతి మరియు ఎలుగటి కళావతిలపై విచారణ ప్రారంభించడమైంది.విచారణలో భాగంగా అక్రమంగా దత్తత తీసుకున్న మూడేళ్ల బాలికను చైల్డ్ వెల్ఫేర్ అధికారులు రక్షించి, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ, ఆదిలాబాద్ ఎదుట హాజరుపరచడం జరిగింది.తదుపరి విచారణలో,నా1-పరిగిపండ్ల విజయలక్ష్మి,భర్త: వెంకటేశ్వర్లు,వయస్సు: 47 సంవత్సరాలు,కులం:పద్మశాలి, వృత్తి: టైలరింగ్, నివాసం:ఇంటి నెం.7-313,తీగల్ పహాడ్, అల్లూరి సీతారామరాజు కాలనీ, మంచిర్యాల, మరియునా2-బొజ్జ స్వరూప,భర్త: శ్రీనివాస్, వయస్సు: 41 సంవత్సరాలు, కులం: పద్మశాలి,వృత్తి: లక్ష్మి నారాయణ ఆస్పత్రి వర్కర్, నివాసం: ఇంటి నెం. 2-04, మహాలక్ష్మివాడ,లక్షెట్టిపేట, ప్రస్తుతం నివాసం: సూరారం గ్రామం,లక్షెట్టిపేట మండలంఅనే వారు పిల్లలు లేని దంపతులను ఆసరాగా తీసుకొని, వారి వద్ద భారీ మొత్తంలో డబ్బులు వసూలు చేసి, ఎలాంటి చట్టబద్ధమైన దత్తత నిబంధనలు పాటించకుండా పిల్లలను అక్రమంగా దత్తతకు ఇచ్చినట్లు గుర్తించడం జరిగింది.పైన పేర్కొన్న నిందితులను ఈరోజు అరెస్ట్ చేసి, న్యాయస్థానం ఎదుట హాజరుపరిచి రిమాండ్‌కు తరలించనున్నారు.ఇంకా ఇద్దరు నిందితులు పరారీలో ఉండగా, వారిని పట్టుకునేందుకు గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి. తదుపరి విచారణ కొనసాగుతుంది.ఇట్టి కేసులో నిందితులను పట్టుకోవడంలో చాక చక్యంగా వ్యవహరించిన సిబ్బంది శ్రీకాంత్, మల్లేష్,బగ్గని సత్యనారాయణ,ఎంబడి సత్యనారాయణ,మురళి,ప్రవళిక లను అభినందించడం జరిగింది.హెచ్చరిఅక్రమంగా పిల్లలను దత్తత తీసుకున్నా,ఇచ్చినా, రవాణా చేసినా లేదా తరలించినా సంబంధిత వ్యక్తులపై కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని సర్కిల్ ఇన్స్పెక్టర్ డి రమణ మూర్తి,లక్షెట్టిపెట సబ్-ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ గొపతి సురేష్ తెలిపారు.

# కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించండి లక్షెట్టిపేటను అభివృద్ధి చేస్తాం

### మాజీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ చల్ల నాగభూషణం

### రూ. 15 కోట్ల నిధులతో పలు అభివృద్ధి పనులు ప్రారంభం

**ప్రజాబలం మంచిర్యాల జిల్లా ప్రతినిధి జనవరి 23 :** లక్షెట్టిపేట రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలని,తద్వారా లక్షెట్టిపేట పట్టణం అభివృద్ధి చెందుతుందని మాజీ మున్సిపల్



ఫ్లోర్ లీడర్ చల్ల నాగభూషణం పేర్కొన్నారు. శుక్రవారం రాత్రి పలు అభివృద్ధి పనులను స్థానిక నాయకులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ...అన్ని వార్డుల్లో కాంగ్రెస్ పార్టీ గెలిస్తే ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు సహకారంతో పట్టణాన్ని మరింత అభివృద్ధి చేస్తామన్నారు. వివిధ కార్యక్రమంలో సురేష్ రాందేని వెంకటేష్,పెద్ద వెంకటేష్, రాందేని తిరుపతి,లచ్చన్న, వద్దేపల్లి తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

# బాసర ఆలయంలో వసంత పంచమి మహోత్సవాలు

నిర్మల్ బాసర శ్రీ జ్ఞాన సరస్వతి అమ్మవారి పుట్టినరోజు వసంత పంచమి మహోత్సవాలు అంగరంగ వైభవంగా కొనసాగుతున్నాయి. వేద పండితులు అర్చకులు అమ్మవారికి విశేష చతుష్షష్టి పూజలు నిర్వహించారు. మూడు గంటల నుండి చిన్నారులకు అక్షర శ్రీకర పూజలను ప్రారంభించారు. క్యూలైన్లలో భారీగా భక్తులు అక్షరాభ్యాసం దర్శనం కోసం తమ పిల్లలతో వేచి ఉన్నారు. భక్తుల రద్దీని అనుసరించి పోలీసు రెవెన్యూ శాఖ వారు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. వేయి రూపాయల అక్షర శ్రీకారం కొరకు మూడు మండపాలను ఏర్పాటు చేశారు. అమ్మవారి దర్శనానికి సుమారుగా నాలుగు గంటల సమయం పడింది

# మల్లన్న స్వామి కళ్యాణ మహోత్సవమునకు పట్లొల్ల కార్తీక్ రెడ్డికి ఆహ్వానం





**రాజేంద్రనగర్ నియోజకవర్గ ప్రజాబలం ప్రతినిధి** 23 జనవరి 202625 జనవరి 2026 ఆదివారం రోజున మద్యాన్నాము పుప్పాలగూడ మల్లన్న స్వామి కళ్యాణ మ త్సవమునకు భారత రాష్ట్ర సమితి పార్టీ యువనాయకుడు, రాజేంద్రనగర్ నియోజకవర్గ పార్టీ ఇంచార్జి పట్లొల్ల కార్తీక్ రెడ్డినీ సాదరముగా సగౌరవముగా ఆహ్వానించడం జరిగిన సందర్భముగా భారత రాష్ట్ర సమితి పార్టీ స్థానిక వర్కింగ్ ప్రెసిడెంట్ కుంబగళ్ళ ధనరాజ్, ముఖ్య కార్యదర్శి గుట్టమీది నరేందర్, మహిళా అధ్యక్షురాలు రూపా రెడ్డి, ఉపాధ్యక్షుడు అందె లక్ష్మణ్ రావు, సోషియల్ మీడియా కార్యదర్శి సుమనళిని, సీనియర్ నాయకులు మహేందర్, రవి, సంధ్య తది తరులు.

# సుభాష్ చంద్రబోస్ 129 వ జయంతి ఉత్సవంలో పాల్గొన్న...ప్రేమ కుమార్



**కూకట్పల్లి (ప్రజాబలం) జనవరి 23:**మూసాపేట్ లోని జిహెచ్ఎంసి ఆఫీస్ దగ్గర నేతాజీ సుభాష్ చంద్రబోస్ విగ్రహం వద్ద నిర్వహించిన 129వ జయంతి ఉత్సవాలకి సుభాష్ చంద్రబోస్ అసోసియేషన్ అధ్యక్షుడు యాదగిరి ఆహ్వానం మేరకు ముఖ్య అతిథిగా కూకట్‌పల్లి నియోజకవర్గ జనసేన పార్టీ కంటెస్టెడ్ ఎమ్మెల్యే అభ్యర్థి ముమ్మారెడ్డి ప్రేమ కుమార్ పాల్గోని నేతాజీ సుభాష్ చంద్రబోస్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళు అర్పించారు. ఈ సందర్భంగా ప్రేమ కుమార్ మాట్లాడుతూ,నేతాజీ సుభాష్ చంద్రబోస్ దేశభక్తి, స్వాతంత్ర్య పోరాటంలో ఆయన చేసిన త్యాగం,నాయకత్వం భారతదేశానికి ఎప్పటికీ స్ఫూర్తిదాయకం.నాకు రక్తం ఇవ్వండి, నేను మీకు స్వాతంత్ర్యాన్ని ఇస్తాను" అన్న ఆయన నినాదం భారత దేశ ఉద్యశీమ చరిత్రలో చిరస్థాయిగా నిల్చింది అని అన్నారు.ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు కొల్లా శంకర్, వేముల మహేష్ , పోలేబోయిన శ్రీనివాస్, బిజెపి నాయకులు శైలేష్, వినోద్, శ్రీనివాస్, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

# చదువుల తల్లిని కొనలేని పరిస్థితి









**.రాజేంద్రనగర్ నియోజకవర్గ ప్రజాబలం ప్రతినిధి 23 జనవరి 2026.**మీ సమస్య - మా బాధ్యత, ప్రజలతో - ప్రజలకోసం కార్యక్రమాన్ని బి.ఆర్.ఎస్ పార్టీ నాయకులు తలపెట్టడంలో భాగంగా పైప్ లైన్ రోడ్డు బి.ఆర్.సి నుండి సాయి గౌతమ్ కాలనీ వరకు పర్యటించడం జరిగినది. పిల్లల చదువును కొనడానికి స్కూల్ ఫీజులు భారంగా మారడంతో చిన్నా చితకా, మధ్య తరగతికి చెందిన సామాన్య ప్రజానీకం పిల్లలకు చదువు చెప్పించ లేని దీన పరిస్థితుల్లో ఉన్నామని, పేదల బ్రతుకులు దినావస్తలోనే సాగు తున్నదని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే స్కూల్ ఫీజులపై కట్టడి చేస్తూ తగు చర్యలు చేపడత్తామని కల్లబొల్లి మాటలు చెప్పి తమను నిండుగా మోసగించి నారని వాపోయారు. ఆటో డ్రైవర్ల జీవన పరిస్థితులు చూస్తే వర్ణనాతీతంగా చాలీ చాలని ఆదాయంతో కుటుంబాన్ని పోషించడం, ఆటోల ఫైనాన్స్ కి ఇ.ఎం.ఐ లు కట్టడం కూడా చాలా కష్టంగా మారిందని మొర పెట్టుకొన్నారు. ఇకపోతే వాన రాకడ కరెంట్ పోకడ తెలియని పరిస్థితి నెలకొందని తమ వ్యధను వెళ్లబోసుకున్నారు. కార్యక్రమంలో స్థానిక వర్కింగ్ ప్రెసిడెంట్ కుంబగళ్ళ ధనరాజ్, ప్రధాన కార్యదర్శి గుట్టమీది నరేందర్, ఉపాధ్యక్షుడు అందె లక్ష్మణ్ రావు, సోషియల్ మీడియా కార్యదర్శి సుమనళిని, మైనారిటీ సీనియర్ నాయకుడు షేక్ ఆరిఫ్ తది తరులు పాల్గొన్నారు.

# ప్రమాదపు అంచున భారీ వృక్షం: భయాందోళనలో స్థానికులు



**రాజన్న సిరిసిల్ల జిల్లా, జనవరి 23( ప్రజాబలం ప్రతినిధి)**సిరిసిల్ల పట్టణం నెహ్రూనగర్ లో ప్రధాన రహదారి పక్కన ఉన్న ఒక భారీ వృక్షం ఎప్పుడు విరిగి పడుతుందో తెలియని స్థితిలో ఉండటం స్థానికులను తీవ్ర భయాందోళనకు గురిచేస్తోంది.వివరాల్లోకి వెళ్తే గత కొంతకాలంగా ఈ చెట్టు ఒక వైపునకు ప్రమాదకరంగా ఒరిగిపోయింది. ముఖ్యంగా చెట్టు మొదలు భాగం పూర్తిగా దెబ్బతిని, చీలికలు రావడంతో అది ఏ క్షణమైనా కూలిపోయే అవకాశం ఉంది. చెట్టు సమీపంలో గవర్నమెంట్ బడి ఉండడంతో, ఈ చెట్టు కిందనే నిత్యం, బడి పిల్లలు, ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు, వాహనాలు పార్క్ చేసి ఉంటాయి. పక్కనే నివాస గృహాలు కూడా ఉండటంతో, చెట్టు గానీ కూలితే పెద్ద ప్రమాదం జరిగే అవకాశం ఉందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ముఖ్యంగా రాత్రి సమయాల్లో , గాలివాన వచ్చినప్పుడు విరిగిపోయినట్లు శబ్దం రావడంతో ఈ దారి గుండా వెళ్లాలంటేనే ప్రజలు వణికిపోతున్నారు.

ఇప్పటికే పలుమార్లు సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేదని స్థానికులు పేర్కొంటున్నారు. ఏదైనా అనర్థం జరగకముందే మున్సిపల్ , విద్యుత్ శాఖ అధికారులు స్పందించి, ఈ ప్రమాదకరమైన చెట్టును తొలగించాలని లేదా సురక్షితంగా కొమ్మలను నరికివేయాలనిః స్థానిక ప్రజలు కోరుతున్నారు. అధికారుల నిర్లక్ష్యం వల్ల ప్రాణ, ఆస్తి నష్టం సంభవిస్తే ఎవరు బాధ్యత వహిస్తారని వారు ప్రశ్నిస్తున్నారు?

# లిటిల్ స్టార్ పాఠశాలలో ఘనంగా వసంత పంచమి వేడుకలు







**ప్రజాబలం మంచిర్యాల జిల్లా ప్రతినిధి జనవరి 23** : వసంత పంచమి మరియు శ్రీ పంచమి సందర్భంగా లక్షెట్టిపేట లోని లిటిల్ స్టార్ పాఠశాలలో వేడుకలు ఘనంగా నిర్వహించారు.శుక్రవారం ముందుగా సరస్వతీ దేవి పూజ చేసారు.సరస్వతీ మం చేసిన తర్వాత చిన్నారులకు అక్షరాభ్యాస కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ సంతపురి కిషోర్ కుమార్ మాట్లాడుతూ...మాఘ మాస శుక్ల పక్ష పంచమి తిథిన జరుపుకునే వసంత పంచమి రోజున ప్రకృతి అంతా నూతన ఉత్సాహంతో కళకళలాడుతుంది.ఇదే రోజున సరస్వతి దేవి అవతరించిందని పురాణాలు పేర్కొంటున్నాయి.అందుకే ఈ పర్వదినాన్ని విద్యారంభానికి శ్రేష్ఠమైన దినంగా భావిస్తారు.ఈ రోజున సర్వస్వతీ అమ్మవారి ఆలయాల్లోనే కాకుండా నివాసాలు,విద్యాలయాల్లోనూ చదువుల తల్లికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు.వసంత పంచమి రోజున చేసే కార్యాలకు పంచాంగ దోషాలు ఉండవని శాస్త్రలు చెబుతున్నాయి.పిల్లలు చదువులో రాణించేందుకు ఈరోజు అక్షరాభ్యాసం చేయిస్తారు.సంగీత,కళా శిక్షణ ప్రారంభం చేయడం వల్ల చిన్నారులకు జ్ఞానం, బుద్ధి, వాక్చాతుర్యం లభిస్తాయని నమ్మకం. చాలా విద్యాలయాల్లో సరస్వతీ పూజలు చేయడంతోపాటు తమ పిల్లలకు అక్షరాభ్యాసం చేయించి.. పెన్నులు, పలకలు, పుస్తకాలు పంచిపెడతారు.ఈ రోజు ఈ విధంగా చేస్తే అమ్మవారి అనుగ్రహం కలుగుతుందని నమ్మకం.పిల్లలకు చిన్నతనం నుండి మన సంస్కృతి సాంప్రదాయాలు నేర్పించడం వల్ల పిల్లలు మంచి పౌరులుగా తయారవుతారని ఉద్దేశంతో మా పాఠశాలలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించాము.ఈ కార్యక్రమంలో పాలుపంచుకున్న ప్రతి ఒక్కరికి ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నామని అన్నాడు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్లు మహమ్మద్ హమీద్,మినుముల శ్రీనివాస్ ఉపాధ్యాయులు మరియు పోషకులు పాల్గొన్నారు.

# అకోలా - నాందేడ్ హైవేపై డీసీఎం వ్యాన్ బోల్తా



**అందోల్ నియోజకవర్గం ప్రతినిధి జనవరి 23 (ప్రజాబలం) సంగారెడ్డి జిల్లా:** చౌటకూర్ మండల పరిధిలోని, సుల్తాన్పూర్ జాతీయ రహదారి 161,,పై గురువారం రాత్రి డీసీఎం వ్యాన్ అదుపుతప్పి బోల్తా పడింది, హైదరాబాద్ నుంచి కామారెడ్డి జిల్లా, పిట్లం కు వెళ్తున్న ట్రాన్స్ పోర్ట్ డీసీఎం వ్యాన్, అదుపుతప్పి పల్టీ కొట్టింది, డీసీఎం వ్యాన్ లోని వస్తువులు, రోడ్డుపైన చెల్లాచెదరంగా పడిపోవడంతో, రోడ్డుపై ట్రాఫిక్ జామ్ అయి కిలోమీటర్ల వరకు వాహనాలు నిలిచిపోయాయి

# ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి భూమి పూజ

## - ఇల్లు లేని ప్రతి లబ్ధిదారునికి ఇల్లు ఇస్తాం
## - పదో వార్డు మాజీ కౌన్సిలర్ పట్లోళ్ల రేఖ - ప్రవీణ్ కుమార్





**ఆందోల్ నియోజకవర్గం ప్రతినిధి జనవరి 23 (ప్రజాబలం )సంగారెడ్డి జిల్లా:**ఆందోల్- జోగిపేట మున్సిపల్ పరిధిలోని 10,వ వార్డులో నూతన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి 20,వ వార్డు మాజీ కౌన్సిలర్ పట్లోళ్ల రేఖ- ప్రవీణ్ కుమార్, గురువారం భూమి పూజ చేయడం జరిగింది ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, 10వ, వార్డుకు నూతనంగా 12, ఇందిరమ్మ ఇండ్లు మంజూరు అయ్యాయని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకంలో మంజూరైన లబ్ధిదారులు సకాలంలో ఇల్లు పూర్తి చేసుకొని, ప్రభుత్వం అందిస్తున్న 5, లక్షల రూపాయల ఆర్థిక సాయం పొందాలని తెలిపారు. ఇల్లు లేని ప్రతి కుటుంబానికి కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తుందని, తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణ సీనియర్ నాయకులు గుర్రపు కృష్ణ, రాజు, రామ్ చందర్ , వినయ్,మున్సిపల్ అధికారులు, మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

# 1960 దశబ్దం లో హైదరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్ కి మొదటి లేడీ మేయర్..



**కూకట్పల్లి (ప్రజాబలం) జనవరి 23:**విద్యావేత్త, సంఘ సంస్కర్త, నిస్వార్ధ రాజకీయవేత్త, బహుముఖ ప్రజ్ఞశాలి, అట్టడిగిన వర్గాలకి, కుష్టు వ్యాధిగ్రస్తుల అశా దీపం, వారిని అక్కున చేర్చుని ఆశ్రయం కల్పించిన అపర ధన్వంత్రి, సమాజం లో వెలివేయబడిన కుష్టు వ్యాధి గ్రాస్తులకు శివనంద రెహబిలిటేషన్ మ్ స్థాపించిన, సమాశీజ లోని అన్నివర్గాలవారికి అతి తక్కువ ధరలలో వైద్యాన్ని అందిస్తున్న రాందేవ్ రావు హాస్పిటల్ వ్యవస్థాపకురాలు, వడ్డేపల్లి సంస్థానానికి చెందిన ఆడపడుచు, వనపర్తి సంస్థానానికి చెందిన కోడలు ఐనటువంటి రాణి కుముదిని దేవి జన్మదినన్ని పురస్కరించుకొని శివనంద రెహబిలిటేషన్ మ్,రాందేవ్రావు హాస్పిటల్ మరియు కుముదిని దేవి స్కూల్ అండ్ కాలేజ్ అఫ్ నర్సింగ్ లో వివిధ కార్యక్రమాలు జరిపించారు, దీని లో మొదటగా రాందేవ్రావు హాస్పిటల్ లో రాణి కుముదిని దేవి గ చిత్ర పటానికి రాందేవ్ రావు హాస్పిటల్ ఎండి డాక్టర్ కమలాకర్ పూల మాల వేసారు, ఈ కార్యక్రమం లో డాక్టర్స్, నర్సెస్, అడ్మినిస్ట్రేషన్ మరియు ఇతర ఆసుపత్రి సిబ్బంది పాల్గొని మేడం చేసిన కార్యక్రమాలు కొనియాడారు. శివనంద రెహబిలిటేషన్ మ్ లో మేడం యొక్క విగ్రహానికి శ్రీరంతిదేవ్ రావు, మీరా రావు, విక్రందేవ్ రావు, జ్యోతి రావు , విజయలక్ష్మి, పృథ్వీరెడ్డి , భారతి రెడ్డి,విష్ణువర్ధన్ రెడ్డి,అపర్ణ రావు, ప్రశాంత్ రెడ్డి , శివానంద రిహబిలిటేషన్ మ్ సీఈఓ డాక్టర్ అనంత్ రెడ్డి పూల మాలతో మేడం విగ్రహాన్ని అలంకరించారు.జస్టిస్ జగన్నాద్ రెడ్డి సతీమణి గారైనటుశీవటి పరిమళ జగన్మోహన్ రెడ్డి పేరు మీద ఉచిత శివనంద ఫిజియో రిహబ్ సెంటర్ ప్రదీప్ చౌదరి ప్రారంభించారు. పరిమళ జగన్ మోహన్ రెడ్డి చిత్రపటాన్ని జయరాం పింగళి, ఊర్మిళ పింగళి, గౌతమ్ పింగళి, సురేఖ పింగళి, విద్యాసాగర్ రావు, దీపిక ఆవిష్కరించారు. తర్వాత రాణి కుముదిని దేవి స్కూల్ అండ్ కాలేజీ అఫ్ నర్సింగ్ లో కొత్తగా ప్రవేశించిన బిఎస్సి, జి ఎన్ ఎం విద్యార్థిని విద్యార్థులకు లాంప్ లైటింగ్ చేరేమోనీ ప్రారంభించారు. ఫ్లోరెన్స్ నైటింగేల్ ప్రతిజ్ఞ ను మేరీ డేవిడ్ కాలేజీ ప్రిన్సిపాల్ అర్చన విద్యార్థులచేత ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమం లో రాందేవ్ రావు హాస్పిటల్ మెడికల్ డైరెక్టర్ డాక్టర్ కమలాకర్ , సీఈఓ డాక్టర్ యోబు ఇతర హాస్పిటల్ కాలేజ్ సిబ్బంది పాల్గొన్నారు.

# ఘనంగా సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమం



**కూకట్పల్లి (ప్రజాబలం) జనవరి 23:**శ్రీ సరస్వతి శిశు మందిర్ హై స్కూల్, కూకట్‌పల్లి ప్రాంగణంలో సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. ఈ పవిత్ర కార్యక్రమంలో 32 మంది చిన్నారులు తమ తల్లిదండ్రులతో కలిసి పాల్గొన్నారు. పూజా కార్యక్రమాన్ని పాఠశాల ప్రబంధకారిణి అధ్యక్షులు చింత వైకుంఠం దంపతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్. రాంచందర్ రావు బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులుఎం. కాంతారావు బీజేపీ కూకట్‌పల్లి ఇన్‌చార్జ్ , ఈ కార్యక్రమంలో పాల్గొని విద్యార్థులకు ఆశీస్సులు అందించారు. అలాగే ఈ కార్యక్రమంలో సమితి కోశాధికారి నాగేశ్వర రావు , కమిటీ సభ్యులు రఘువీర్ రావు , మధుసూధన్ , సమితి కార్యదర్శి డా. నీలిమా రావు పీచారా ,యం. రమేష్ ప్రధానాచార్యులు , తల్లిదండ్రులు, విద్యార్థులు ఆచార్యులు పాల్గొన్నారు.

# బిఆర్ఎస్ లో చేరిన వేములవాడ 26వ వార్డు నాయకులు.

## 26వ వార్డు కౌన్సిలర్ బిఆర్ఎస్ అభ్యర్థిగా మామిండ్ల జమున-కనకరాజు ప్రకటన.



**వేములవాడ టౌన్, (ప్రజాబలం),** వేములవాడ పట్టణంలో శుక్రవారం రోజున బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు ఇన్నాడి సత్యనారాయణ రెడ్డి, చీటీ రాధా కిషన్ రావు ఆధ్వర్యంలో సుమారు 30 మంది యువకులు వేములవాడ నియోజకవర్గం బిఆర్ఎస్ పార్టీ ఇన్చార్జ్ చల్మెడ లక్ష్మీనరసింహారావు సమక్షంలో పార్టీలో చేరడం జరిగింది. పార్టీలో చేరిన చందనం శ్రీనివాస్, పబ్బ శ్రీకాంత్, గంగరాజు యాదవ్, భయానా భరత్, దిలీప్ యాదవ్, రోహన్, శశి, కృష్ణ, సాయి, వరుణ్, రాకేష్, రాజేష్, అరుణ్, సురేష్, నాగిశెట్టి నారాయణ, దేవరాజు, రాజయ్యలకు చల్మెడ లక్ష్మీ నరసింహారావు పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా చల్మెడ మాట్లాడుతూ త్వరలో జరగనున్న వేములవాడ మున్సిపల్ ఎన్నికలలో గతంలో లాగా మున్సిపల్ పై బిఆర్ఎస్ జెండా ఎగరవేయడం ఖాయమని ఆయన అన్నారు. వేములవాడ పట్టణ ప్రజలంతా బిఆర్ఎస్ అభ్యర్థులకు ఓటు వేసి గెలిపించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ప్రజలకు చేసింది ఏమీ లేదని ఆయన ఈ సందర్భంగా తీవ్రంగా విమర్శించారు. ఈ కార్యక్రమంలో వేములవాడ మాజీ సెస్ డైరెక్టర్ రామతీర్థపు రాజు, వేములవాడ మాజీ మున్సిపల్ కౌన్సిలర్లు నిమ్మశెట్టి విజయ్, గోలి మహేష్, సిరిగిరి చందు, అంజాద్ పాషా, దుర్శెట్టి ప్రేమ్ చారి, బొల్గం దేవరాజు,

# స్వాతంత్రం కోసం ప్రత్యేక ఆర్మీ ని ఏర్పాటు చేసిన గొప్ప వ్యక్తి సుభాష్ చంద్రబోస్.

## శాతరాజు పల్లి గ్రామంలో ఘనంగా బోస్ జయంతి వేడుకలు.
## వేములవాడ బార్ అసోసియేషన్ అధ్యక్షులు గుడిసె సదానందం.



**వేములవాడ టౌన్, (ప్రజాబలం),** భారతదేశ స్వాతంత్రం కోసం ఇండియన్ నేషనల్ ఆర్మీని స్థాపించి, స్వాతంత్రోద్యమంలో కీలక పాత్ర పోషించిన వ్యక్తి సుభాష్ చంద్రబోస్ అని వేములవాడ బార్ అసోసియేషన్ అధ్యక్షులు గుడిసె సదానందం అన్నారు. శుక్రవారం రోజున సుభాష్ చంద్రబోస్ 129 వ జయంతిని వేములవాడ మున్సిపల్ విలీన గ్రామమైన శాతరాజు పల్లి గ్రామంలో ఘనంగా నిర్వహించడం జరిగింది. సుభాష్ చంద్రబోస్ చిత్రపటానికి పూలమాలలు వేసి, కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గుడిసె సదానంద మాట్లాడుతూ బ్రిటిష్ వారి చర నుండి భారతదేశంకు విముక్తి కల్పించాలనే ఉద్దేశంతో విదేశాలలో ఉన్న భారతీయులతో కలిసి ఆజాద్ హింద్ ఫౌజ్ ను స్థాపించి, బ్రిటిష్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రత్యేక ఆర్మీని ఏర్పాటు చేసి స్వాతంత్రాన్ని సాధించిన గొప్ప వ్యక్తి సుభాష్ చంద్రబోస్ అని ఆయన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట సుభాష్ యూత్ అధ్యక్షులు వికృతి సాయి, మాజీ ఫ్యాక్స్ ఛైర్మన్ ఏనుగు తిరుపతిరెడ్డి, నల్ల సతీష్ రెడ్డి, గుడిసె అనిల్, ఆయుత వెంకటేష్, కిషన్ రెడ్డి, మధు, బండ మహేందర్, వీరేందర్, భూపేందర్ రెడ్డి, దాస్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



# రోడ్డు భద్రత పై అవగాహన కోసం వేములవాడ పట్టణంలో వాక్ థాన్-రన్ ఫర్ రోడ్ సేఫ్టీ 2 కే రన్.

## ప్రజలు, యువత, విద్యార్థులు, ప్రజాప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలి.
## జిల్లా పోలీస్ కార్యాలయంలో పోలీస్ అధికారులతో కలిసి వాక్ థాన్-రన్ ఫర్ రోడ్ సేఫ్టీ పోస్ట్ అండ్ ఆవిష్కరించిన జిల్లా ఎస్పీ.

**వేములవాడ టౌన్, (ప్రజాబలం),** రోడ్డు భద్రత, ట్రాఫిక్ నియమాలపై ప్రజలు అవగాహన కల్పించడమే లక్ష్యంగా వేములవాడ సబ్ డివిజన్ పోలీస్ శాఖ ఆధ్వర్యంలో శనివారం రోజున ఉదయం 7:00 గంటలకు తెలంగాణ తల్లి విగ్రహం చెక్కపల్లి చౌరస్తా నుండి బాలానగర్ కోర్టు గ్రౌండ్ వరకు నిర్వహిస్తున్న 2 కే రన్ లో ప్రజలు, యువత, విద్యార్థులు, ప్రజా




ప్రతినిధులు, పెద్ద సంఖ్యలో పాల్గొని రోడ్డు భద్రత, ట్రాఫిక్ నియమాలను తప్పనిసరిగా పాటిస్తూ ప్రమాదాలను నివారించడంలో భాగస్వాములు కావాలని రాజన్న సిరిసిల్ల జిల్లా ఎస్పీ మహేష్ బి గీతే తెలిపారు. ఈ కార్యక్రమంలో వేములవాడ ఏఎస్పి రిత్విక్ సాయి, అదనపు ఎస్పీ చంద్రయ్య, సీఐ వెంకటేశ్వర్లు, ఆర్ ఐ లు రమేష్, సురేష్, ట్రాఫిక్ ఎస్ఐ రాజు పాల్గొన్నారు.

# వేములవాడ మున్సిపల్ నూతన కమిషనర్ గా సంపత్ కుమార్ బాధ్యతల స్వీకరణ.



**వేములవాడ టౌన్, (ప్రజాబలం),** శుక్రవారం రోజున వేములవాడ మున్సిపల్ కార్యాలయంలో నూతన కమిషనర్ గా కే. సంపత్ కుమార్ పదవి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కార్యాలయంలో అధికారికంగా పదవి బాధ్యతలు స్వీకరించి, మున్సిపల్ పరిపాలనపై సమీక్ష సమావేశం నిర్వహించారు. వేములవాడ పట్టణ అభివృద్ధి, పారిశుద్ధం, త్రాగునీరు, రోడ్లు, డ్రైనేజ్ వంటి మౌలిక సదుపాయాలపై ప్రత్యేక దృష్టి సారిస్తామని కమిషనర్ పేర్కొన్నారు. ప్రజల సమస్యలకు వేగంగా పరిష్కారం అందించేందుకు పారదర్శకంగా పరిపాలన అమలు చేస్తామని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా మున్సిపల్ అధికారులు, సిబ్బంది నూతన కమిషనర్ కు హార్దిక శుభాకాంక్షలు తెలిపారు.

# వేములవాడలో రైతులకు పనిముట్లు, దివ్యాంగులకు ఉపకరణాల పంపిణీ.

## ముఖ్యఅతిథిగా హాజరైన ప్రభుత్వ విప్ ఆది, ఇన్చార్జి కలెక్టర్ గరీమా అగ్రవాల్.



**వేములవాడ టౌన్, (ప్రజాబలం),** శుక్రవారం రోజున వేములవాడ మార్కెట్ యార్డులో సిరిసిల్ల జిల్లాకు సంబంధించిన సబ్సిడీ వ్యవసాయ యంత్ర పరికరాలు వేములవాడ ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, మరియు రాజన్న సిరిసిల్ల జిల్లా ఇన్చార్జి కలెక్టర్ గరీమ అగ్రవాల్ చేతుల మీదుగా వేములవాడ డివిజన్ రైతులకు అందజేయడం జరిగింది. బ్యాటరీ స్ప్రేయర్స్ 1706, పవర్ స్ప్రేయర్స్ 396, రోటవేటర్స్ 82, కల్టివేటర్స్ 98, పవర్ విడర్లు 8, బ్రష్ కట్టర్స్ 25, పవర్ టిల్లర్స్ 17, స్ట్రా బేలర్స్ 19, మొత్తం వ్యవసాయ యంత్ర పరికరాలు 2369, వీటికి రాష్ట్ర ప్రభుత్వ ఖర్చు 183.72 లక్షలు గా అధికారులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా వేములవాడ ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ రైతులను రాజుగా చేయాలని రాష్ట్ర ప్రభుత్వం ముందుకు పోతుందన్నారు. రైతుల సంక్షేమం కోసం పాటుపడుతుందని, నాడు వైయస్ రాజశేఖర్ రెడ్డి, నేడు రేవంత్ రెడ్డి రైతుల ప్రయోజనాల కోసం పెద్దపీట వేస్తున్నామని పేర్కొన్నారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్నప్పుడు సన్నా, చిన్న కారు రైతులకు అనేక ప్రోత్సాఖాలు అందించామని, మళ్లీ ప్రజా ప్రభుత్వంలో రైతులకు అన్ని రకాల ప్రోత్సాహకాలు అందిస్తున్నామన్నారు. గత ప్రభుత్వం రైతుబంధు ఇచ్చి రైతులకు కావలసిన మిగతా అన్నింటిని బందు చేసిందని ఎద్దేవా చేశారు. కానీ ప్రజా ప్రభుత్వం వచ్చాక రైతులకు 6, రైతు భరోసా ఇస్తూ, అన్ని రకాల ప్రోత్సాహకాలు అందిస్తున్నామని పేర్కొన్నారు. రైతులకు సుమారు 60 వేల కోట్ల వివిధ రూపాలలో ఇవ్వడం జరిగిందన్నారు. గత ప్రభుత్వ హయాంలో



రైతుల పేరు చెప్పి ట్రాక్టర్స్ ఎవరికీ ఇచ్చారు అందరికీ తెలుసునని ఘాటుగా విమర్శించారు. అధికారులు రైతులకు అవగాహన కల్పించాలని, దివ్యాంగులకు రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. దివ్యాంగులకు ఈ సందర్భంగా స్కూటీలను పంపిణీ , మరియు ల్యాప్టాప్ లను పంపిణీ చేయడం జరిగింది. వేములవాడ ఏరియా ఆసుపత్రిలో సదరన్ క్యాంప్ ఏర్పాటు చేయడం జరిగిందని పేర్కొన్న. ఈ కార్యక్రమంలో రాజన్న సిరిసిల్ల జిల్లా వ్యవసాయ అధికారిని అఫ్జల్ బేగం, వేములవాడ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రొండ్డి రాజు, వేములవాడ మండలం వ్యవసాయ అధికారులు ,వేములవాడ ఆర్డీఓ రాదాబాయి, వేములవాడ అర్బన్ తాసిల్దార్ విజయప్రకాష్ రావు, ప్రజా ప్రతినిధులు, రైతులు, భారీ ఎత్తున పాల్గొన్నారు.

# కేరళ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో ఘనంగా వసంత పంచమి వేడుకలు



**హుజురాబాద్ అసెంబ్లీ నియోజకవర్గం ప్రజాబలం ప్రతినిధి జనవరి 23** జమ్మికుంట పట్టణం కేరళ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో వసంత పంచమి సందర్భంగా సరస్వతీ పూజ నిర్వహించారు. పాఠశాల ప్రాంగణమంతా విద్యా పరిమళం వెళ్ళు విరిసింది విద్యార్థులు చదువుల తల్లి సరస్వతి దేవిని అర్చిస్తూ జ్ఞాన కాంతులను ఆహ్వానించారు ఈ సందర్భంగా పాఠశాల చైర్మన్ కె ఎస్ బెన్ని సరస్వతీ దేవికి జ్యోతి ప్రజ్వలన చేస్తూ నూతన విద్యార్థులకు అక్షరాభ్యాస కార్యక్రమాలు చేపట్టారు పాఠశాల చైర్మన్ మాట్లాడుతు నేడు వసంత పంచమి ని సరస్వతి పూజ అని కూడా అంటారు ప్రతి సంవత్సరం మాఘ మాసం 5వ రోజున వసంత పంచమి జరుపుకుంటారు. చదువుల తల్లి సరస్వతీ దేవి ఆవిర్భవించిన రోజు అని అర్థం విద్య కాంతిని వెదజల్లే కాంతి లాగా పిలుస్తారని విద్యార్థులకు తెలియజేసి నూతన విద్యార్థులకు అక్షరాభ్యాసం చేసి పాఠశాలకు ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఉపాధ్యాయురాళ్లు పాల్గొన్నారు విద్యార్థులు, విద్యార్థినిల సరస్వతీ వందనం శాక్ష్మ్రయ నృత్యాలు క్రమశిక్షణతో కూడిన భక్తిని చాటుకున్నారు




# నాణ్యమైన విద్య అందించే దిశగా యంగ్ ఇండియా పాఠశాలల ఏర్పాటు జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్







**ప్రజాబలం మంచిర్యాల జిల్లా జనవరి 23 :** విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రతి నియోజకవర్గంలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలలను ఏర్పాటు చేస్తుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శుక్రవారం జిల్లాలోని బెల్లంపల్లి పట్టణంలో డి.సి.పి. ఎ.భాస్కర్,బెల్లంపల్లి నియోజకవర్గ శాసనసభ్యులు గడ్డం వినోద్, బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్,టి జి ఈ డబ్ల్యూ ఐ డి సి ఈ.ఈ.,జిల్లా విద్యాధికారి యాదయ్య,బెల్లంపల్లి మున్సిపల్ కమిషనర్ జె.సంపత్ లతో కలిసి యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... విద్యావ్యవస్థను మరింత పటిష్టం చేసే లక్ష్యంలో భాగంగా జిల్లాలో 3 ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలలను ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. బెల్లంపల్లి నియోజకవర్గ పరిధిలోని విద్యార్థులకు అందుబాటులో ఉండే విధంగా బెల్లంపల్లి పట్టణంలో 200 కోట్ల రూపాయల వ్యయంతో నిర్మాణానికి అనువైన 25 ఎకరాల విస్తీర్ణంలో పాఠశాల ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపట్టడం జరిగిందని తెలిపారు. విద్యా రంగ అభివృద్ధి కొరకు ప్రభుత్వం అధిక మొత్తంలో నిధులు కేటాయించడం జరుగుతుందని, విద్యార్థులందరికీ ఉపయోగపడే విధంగా పాఠశాల నిర్మాణం జరుగుతుందని తెలిపారు.జిల్లాలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాల అభివృద్ధికి ఒక్కొక్క పాఠశాలకు 1 కోటి రూపాయల చొప్పున మంజూరు చేసి చర్యలు చేపట్టడం జరుగుతుందని తెలిపారు. ప్రతి ప్రభుత్వ పాఠశాలలో త్రాగునీరు, విద్యుత్,ప్రహరీ గోడ, విద్యార్థినీ విద్యార్థులకు వేరువేరుగా మూత్రశాలలు ఇతర సదుపాయాలు కల్పించడం జరుగుతుందని తెలిపారు. 30 మంది విద్యార్థుల వరకు ఒకరు, 30 నుండి 60 మంది విద్యార్థుల వరకు ఇద్దరు ఉపాధ్యాయుల చొప్పున నిష్ణాతులైన ఉపాధ్యాయులను నియమించి విద్యార్థులకు నాణ్యమైన విద్య బోధన అందించడం జరుగుతుందని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలలో మెనూ ప్రకారం పౌష్టిక ఆహారం అందిస్తూ విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించడంతో పాఠశాలలలో విద్యార్థుల హాజరు శాతం పెరిగిందని,రాష్ట్రంలోనే మంచిర్యాల జిల్లాలో ప్రభుత్వ పాఠశాలలలో విద్యార్థుల సంఖ్య ఈ విద్యా సంవత్సరంలో గణనీయంగా పెరిగిందని తెలిపారు. యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలలో విద్యార్థులకు డైనింగ్ హాల్, ఆట స్థలం, ఇతర అన్ని సౌకర్యాలు కల్పించడం జరుగుతుందని తెలిపారు. రాష్ట్రంలోని ప్రతి నియోజకవర్గంలో పాఠశాలను ఏర్పాటు చేసి 2 వేల 500 మందికి పైగా విద్యార్థులకు 5వ తరగతి నుండి 12వ తరగతి వరకు సకల సౌకర్యాలతో కూడిన నాణ్యమైన విద్యను అందించడం జరుగుతుందని, కుల మతాలతో సంబంధం లేకుండా విద్యార్థులందరికీ ఒకే రకమైన విద్య, ఏకరూప దుస్తులు అందించడం జరుగుతుందని తెలిపారు. విద్యార్థులకు వసతి గృహంతో పాటు ఉపాధ్యాయులకు ప్రత్యేక వసతి ఏర్పాట్లు చేయడం జరుగుతుందని తెలిపారు. పనులు వేగవంతం చేసి 2027 విద్యా సంవత్సరంలో తరగతులు ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటామని, పనులు త్వరితగతిన పూర్తి చేసేందుకు అవసరమైన నిధులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు.ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు,ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

# పట్లూర్ పేదలకు వరం ఇందిరమ్మ ఇల్లు మర్పల్లి మండలం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సురేష్ యాదవ్



**వికారాబాద్ నియోజకవర్గం ప్రతినిధి జనవరి 23 (ప్రజాబలం) వికారాబాద్ జిల్లా:** మర్పల్లి మండలంపట్లూర్,గ్రామంలోమర్పల్లి మండల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సురేష్ యాదవ్, గ్రామ సర్పంచ్ పరుశురాం, ఇంద్రమ్మ ఇల్లు ముగ్గు వేయడం జరిగిందని తెలిపారు, పదేళ్ల సుదీర్ఘకాలంలో ఏ ఒక్కరికి ఇల్లు మంజూరు లేక నిరుపేదలుగా ఉన్న కుటుంబాలకు ఇందిరమ్మ ఇల్లు రావడం పట్ల కుటుంబంలో పేదింటికల్లా నెరవేరిందని సంతోషం వ్యక్తపరిచినట్లు తెలిపారు ప్రజల క్షేమం కోసం ప్రజా సంక్షేమం కోసం ఏదైనా ఉందంటే అది కేవలం కాంగ్రెస్ ప్రభుత్వమేనని నిజమై నా అర్హులందరికీ ఇందిరమ్మ ఇల్లు విడతలవారీగా ప్రతి నిరుపేద కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు వస్తుందని మర్పల్లి మండలంకాంగ్రెస్ పార్టీ ప్రెసిడెంట్ సురేష్ యాదవ్ తెలిపారు ఈ కార్యక్రమంలో మర్పల్లి మండలకాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సురేష్ యాదవ్, గ్రామ సర్పంచ్ పరుశురాం ,ఉప సర్పంచ్ అఖిల్ , మాజీ ఎంపిటిసి మహేష్,వార్డు మెంబర్లు గోవర్ధన్, మరియుపెద్దలు యువకులు నాయకులు కార్యక్రమంలో పాల్గొన్నారు

# అతివేగంగా, నిర్లక్ష్యంగా బస్సు నడుపుతూ ముగ్గురి మరణానికి కారణమైన డ్రైవర్ కు 02 సంవత్సరాలు జైలు శిక్ష.



**వేములవాడ టౌన్, (ప్రజాబలం),** అతివేగంగా, నిర్లక్ష్యంగా బస్సు నడుపుతూ ముగ్గురి మరణానికి కారణమైన బస్సు డ్రైవర్ వరకోలు ఐలయ్యకు 02 సంవత్సరాల జైలు శిక్ష విధిస్తూ జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ జ్యోతిర్మయి తీర్పు వెల్లడించినట్లు వేములవాడ రూరల్ సిఐ శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. వేములవాడ రూరల్ మండలం నమిలి గుండు పల్లికి చెందిన ఈఢ్ల కొమురయ్య తన మేనకోడలు, మేనకోడలు భర్త, మేనకోడలు బావ కొడుకు కొమురయ్య ఇంట్లో శుభకార్యానికి హాజరై తిరుగు ప్రయాణంలో వారి స్వగ్రామమైన గౌరవరం వెళుచుండగా వేములవాడ రూరల్ మండలం పాజుల్ నగర్ గ్రామ శివారులో వేములవాడ బస్సు డిపోకు చెందిన బస్సు డ్రైవర్ అతివేగంగా, నిర్లక్ష్యంగా బస్సు నడుపుతూ వారి వాహనాన్ని ఢీకొట్టగా, వారు మరణించగా వేములవాడ రూరల్ పోలీస్ స్టేషన్లో కొమురయ్య ఫిర్యాదు చేయగా అప్పటి ఎస్సై రాజశేఖర్ కేసు నమోదు చేసి నిందితుని రిమాండ్ కు తరలించడం జరిగింది. అనంతరం అప్పటి వేములవాడ రూరల్ సిఐ మాధవి కోర్టులో చార్జి షీట్ దాఖలు చేయగా సీఎం ఎస్ ఐ శ్రావణ్ ఆధ్వర్యంలో కోర్టు కానిస్టేబుల్ సాక్షులను ప్రవేశపెట్టగా ప్రాసిక్యూషన్ తరపున పబ్లిక్ ప్రాసిక్యూటర్ విక్రాంత్ వాదించగా కేసు పూర్వాపరాలను పరిశీలించిన మెజిస్ట్రేట్ జ్యోతిర్మయి నిందితుని కి 02 సంవత్సరాల కఠిన కారాగార శిక్ష, 10,000/ రూపాయల జరిమానా విధించినట్లు వేములవాడ రూరల్ సిఐ శ్రీనివాస్ తెలిపారు.

Edited ,Printed Published & Owned by A.SRAVANTHI ,Printed at: SRAVANTHI ENTER PRISES 1-9-18/A,Ramnagar,Hyderabad - 500020, T.S
and Published at 5-2-518,Osmangunj ,Risala Abdulla,Hyderabad -95 Editor; A.SRAVANTHI, RNI NO ; TELTEL/2005/16755 Cell ; 92921 04449
Email;prajaabalamnews@gmail.com